మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


నేడు కాంగ్రెస్‌లోకి బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్?
రేపు మరో ఐదుగురు ఎమ్మెల్యేల చేరిక?


03



సంపుటి 27, సంచిక: 28 | శుక్రవారం | 12-07-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00




## 24 నుండి శాసనసభ బడ్జెట్ సమావేశాలు

25 లేదా 26న పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈనెల 24 నుండి జరగనున్నాయి. వారం రోజుల పాటు సమావేశాలను నిర్వహించి, ఈనెల 23న కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులను బట్టి పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 25న లేదా 26వ తేదీన రాష్ట్ర పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న సమాచారం. రైతు భరోసా, రైతు రుణమాఫీ, కొత్త ఆర్ఓఆర్ చట్టం, తెలంగాణ చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం మార్పులపై సమావేశాలలో చర్చ జరగనుంది. మరోవైపు పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్నది. ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిన గ్యారెంటీల అమలు, నిరుద్యోగుల ఆందోళన, శాంతిభద్రత అంశాలపై ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు అసెంబ్లీ వేదికగా ప్రశ్నించే అవకాశం ఉంది.

**సమావేశాల నిర్వహణపై సమీక్ష**

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వివిధ శాఖాధికారులతో సమీక్షించారు. సమావేశ నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ తరువాయి 2లో



# నిర్దేశిత ఆర్థిక లక్ష్యాలు సాధించాలి

నెలనెలా ఆదాయ లక్ష్యం పెట్టుకోవాలి

ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయం ఆశాజనకంగా లేదు

పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలి

అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

ప్రజాపక్షం/ హైదరాబాద్

రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విభాగం నెలవారీగా లక్ష్యాలను తయారు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు సాధించిన పురోగతిని బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆదాయం తెచ్చి పెట్టే వనరులపై, పన్నుల వసూళ్లపైన అధికారులు నిక్కచ్చిగా ఉండాలని ఆదేశించారు. సంబంధిత విభాగాన్ని అవసరమైతే పునర్వ్యవస్థీకరించుకోవాలని, ఆదాయం రాబట్టేందుకు వీలైనన్ని సంస్కరణలు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సచివాలయంలో దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశంలో వివిధ అంశాలను చర్చించారు. ఎంచుకున్న వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకా నెలా మంత్లీ టార్గెట్ ను నిర్దేశించుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. నెలవారీ సమీక్షతో పాటు ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు. ప్రధానంగా రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే జీఎస్టీ ఆదాయం పెంచుకునే చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పక్కాగా తరువాయి 2లో

## ఆశించిన స్థాయిలో ఎంపి సీట్లు ఎందుకు రాలేదు?

# కురియన్ కమిటీ పోస్టుమార్టం

బిఆర్‌ఎస్, బిజెపి లోపాయికారి అవగాహన వల్ల కాంగ్రెస్‌కు నష్టం

అధికారంలో ఉన్నామనే అతివిశ్వాసం కొంప ముంచింది

అభిప్రాయాలు వ్యక్తం చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నేతలు

ప్రజాపక్షం / హైదరాబాద్



లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి లోపాయికారి అవగాహన వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరిగిందని, కొన్ని నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టిక్కెట్లు ఇవ్వడం వల్ల కూడా కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితాలు రాలేదని పలువురు కాంగ్రెస్ నాయకులు ఎఐసిసి కురియన్ కమిటీకి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గతంలో బిఆర్‌ఎస్ మాదిరిగానే కాంగ్రెస్‌కు కూడా లోక్‌సభ ఎన్నికల్లో ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ నాయకులు ఆశించారని, ఈ అతి విశ్వాసమే పార్టీకి కొంత ఇబ్బందిని కలిగించదని నాయకులు చెప్పారు. మరోవైపు నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం కూడా కాంగ్రెస్‌కు సీట్లు తగ్గడానికి కొంత కారణమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, లోక్‌సభ ఎన్నికల్లో 12 నుంచి 14 వరకు ఎంపి స్థానాల్లో గెలుస్తుందని అంచనా వేసినప్పటికీ సీట్లు తగ్గడంపై కమిటీ ఆరా తీస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితాలు రాకపోవడంపై సమీక్షించేందుకు ఎఐసిసి ఏర్పాటు చేసిన కురియన్ కమిటీ సభ్యులు బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకోగా గురువారం గాంధీభవన్‌లో మకాం వేశారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన 17 మంది అభ్యర్థులతో భేటీలతో కురియన్ కమిటీ తరువాయి 2లో

## తాత్కాలికంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

ఆధార్ నెట్‌వర్కింగ్‌లో సాంకేతిక సమస్యలు

నేటికి రీ షెడ్యూల్ చేసిన రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల సర్వీసులు గురువారం తాత్కాలికంగా నిలిచిపోయాయి. దీంతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల సర్వీసులను శుక్రవారానికి రీషెడ్యూల్ చేసినట్టు ప్రభుత్వం తెలియ జేసింది. యుఐడిఎఐ నెట్‌వర్కింగ్‌లో తలెత్తిన సాంకేతిక కారణాలతో దేశవ్యాప్తంగా ఆధార్ ఆధారిత సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రిజిస్ట్రేషన్లకు ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి కావడంతో రిజిస్ట్రేషన్లు కూడా రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయాయి. సాంకేతిక కారణంతో రిజిస్ట్రేషన్, సాంపుల శాఖ సేవలు నిలిచిపోయాయి. దీంతో రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు బారులు తీరారు. స్థానికంగా ఆ ప్రాంతాలు రద్దీగా మారాయి. సాధారణంగా ప్రతి రోజూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఏడువేలకు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే సాంకేతిక కారణంగా గురువారం కేవలం ఒక వేయి డాక్యూమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగినట్టు రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ వెల్లడించింది. ఆధార్ సర్వర్‌లో కలిగిన సాంకేతిక సమస్య కారణంగా ఇబ్బంది పడిన ప్రజలకు, వారికి జరిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్టు ఆ శాఖ గురువారం పేర్కొంది. సాంకేతిక సమస్య అర్ధరాత్రి వరకు పరి

## పెండింగ్ డిమాండ్ల సాధనకు

# మళ్లీ ఉద్యమిస్తాం

సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన



**న్యూఢిల్లీ:** పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం మరో ఉద్యమానికి సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సిద్ధమైంది. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చట్టం, రుణమాఫీ, పంట బీమా, రైతులు, వ్యవసాయ కార్మికులకు పింఛన్, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు ఉపసంహరణ తదితర డిమాండ్ల సాధనకు ఉద్యమాన్ని పునరుద్ధరించాలని సంకల్పించింది. విడిగా వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టాలని కేంద్రప్రభుత్వాన్ని ఎస్‌కేఎం డిమాండ్ చేసింది. కేంద్ర సహకార శాఖను రద్దు చేయాలని, వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ విధించరాదని, జీఎస్టీ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేసింది. సహకార ఫెడరిలాజాన్ని, జాతీయ జల వనరు విధానం ఆధారిత పటిష్ఠ సంఘం కోసం పన్నులపై రాష్ట్ర ప్రభుత్వ హక్కులకు హామీనిచ్చేలా జీఎస్టీ చట్టాన్ని సవరించాలని కేంద్రానికి సూచించింది. చారిత్రక రైతాంగ ఉద్యమప్పుడు ప్రాణాలు కోల్పోయిన 736 మంది రైతుల సన్మానార్థం సింఘు/టిక్రీ సరిహద్దుల వద్ద స్మారకాన్ని ఏర్పాటు చేయాలని కూడా ఎస్‌కేఎం డిమాండ్ చేసింది. ఈనెల 16, 17, 18 తేదీల్లో వినతులతో పాటు డిమాండ్ పత్రాలను ప్రధానికి, ప్రతిపక్ష నాయకుడికి, పార్లమెంటు సభ్యులకు అందజేయాలని పిలుపునిచ్చింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నుంచి నిష్క్రమించాలని, వ్యవసాయోత్పతులు, వాణిజ్యంలో ఎంఎన్‌సీలు రద్దు కోసం డిమాండ్ చేసింది. ఆగస్టు 9వ తేదీని కార్పొరేట్ల క్విట్ ఇండియా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించింది. ఐక్యఉద్యమాల కోసం కేంద్ర కార్మిక సంఘాలతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామని నిశ్చయించింది. సంయుక్త కిసాన్ సర్వసభ్య సమావేశం డాక్టర్ అశోక ధవలే, డాక్టర్ దర్శన్ పాల్, యుధ్వీర్ సింగ్, బల్బీర్ సింగ్ రాజేవాల్, రావుల వెంకయ్య, మేధా పాట్కర్, సత్యవాన్, రుల్డు సింగ్ మాన్సా, డాక్టర్ సునీలం, అవిక్ సహా, డాక్టర్ ఆశీష్ మిట్టల్, తజిందర్ సింగ్ విర్క్, కన్వర్జిత్ సింగ్, హన్నన్ మొల్లా అధ్యక్షతన జరిగింది. 17 రాష్ట్రాల నుంచి 143 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సర్వసభ్య సమావేశాల నిర్ణయాలను న్యూఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నేతలు రావుల వెంకయ్య, హన్నన్ మొల్లా, యుధ్వీర్ సింగ్, సునీలం, అవిక్ సహా, కృష్ణప్రసాద్, ప్రేమ్ సింగ్ గెహ్లావత్ ప్రకటించారు. రైతు నాయకులు అమ్రారం (రాజస్థాన్‌సిఖర్), రాజారామ్ సింగ్ (బీహార్‌కారకట్), సుదామా ప్రసాద్ (బీహార్‌అర్రా), ఆర్.సచితానంతమ్ (తమిళనాడుదిండిగుల్) పార్లమెంటుకు ఎన్నిక కావడంపై సర్వసభ్య సమావేశం హర్షం వ్యక్తంచేసిందన్నారు. బీజేపీ నేతృత్వ ఎన్డీయే కార్పొరేట్ అనుకూల విధానాల్లో మార్పును ఆశించాల్సిన అవసరం లేదని, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు తప్పబోవని తీర్మానించిందని చెప్పారు. ఆగస్టు 17న ఎస్‌కేఎం పంజాబ్ శాఖ అధ్వర్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రుల ఇళ్ల ఎదుట మూడు గంటల పాటు రైతులు ధర్నా చేస్తారని ప్రకటించారు. పంజాబ్‌లో నీటి ఎద్దడి, రుణభారం, ఇండియాపాకిస్థాన్ వాణిజ్యం కోసం రోడ్డు కారిడార్లు తెరిపించడం వంటి అనేక అంశాలపై తరువాయి 2లో

## నీట్‌పై సుప్రీం విచారణ

# 18వ తేదీకి వాయిదా




న్యూఢిల్లీ: వివాదాస్పదంగా మారిన వైద్య ప్రవేశ పరీక్ష నీట్ యుజి 2024పై దాఖలైన పిటిషన్లను ఈనెల 18న విచారిస్తామని సుప్రీంకోర్టు గురువారం తెలిపింది. కేంద్ర ప్రభుత్వంతోపాటు, నీట్ యుజిని నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) దాఖలు చేసిన అఫిడవిట్ల కాపీలు సంబంధిత పిటిషనర్ల తరఫు న్యాయవాదులకు అందలేదని, వాదనల నిమత్తం వారికి కొంత సమయం అవసరం కాబట్టి కేసును వాయిదా వేస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. నీట్‌లో అవకతవకలు జరిగాయని, పేపర్ కూడా లీకైందని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, దేశ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, తాజాగా నీట్ యుజిని ప్రకటించాలని కోరుతూ వివిధ కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీం కోర్టులోనూ ఈ పిటిషన్ల విచారణ జరుగుతున్నది. తుది తీర్పు ఇచ్చే వరకూ ఈ అంశానికి సంబంధించిన పిటిషన్లను విచారించరాదని ఇప్పటికే అన్ని కోర్టులకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా నీట్ యుజి పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్‌పై సమాధానాన్ని అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్‌టిఎను కూడా ఆదేశించింది. కాగా, ఈ పరీక్షలో మాస్ మాల్‌ప్రాక్టీస్ జరిగిందనడానికిగానీ, కొన్ని కేంద్రాల్లో విద్యార్థులు లబ్ధి పొందేలా అక్రమాలు జరిగాయనడానికిగానీ ఆధారాలు లేవని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం తెలిపింది. మద్రాస్ ఐఐటీ నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాల డేటా విశ్లేషణలో, మార్కుల పంపిణీలో అసాధారణ అంశాలేవీ కనిపించలేదని పేర్కొంది. మార్కులు సాధారణంగానే ఉన్నాయని తెలిపింది. 2024–25 విద్యాసంవత్సరానికిగానూ అండర్ గ్రాడ్యుయేట్ సీట్లకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ, జులై మూడో వారం నుంచి నాలుగు రౌండ్లలో నిర్వహించనున్నట్లు సుప్రీంకోర్టుకు సమర్పించిన అదనపు అఫిడవిట్‌లో వెల్లడించింది. ఇప్పటికే కేసును సిబిఐ విచారిస్తున్నదని గుర్తుచేసింది. ఎన్‌టిఎ కూడా దాదాపు ఇలాంటి అంశాలతోనే అఫిడవిట్ ఇచ్చినట్టు సమాచారం. వాటి కాపీలను పిటిషనర్ల తరఫు లాయర్లకు పంపినట్టు కేంద్రం, ఎన్‌టిఎ ప్రకటించాయి. అయితే, కొందరు న్యాయవాదులు తమకు కాపీలు అందలేదని చెప్పడంతో, సుప్రీం కోర్టు ధర్మాసనం కేసును వచ్చే గురవారానికి వాయిదా వేసింది.



# నేరుగా హాజరు కండి

కెసిఆర్‌కు నేడో రేపో నోటీసులు జారీ?

ప్రజాపక్షం / హైదరాబాద్

బిఆర్‌ఎస్ అధినేత , మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు పవర్ కమిషన్ మరో సారి ఛాన్ ఇవ్వనుందా? ఈ సారి లేఖతో సరిపెట్టకుండా నేరుగా కమిషన్ ముందు హాజరు కావాలని కోరనున్నారా? అంటే ఔననే సమాధానాలు వినవస్తున్నాయి. ఇందులో భాగంగా పవర్ కమిషన్ ముందు నేరుగా హాజరు కావాలంటూ నేడో, రేపో కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా కెసిఆర్ ఇష్టారీతిగా స్పందించడంపై మరో సారి నోటీసులు జారీ చేస్తారని అంటున్నారు. తొలి సారి కమిషన్‌ను ప్రశ్నిస్తూ వారికి సమాధానం పంపించిన కెసిఆర్.. రెండో సారి మాత్రం తమ పిటిషన్‌పై హైకోర్టును ఆశ్రయించి తనకు నోటీసు ఇచ్చే అధికారం లేదంటూ వాదనలు వినిపించిన విషయం తెలిసిందే. అంతే కాకుండా విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో కమిషన్‌కు 12 పేజీల లేఖ రాస్తూ కమిషన్ తరువాయి 2లో

## పార్లమెంటులో మణిపూర్ అంశాన్ని

# పూర్తి శక్తితో లేవనెత్తుతాం



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ :** హింసాత్మక ఘర్షణలతో అల్లాడుతున్న రాష్ట్రంలో విషాదాన్ని అంతం చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కాంగ్రెస్, ఇండియా ఐక్య సంఘటన పార్లమెంటులో పూర్తి శక్తితో మణిపూర్‌లో శాంతి ఆవశ్యకతను లేవనెత్తుతుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా మణిపూర్‌లో పర్యటించాలని, రాష్ట్ర ప్రజల సమస్యలను వినాలని, శాంతి కోసం విజ్ఞప్తి చేయాలని కూడా ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం మణిపూర్‌లో హింసాకాండకు గురైన మణిపూర్‌లో తన రోజంతా పర్యటన సందర్భంగా అక్కడి ప్రజలతో తాను జరిపిన సంభాషణల వీడియోను పంచుకుంటూ గాంధీ 'ఎక్స్' పై హిందీలో చేసిన పోస్ట్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. 'మణిపూర్‌లో హింస చెలరేగినప్పటి నుంచి నేను మూడుసార్లు సందర్శించాను. కానీ పరిస్థితిలో ఎటువంటి మెరుగుదల లేదు. నేటికీ రాష్ట్రం రెండు ముక్కలుగా విభజించబడింది. ఇళ్లు కాలిపోతున్నాయి. అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయి. వేలాది కుటుంబాలు సహాయ శిబిరాల్లో నివసిస్తున్నారు' అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తరువాయి 2లో

## గాజా విషయంలో

# నాటో ద్వంద్వ ప్రమాణాలొద్దు

ఉక్రెయిన్‌కు ఇచ్చినట్లుగానే మద్దతు ఇవ్వాలి

నాటో వేదికపై స్పెయిన్ ప్రధాని సంచలన వ్యాఖలు



వాషింగ్టన్ :ఉక్రెయిన్ విషయంలో అవలంభించినట్లుగానే గాజా విషయంలో కూడా అదే ఐక్యత, స్థిరత్వాన్ని ప్రదర్శించాలని స్పెయిన్ ప్రధాన మంత్రి పెడ్రో సాంచెజ్ డిమాండ్ చేశారు. నాటో 75వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగానాటో పబ్లిక్ ఫోరమ్‌లో సాంచెచ్ మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టాలను పరిరక్షించేందుకే మనం ఉక్రెయిన్‌కు మద్దతిస్తున్నామని మన పౌరులకు చెబుతున్నప్పుడు, గాజా విషయంలో కూడా అదే అవలంభించాలని అన్నారు. నాటో ద్వంద్వ ప్రమాణాలు అవలంభిస్తోందనే మనపై నిందలు వద్దని , అది ఉక్రెయిన్‌కు ఇస్తున్న మద్దతును బలహీనపరుస్తుందన్నారు. ఉక్రెయిన్ విషయంలో స్పందించినట్లుగానే గాజా విషయంలో కూడా అదే ఐక్యత, నిలకడ పాటించాలని డిమాండ్ చేశారు. గాజాలో అత్యవసరంగా కాల్పుల విరమణ జరిగేందుకు పరిస్థితులను తక్షణమే సృష్టించాలని, లేదంటే లెబనాన్‌లో కూడా ముప్పు పెరిగే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు.

# కౌలు రైతు గుర్తింపు ఎలా?

**రైతు భరోసాలో వాటాకు పట్టాదారుల విముఖత**

ప్రజాపక్షం/ఖమ్మం



రైతు భరోసా పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్న నేపథ్యంలో కౌలు రైతుల అంశంగా విస్తృతంగా చర్చలోకి వస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 30 శాతం మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా ఉండగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు కొన్ని జిల్లాల్లో 40 శాతానికి పైబడి కౌలు రైతులు ఉన్నట్లు సమాచారం. భూయజమానికి ప్రభుత్వం రైతు భరోసా ద్వారా ఆర్థిక సాయం అందించనున్న నేపథ్యంలో వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతు పరిస్థితి ఏమిటి, ప్రభుత్వం ఏవిధంగా ఆదుకోవాలన్న విషయంలో అనుసరించాల్సిన మార్గాలు ఏమిటి అన్న దానిపై స్పష్టమైన అభిప్రాయం రావడం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించే విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ పేరిట సమావేశాలు నిర్వహిస్తుంది. భూ యజమానులకు ఇచ్చే రైతు భరోసా ఎంత భూమికి పరిమితం చేయాలి, ఏ భూములకు రైతు భరోసా వర్తింపజేయాలి అన్న దానిపై చర్చ అవసరమే కానీ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ నిబంధనలలో కౌలు రైతును ఆర్థికంగా కానీ, మరోవిధంగా కానీ సాయం అందించే మార్గం కనిపించడం లేదు. భూ యజమానికి కౌలు రైతుకు మధ్య ఒప్పందంలో రైతు భరోసా అంశం కూడా చర్చకు వచ్చి దానిపై ఆధారపడి కౌలును నిర్ణయించుకుంటున్నారు. ఇటువంటి సమయంలో రైతు భరోసాలో కౌలు రైతుకు వాటా కానీ మరో విధంగా కానీ లాభం చేకూరే మార్గం లేదు. ఇక కౌలు రైతుకు, భూ యజమానికి మధ్య జరిగిన ఒప్పందాన్ని వ్రాత పూర్వకంగా ప్రభుత్వానికి ధృవీకరించేందుకు భూ యజమాని తరువాయి 2లో



# కాలిఫోర్నియాలో కాల్పులు

## ముగ్గురు మృతి

**అలమెడ:** కాలిఫోర్నియాలోని ఓ ఇంట్లో కాల్పుల ఘటన కలకలం రేపింది. ఓ వ్యక్తి ఇంటోకి చొరబడి కాల్పులకు తెగబడినట్లు తెలిసింది. ఈ ఘటనలో ముగ్గురు చనిపోగా పిల్లలతో పాటు కొందరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అలమెడ నగరంలోని కిట్టి హాక్ రోడ్డులోగల 400వ బ్లాకులో తన పొరుగింటిలో కాల్పులు జరిగినట్లు ఓ వ్యక్తి తమకు సమాచారం ఇచ్చినట్లు 'ఫేస్‌బుక్'లో అలమెడ పోలీసు శాఖ తెలిపింది. ఘటనాస్థలానికి వెళ్లి చూడగా కొందరు కుటుంబ సభ్యులు గాయపడినట్లు గుర్తించామని, ముగ్గురు చనిపోయినట్లు తెలపడం బాధాకరమని పేర్కొంది. అయితే కాల్పులకు కారణమేమిటో తెలియాల్సి ఉన్నట్లు తెలిపింది. గాయపడిన వారు స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని పోలీసులువెల్లడించారు.



# 21 ఒప్పందాలపై బంగ్లాదేశ్, చైనా సంతకాలు

## మరో ఏడు ప్రాజెక్టుల ప్రకటన

**బీజింగ్:** బంగ్లాదేశ్, చైనా మధ్య 21 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేలా కొత్తగా ఏడు ప్రాజెక్టులను రెండు దేశాలు ప్రకటించాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని లియాంగ్‌తో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా బీజింగ్‌లోని గ్రేట్ పీపుల్స్‌హాల్‌లో భేటీ అయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య సయోధ్య, వాణిజ్యంపై మాట్లాడుకున్నారు. తమ మధ్య వ్యూహాత్మక భాగస్వామాన్ని... సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యంగా మార్చుకోవాలని నిర్ణయించారు. బంగ్లాదేశ్‌కు నాలుగు విధాలా ఆర్థిక సహకారాన్ని చైనా అందిస్తుందని సమావేశంలో జిన్‌పింగ్ తెలిపారు. నిధులు సమకూర్చడమే కాకుండా వడ్డీలేని రుణాలు, రాయితీలతో కూడిన రుణాలు, వాణిజ్య రుణాలను అందిస్తుందని వెల్లడించారు. కాగా, ఇద్దరు అధినేతల మధ్య చర్చలు ఫలప్రదంగా సాగినట్లు బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి డాక్టర్ హసన్ మెహమూద్ వెల్లడించారు. రొహింగ్యాలు, వాణిజ్యం, వర్తకం, పెట్టుబడులతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలు, సవాళ్లపై అధినేతలు చర్చించినట్లు పేర్కొన్నారు.



ఇరాన్‌లో రూపొందించిన యాంటీ షిప్ క్రూజ్ క్షిపణితో యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు గత ఏడాది డిసెంబర్‌లో దాడి చేసిన నౌక తాలూకు శిథిలాలను అమెరికా గుర్తించింది. నార్వే జెండాతో ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న నౌకపై హౌతీలు క్షిపణులను ప్రయోగించారు. దీనితో ఆ నౌక పూర్తిగా ధ్వంసమైంది. అయితే అప్పట్లో ఆ నౌక జాడ తెలియరాలేదు. దాడికి ఎవరూ బాధ్యత వహిస్తున్నట్టు ప్రకటించలేదు. కాగా, ఆ నౌకకు సంబంధించిన శిథిలాలను గుర్తించినట్టు అమెరికా నౌకాదళం ప్రకటించింది.



చైనా నుంచి పాకిస్తాన్ వెళుతున్న నిషిద్ధ రసాయనాలున్న కంటైనర్లను చెన్నై ఓడరేవులో భారత భద్రతాధికారులు గురువారం జప్తు చేశారు. నిషిద్ధ రసనాయాలను దిగుమతి చేసుకొని, వాటితో అక్రమంగా మారణాయుధాలను పాకిస్తాన్ తయారు చేస్తున్నదని భారత అధికారుల ఆరోపణ. చైనాకు చెందిన చెంగ్డు షిచెన్ ట్రేడింగ్ కంపెనీ లిమిటెడ్ నుంచి ఈ రవాణా జరిగింది. ఆర్థో క్లోరో బెంజైలైడెన్ మలోనొనిట్రిల్ రసాయానాలను ఈ కంపెనీ రావల్పిండి (పాకిస్తాన్)లోని రోహైల్ ఎంటర్‌ప్రైజెస్‌కు పంపింది.

# ఉద్యోగాల్లో కోటా వద్దు

- బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళన
- రహదారులు, రైల్వేలైన్ల దిగ్బంధనం
- రిజర్వేషన్లను తాత్కాలికంగా రద్దు చేసిన సుప్రీం

ప్రపంచం

**ఢాకా:** ఉద్యోగాల్లో కోటా ఒద్దు అంటూ బంగ్లాదేశ్‌లో విద్యార్థులు దేశవ్యాప్త సమ్మెకు దిగారు. రాజధాని ఢాకాతో సహా అన్ని ప్రధాన నగరాల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. వేలాదిమంది రోడ్లపైకొచ్చి ప్రభుత్వ రిజర్వేషన్ విధానాలకు వ్యతిరేకంగా నినాదా లు చేశారు. మెరిట్ ఆధారిత వ్యవస్థ కోసం డిమాండ్ చేశారు. రహదారులు, రైల్వేలైన్లు దిగ్బంధించారు. తమ డిమాండ్లను పరిష్కరిస్తే తప్ప తరగతులను వెళ్లమని తేల్చిచెప్పారు. ఆందోళనను విరమించి తరగతులకు హాజరు కావాలని ప్రధాన న్యాయమూర్తి ఓబైదుల్ హసన్ ఇచ్చిన పిలుపును బేఖాతరు చేశారు. ఆందోళనలు కొనసాగించారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ బంగ్లాదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో దాదాపు సగం వరకు కోటా వ్యవస్థ రిజర్వు అవుతుండటంతో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. వాళ్లు గతనెలలోనూ ఆందోళనలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసినవి తాత్కాలిక ఉత్తర్వులను, కోటా వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేస్తూ ఆదేశాలివ్వాలని, కేవలం దివ్యాంగులు, మైనారిటీలకు మినహా ఇతర ఏ రిజర్వేషన్లు ఉండరాదని నిరసనల్లో పాల్గొన్న చిట్టాగాంగ్ యూనివర్సిటీ విద్యార్థి నేత అహ్మద్, ఢాకా యూనివర్సిటీ విద్యార్థి పర్వేజ్ ముషారఫ్ అన్నారు. ఇది లావుంటే, బంగ్లాదేశ్ విమోచనం కోసం 1971లో జరిగిన పోరాటంలో పాల్గొన్న వారి పిల్లల కోసం ఉద్యోగాల్లో 30శాతం కోటాను రిజర్వు చేశారు. అలాగే మహిళలకు 10శాతం, ప్రత్యేకంగా కొన్ని జిల్లాల వారికి 10శాతం చొప్పున కోటా కల్పించారు. మైనారిటీలు, దివ్యాంగులకు ఆరు శాతం రిజర్వేషన్ ఇచ్చారు. ఇలా ఉద్యోగాల్లో దాదాపుగా సగం రిజర్వు కావడం వల్ల తమకు ఉద్యోగావకాశాలు లేకుండా పోతున్నాయని, మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చేలా వ్యవస్థ ఉండాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మహిళల కోసం కోటా అక్కర్లేదన్నారు. మహిళలు కూడా నైపుణ్యత ఆధారంగా ముందుకు వెళుతున్నారని, కోటా వ్యవస్థ వల్ల అవరోధాలు సృష్టిస్తూ... హక్కులు హరిస్తున్నారని ఓ విద్యార్థిని మీనా రాణి దాస్ (22) అన్నారు.







# పటిష్ఠ షాంఘై కూటమికి చైనా కసరత్తు

**బీజింగ్:** అమెరికా నేతృత్వ వరల్డ్ ఆర్డర్‌కు దీటుగా షాంఘై కూటమిని తీర్చిదిద్దాలని చైనా సంకల్పించింది. వరల్డ్ ఆర్డర్‌కు ప్రత్యామ్నాయంగా ఈ కూటమి ఉండాలని భావిస్తోంది. షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ) విస్తరణ క్రమంలో తమ నాయకత్వాన్ని చైనా బలపర్చుకుంటోందని అమెరికాకు చెందిన నేషనల్ బ్యూరో ఆఫ్ ఏషియన్ రీసెర్చ్‌లో ఏషియన్ సెక్యూరిటీ సీనియర్ ఫెల్లో బేట్స్ గిల్ పేర్కొన్నారు. ఎస్‌సీఓ సదస్సు ఇటీవల కజకస్థాన్‌లో జరిగింది. పరస్పరం సహకరించుకోవాలని సదస్సు తీర్మానించింది. కలిసి ముందు కు వెళ్లేందుకుగాను తమ వ్యూహాత్మక మిత్రదేశం రష్యాతో పాటు ఇతర భాగస్వామ్య దేశాలకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని, ప్రభావాన్ని తగ్గించేందుకు తామంతా ఏకం కావాలంటూ చైనా, రష్యా పిలుపులిచ్చాయి. 2001లో బీజింగ్, మాస్కో ద్వారా ఆర్థిక, భద్రతా సంఘం ఏర్పాటైంది. భారత్, పాకిస్థాన్‌తో పాటు అనేక సెంట్రల్ ఆసియా దేశాలకు భాగస్వామ్యం లభించింది. గతేడాది ఇరాన్, బెలారస్ కూడా ఎస్‌సీఓ సభ్యదేశాలుగా చేరాయి. ఎస్‌సీఓ సదస్సు చేసిన ఉమ్మడి తీర్మానంలో రష్యాఉక్రెయిన్ యుద్ధం ప్రస్తావన లేకపోగా తాజాగా వాషింగ్టన్‌లో ముగిసిన నాటో సదస్సు ఉక్రెయిన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేసింది.

## పూర్తి శక్తితో లేవనెత్తుతాం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. 'ఈ విషాదాన్ని అంతం చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీ, ఇండియా ఐక్య సంఘటన పార్లమెంటులో పూర్తి శక్తితో మణిపూర్‌లో శాంతి ఆవశ్యకతను లేవనెత్తుతాయి' అని చెప్పారు. మణిపూర్‌లో తన రోజంతా పర్యటన సందర్భంగా రాహుల్ గాంధీ, బీజేపీ పాలిత రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని మూడు సహాయ శిబిరాలను సందర్శించారు. హింసాకాండ కారణంగా నిరాశ్రయులైన మైతేయిలు, కుకీలు అనే రెండు జాతులకు చెందిన వారితో సంభాషించారు. గత ఏడాది మే 3న మణిపూర్‌లో జాతి హింస చెలరేగిన వారాల తర్వాత గాంధీ కూడా మణిపూర్‌ను సందర్శించారు. ఆయన జనవరి 2024లో రాష్ట్రం నుంచి తన 'భారత్ జోడో న్యాయ యాత్ర' ను కూడా ప్రారంభించారు. వీడియోలో, గాంధీ వివిధ సహాయ శిబిరాల్లో ప్రజలతో సంభాషించడం కనిపించింది. ప్రజలు తమ కష్టాలు, భయాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా వారి కోసం పోరాడాలని, వారి గొంతును పెంచాలని కాంగ్రెస్ నాయకుడు కోరారు. మణిపూర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్, దాని ఎంపీలు ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశంలో లేవనెత్తారని, రాబోయే సమావేశంలో సమస్యలను మళ్లీ లేవనెత్తుతామని హామీ ఇచ్చారని గాంధీ వీడియోలో చెప్పారు. 'నేను మీకు సహాయం చేస్తాను. సమస్యను లేవనెత్తుతాను. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాను. కానీ మీరు మీ ఇంటికి తిరిగి వెళ్లగలరని నేను మీకు భరోసా ఇవ్వలేను ఎందుకంటే దీనికి ప్రభుత్వం వద్ద సమాధానం ఉంది. మీరు తదుపరి సమావేశాల్లో చూస్తారు. నేను మీ గళాన్ని పెంచుతాను' అని మణిపూర్‌లోని సహాయక శిబిరంలో గాంధీ ప్రజలకు చెప్పారు.

## నేరుగా హాజరు కండి

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతల నుంచి తప్పుకోవాలని జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ కోరింది. మరీ ముఖ్యంగా కమిషన్ వ్యవహార శైలిని తప్పుబడుతూ కెసిఆర్ లేఖ రాయడం ఒకటైతే, విద్యుత్ శాఖ మాజీ మంత్రి జి. జగదీశ్ రెడ్డి సైతం పవర్ కమిషన్‌కు లేఖ రాసి పవర్ కమిషన్ తీరును తూర్పారబడుతూ సమాధానాలు పంపించారు. దీనిపై తర్జన భర్జన అనంతరం మాజీ సిఎం కెసిఆర్‌ను నేరుగా పవర్ కమిషన్ ముందు హాజరు కావాలని పిలువాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం . ఇందుకు అనుగుణంగా ఒకటి రెండు రోజుల్లో లేఖ రాసి నేరుగా హాజరు కావాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఉండే అవకాశం ఉంటుందని హెచ్చరించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. విచారణ పూర్తి కాకముందే తీర్పు ప్రకటించినట్లుగా కమిషన్ తీరు ఉందని కెసిఆర్ పేర్కొనడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎంతో సీనియర్‌ని అయిన తనకు ఈ బాధ్యతలు రాగా.. కెసిఆర్ మాత్రం జస్టిస్ నరసింహారెడ్డి తీరు సహజ సూత్రాలకు విరుద్ధంగా ఉందని , గత ప్రభుత్వానికి వ్యతిరేకంగానే నివేదిక ఇవ్వాలన్న అభిప్రాయం ఆయనలో కనబడుతోందని కెసిఆర్ పేర్కొనడం పై కమిషన్ ఇతర సభ్యులు ఆరా తీస్తున్నారని సమాచారం.

## మళ్లీ ఉద్యమిస్తాం (మొదటి పేజీ తరువాయి)

నిరసన తెలుపుతారన్నారు. అలాగే నీటి సంక్షోభం, వాతావరణ మార్పు ద్వారా వ్యవసాయంపై ప్రభావం అనే అంశంపై అదే రోజు అన్ని రాష్ట్రాల్లో సెమినార్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్ముకశ్మీర్‌లో రాష్ట్ర సమన్వయ కమిటీల అధ్వర్యంలో సమావేశాలు జరుగుతాయని చెప్పారు. స్వతంత్ర, విస్తృత ప్రచారానికి కార్యాచరణను ఈ సమావేశాలు ఖరారు చేస్తాయని నాయకులు తెలిపారు. ఇదే క్రమంలో జాతాలు, పాదయాత్రులు, మహాపంచాయత్‌లు జరుగుతాయన్నారు. ఆయా రాష్ట్రాల రైతుల సమస్యలను గుర్తించేందుకు అన్ని రాష్ట్రాల్లో సమన్వయ కమిటీలు భేటీ అవుతాయని తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాలు, వర్కర్లు వ్యవసాయ కార్మికుల సంఘాలతో పాటు విద్యార్థి, యువజన, మహిళా, ప్రజా సంఘాలతో సమన్వయ కమిటీల ఏర్పాటునకు సర్వసభ్య సమావేశం నిర్ణయించిందని, 15 ప్రధాన డిమాండ్లతో తీర్మానాన్ని ఆమోదించిందని నాయకులు తెలిపారు.

# ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులకు సహకారం అందించాలి

## మంత్రి దామోదర్ రాజ నర్సింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ ను మెడికల్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతున్న క్రమంలో లాభాపేక్షతో కాకుండా రోగులకు విశ్వసనీయత, పారదర్శకత, జవాబుదారితనంతో కూడిన వైద్య సేవలను అందించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరు తీసుకురావాలని కార్పొరేట్ ఆస్పత్రుల యజమన్యాలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లోని తన కార్యాలయంలో మంత్రి రాష్ట్రంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజ నర్సింహా మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ను సమర్థవంతంగా అమలు చేయటానికి తగిన చర్యలు చేపట్టాలని కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచన చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) లో భాగంగా సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులకు తమ వంతు సహకారం అందించాల్సిందిగా మంత్రి కోరారు. హైదరాబాద్ నగరాన్ని మెడికల్ టూరిజం హబ్ గా రూపొందించడానికి కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ఆస్పత్రుల యాజమాన్యాలు చేసిన పలు విజ్ఞప్తులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి తగిన విధాన పరమైన నిర్ణయాలను తీసుకుంటామనిహామీ ఇచ్చారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు వైద్యం పేరుతో వ్యాపారాలు చేయడానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ అక్షేపించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ బకాయిలు త్వరగా విడుదల చేయాలని కార్పొరేట్ ఆస్పత్రుల యజమానులు, ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. సుమారు గత 14 ఏళ్ల తర్వాత ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందిస్తున్న చికిత్సలకు రివిజన్ ఆఫ్ రేట్స్ కు సవరణ చేస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అసంఖ్యాకంగా నెలకొల్పుతున్న ఆసుపత్రుల ఆగడాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల లో నాణ్యత ప్రమాణాలు పెంచటానికి, విశ్వసనీయత, పారదర్శకత, జవాబుదారితనంతో కూడిన సేవలను ప్రజలకు అందించడానికి వేర్వేరుగా కమిటీలను నియమిస్తామన్నారు మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆసుపత్రిలో యజమానులు జనాభా ప్రతిపాదికన ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహను కోరారు. ఈ సమావేశంలో అపోలో, కిమ్స్, యశోద, కాంటినెంటల్, మెడికవర్ తదితర ఆసుపత్రుల యజమానులు, వివిధ కార్పోరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కురియన్ కమిటీ పోస్ట్‌మార్టం (మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల ఫలితాలపై పోస్టుమార్టం మొదలు పెట్టాంది. ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఓడిపోయిన అభ్యర్థి, ఖైరతాబాద్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్‌తో భేటీ మొదలైంది. ఈ భేటీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఇలా ఈ సమావేశాలు రాత్రి వరకు కొనసాగా యి. మొదటగా ఓటమిపాలైన పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన అభ్యర్థులతో మొదలైన భేటీలు మధ్యాహ్నం వరు కొనసాగాయి. పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, వంశీచంద్ రెడ్డి, నీలం మధు, వి.రాజేందర్‌రావు, టి.జీవన్‌రెడ్డి, ఆత్రం సుగుణలు హాజరైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా సాయంత్రం సురేశ్ షెట్కార్, మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, బలరాం నాయక్, కడియం కావ్య, వంశీకృష్ణ తదితరులు హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ తక్కువ ఎంపి స్థానాల్లో గెలవడంపై తమ అభిప్రాయాన్ని తెలిపారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు తగ్గడంపై కమిటీ ఆరా తీస్తున్నది.

**నేడు ఎంఎల్‌ఎలతో భేటీ :** నియోజకవర్గాల్లో ఓటమిపాలయ్యేందుకు కారణాలు ఏమిటన్న దానిపై కురియన్ కమిటీ ఆరా తీస్తున్నది. నాటి రాజకీయ పరిణామాలపై పోస్టు మార్టం చేస్తున్నారు. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం తదితర కారణాలుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శుక్రవారం ఎంఎల్‌ఎలతో కురియన్ కమిటీ సభ్యులు సమావేశం కానున్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఎంఎల్‌ఎలతో సమావేశమై కాంగ్రెస్ ఓటమిపాలయ్యేందుకు కారణాలు అడిగి తెలుసుకుంటారని టిపిసిసి వర్గాలు వెల్లడించాయి. ఎక్కడ లోపం జరిగిందో ఈ కమిటీ లోతైన అధ్యయనం చేసి నివేదిక ఇవ్వనుంది. ఇదిలా ఉండగా, తెలంగాణ పార్లమెంటు ఎన్నికలు 2024లో మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్‌లు నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. అయితే లోక్‌సభ ఎన్నికల్లో 12 సీట్లు తగ్గబోవని చెప్పిన కాంగ్రెస్ పార్టీ 8 సీట్లు సాధించింది. దీనిపై కురియన్ కమిటీ అధ్యయనం చేస్తున్నదని పార్టీ వర్గాలు చెప్పాయి.

## కౌలు రైతు గుర్తింపు ఎలా? (మొదటి పేజీ తరువాయి)

అంగీకరించే పరిస్థితి లేదు. ఒకే సంవత్స రం రెండు పంటలకు వేర్వేరు రైతులకు కౌలుకు ఇస్తున్న సమయంలో ధృవీకరణ అంశం అప్రస్తుతమవుతుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులను గుర్తిం చి గుర్తింపు కార్డులు అందజేసింది. ఇప్పు డు కూడా కౌలు రైతులను గ్రామాల వారీగా గుర్తించి ప్రత్యేక గుర్తింపు కార్డులు అందిం చి వ్యవసాయ అధికారుల ధృవీకరణతో విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల కొనుగోలు సమయంలో ప్రభుత్వపరంగా సబ్సిడీ ఇవ్వవచ్చు. అన్నింటికి మించి కౌలు రైతు వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించే సమయంలో బోనస్ ఇవ్వవచ్చు.ప్రకృతి విపత్తులు సంభ వించినప్పుడు పంటలు సాగుచేసిన కౌలు రైతును గుర్తించి నేరుగా కౌలు రైతుకే ఆర్థిక సాయం అందించవచ్చు. వాస్తవ సాగుదారైన కౌలు రైతుకు ప్రస్తుత బ్యాంక్ నిబంధనల మేరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే అవకాశం లేదు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంలో కౌలు రైతులకు రుణాల అంశం చర్చకు వచ్చినా పట్టాదారు పాసుపుస్తకాలు లేకుండా బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. లక్షలాది రూపాయల విలువైన భూములను తనాఖా పెట్టుకుని రూ.50వేలు రుణాలు ఇచ్చే బ్యాంకులు ఆధారం లేకుండా రుణాలు ఇవ్వడం సాధ్యం కాదు. కౌలు రైతులకు ప్రభుత్వ పరంగా జామీను ఉంటే తప్ప రుణ సౌకర్యం కలిగే అవకాశ ం లేదు. వ్యవసాయ యంత్రాలకు సంబంధించి ప్రభుత్వం గుర్తింపు పొందిన కౌలు రైతులకు నేరుగా సబ్సిడీ అందించి తక్కువ ధరకు యంత్రాల విడి భాగాలు, ట్రాక్టర్లు లేదా ఇతర యంత్రాలను అందించవచ్చు. ప్రభుత్వం కౌలు రైతు చట్టాల ను రూపొందించి అమలుచేస్తే తప్ప 30నుంచి 40 శాతం ఉన్న కౌలు రైతులకు లబ్ధి చేకూరే పరిస్థితి లేదు. మారుతున్న పరిస్థితుల్లో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించేందుకు ప్రత్యేక చట్టాలను రూపొందించి వ్యవసాయరంగాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.

## లక్ష్యాలు సాధించాలి (మొదటి పేజీ తరువాయి)

ఆడిటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్ పై వాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను సూచించారు. ఎన్నికలప్పుడు మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేరకు ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశముందని చర్చ జరిగింది. డిస్టిలరీస్ నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, అందుకు అవసరమైన అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సమావేశంలో చర్చ జరిగింది.

ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అటు కమర్షియల్ నిర్మాణాలు పెరిగాయని, గృహ నిర్మాణాలు కూడా అదే వరుసలో పుంజుకుంటాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల ను ప్రోత్సహించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందని, తిరిగి పన్ను వసూలు చేయటం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా.. అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

## బడ్జెట్ సమావేశాలు (మొదటి పేజీ తరువాయి)

బండ ప్రకాష్ , విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్రు నాయక్, తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ నరసింహాచార్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి జితేందర్, అదనపు డిజి మహేష్‌కుమార్ భగవత్, రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఛీఫ్ శివధర్ రెడ్డి, హైదరాబాద్ పోలీసు కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ అధికారులు, ట్రాఫిక్ అధికారులు, జిఎడి అధికారులు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికారులు తీసుకోవాల్సిన చర్యలను స్పీకర్, ఛైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 23 తేదీన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ని ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉన్నందున ముందస్తుగా తగిన ఏర్పాట్లు ప్రారంభించాలని ఈ సమావేశంలో చర్చించారు. అలాగే శాసనసభ , శాసనమండలి , లేజిస్లేచర్ సెక్రటేరియట్ లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పుడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం వల్ల సమావేశాలు నిర్వహించే నాటికి పనులన్నీ పూర్తి చేసే అవకాశం ఉంటుందని వివరించారు. జిల్లాల్లో ప్రొటోకాల్ వివాదాలు తలెత్తకుండా, అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలకు, సుదూర ప్రాంతాల పర్యటనలకు వెళ్ళినప్పుడు తగిన భద్రత, బందోబస్తు కల్పించాలని శాసనమండలి ఛైర్మన్, స్పీకర్ పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్ళేటప్పుడు ఎయిర్‌పోర్ట్‌లలో కూడా తగిన ప్రొటోకాల్ పాటించేలా చూడాలన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏమి చేశారు?

## చేతనైతే హైదరాబాద్ అభివృద్ధికి సహాయం చేయండి
### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చారిత్రాత్మక నగరమైన హైదరాబాద్ అభివృద్ధికి గత 10 ఏళ్ల పాటు రాష్ట్రంలో బిఆర్ఎస్, కేంద్రంలో అధికారం చెల్లాయిస్తున్న బిజెపి లు హైదరాబాద్‌కు ఏమి చేశారో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి కెటిఆర్‌లు చెప్పాలని హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి మీకు చేతనైతే హైదరాబాద్ అభివృద్ధికి సహాయం చేయండి తప్ప రాజకీయంగా లబ్ధి కోసం మాత్రం ఇష్టానుసరంగా మాట్లాడడం సరి కాదని హితువు పలికారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియతో మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడిందని మాట్లాడుతున్న జి.కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ ఎంపిగా కేంద్ర టూరిజం మంత్రిగా గత 5 ఏళ్లలో కేంద్రం నుండి హెరిటేజ్, టూరిజం, ఆర్కియాలజీ శాఖల నుండి హైదరాబాద్‌కు ఒక్క రూపాయి అయినా తెచ్చావా అని ప్రశ్నించారు. గత 10 ఏళ్లలో బిజెపి కాలంలో హైదరాబాద్, జిహెచ్ఎంసి అభివృద్ధికి బిజెపి ఏమి చేసిందో కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క రూపాయి కూడా సహకారం చేయకుండా గత ప్రభుత్వంతో అంటకాగి హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసింది మీరు కాదా అని పొన్నం ప్రశ్నించారు. స్థానిక సంస్థలను 73,74 రాజ్యాంగం ద్వారా వచ్చే 15 వ ఫైనాన్స్ నిధులు తప్ప అదనంగా ఒక్క పైసా అయినా తెచ్చారా అన్నారు. తాము అధికారంలోకి రాగానే కేంద్రం నుండి నిధులు కావాలని అనేక సార్లు కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన వెంటనే హైదరాబాద్ ఇంచార్జి మంత్రిగా గౌరవంగా ఆయనను కలిసి హైదారాబాద్ అభివృద్ధికి సహకరించాలని కోరినా ఇప్పటీ వరకు కనీసం స్పందించలేదన్నారు. జీహెచ్ఎంసి ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయని రాజకీయ లబ్ది కోసం హైదరాబాద్ ఇమేజ్ భంగం కలిగే విధంగా కిషన్ రెడ్డి మాటలు ఖండిస్తున్నన్నారు.

**కెటిఆర్ మాటాలు దయ్యాలు వేదాలు వల్లించినట్లే**

నిరుద్యోగ సమస్యపై మాజీ మంత్రి మాట్లాడడం అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల ఉచ్చులో పడోద్దని నిరుద్యోగులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. నిజమైన సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురండి పరిష్కరిస్తామన్నారు. 10 ఏళ్లలో డిఎస్‌సి పోస్టులు వేయనోళ్ళు టెట్ వేయనోళ్ల రెచ్చగొడుతున్నారన్నారు. బిఆర్ఎస్‌కుకి మహిళలకు ఉచితంగా బస్ ఇవ్వడం ఇష్టం లేదా అంటే నోరు మూసుకున్నారు.ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇయ్యడం బిఆర్ఎస్‌కు ఇష్టం లేదా చెప్పాలని డిమాండ్ చేశారు.స్వయం ప్రతిపత్తి గల సంస్థ ఉద్యోగాలు ఇస్తుంటే అడ్డుకునే ప్రయత్నిస్తూ నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నరన్నారు.

# నేడు కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

### రేపు మరో ఐదుగురు ఎంఎల్ఎల చేరిక ...?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్‌కు చెందిన మరి కొందరు ఎంఎల్ఎలు కాంగ్రెస్‌లో చేరనున్నారు. బిఆర్ఎస్ రాజేంద్రనగర్ ఎంఎల్ఎ ప్రకాష్‌గౌడ్ ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆయనతో పాటు మరి కొందరు మున్సిపల్ చైర్మన్లు కూడా చేరనున్నట్టు తెలిసింది. ఇటీవల సిఎం నివాసంలో సిఎం రేవంత్ రెడ్డితో ఎంఎల్ఎ ప్రకాశ్ గౌడ్ భేటీ అయ్యారు. త్వరలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరిగింది. దీంతో బిఆర్ఎస్ వెంటనే రంగంలోకి దిగింది. ప్రకాష్‌గౌడ్‌తో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ భేటీ అయ్యారు. ఆ తర్వాత ప్రకాష్ గౌడ్ చేరిక తాత్కాలికంగా వాయిదా పడింది. కానీ తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రకాష్‌గౌడ్ 'కారు' దిగి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. అయితే తాజగా బిఆర్ఎస్ ఎంఎల్ఎల సంఖ్య 39 నుంచి 32కు తగ్గింది. ప్రకాష్‌గౌడ్ కూడా 'కారు'ను వీడితే ఆ సంఖ్య 31కి చేరుతుంది. కాంగ్రెస్ ఎంఎల్ఎల సంఖ్య (సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగెస్ గెలుపొందింది) 65 ఉండగా, బిఆర్ఎస్ ఎంఎల్ఎలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, కృష్ణమోహన్ రెడ్డి చేరికతో కాంగ్రెస్ ఎంఎల్ఎల సంఖ్య 72కు చేరింది.

**రేపు మరి కొందరు ఎంఎల్ఎలు..?**

బిఆర్ఎస్ ఎంఎల్ఎ ప్రకాష్‌గౌడ్ బిఆర్ఎస్‌నువీడిన మరుసటి రోజు (శనివారం) బిఆర్ఎస్ ఎంఎల్ఎలు కె.పి.వివేకానందగౌడ్, అరికపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి , దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఇది వరకే తాము బిఆర్ఎస్‌ను వీడడం లేదని వారు స్పష్టం చేసినప్పటికీ గత కొంత కాలంగా వారితో కాంగ్రెస్ నేతలు సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది. ఇప్పటి వరకు కాంగ్రెస్‌లో చేరిన ఎంఎల్ఎలు కూడా గతంలో తాము బిఆర్ఎస్‌ను వీడేది లేదని స్పష్టం చేసినవారేనని బిఆర్ఎస్ నాయకులే చెబుతున్నారు.

# డేటా సైన్స్‌తో ప్రజా రవాణా వ్యవస్థ పటిష్టం

### ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా రవాణా సేవలు
### ప్రముఖ డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ నిపుణులు శరత్ కాటిపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డేటా సైన్స్‌ను ఉపయోగించుకొని ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా పటిష్టంగా చేయవచ్చునని డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్ ప్రముఖ నిపుణులు శరత్ కాటిపల్లి అన్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా మెరుగైన, నాణ్యమైన రవాణా సేవలను అందించడంతో పాటు టిజిఎస్ ఆర్‌టిసి నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు డేటా విశ్లేషణ దివ్య ఔషధంలాగా పనిచేస్తుందన్నారు. హైదరాబాద్ బస్ భవన్‌లో లీడర్ షిప్ టాక్స్‌లో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 'ప్రజా రవాణా వ్యవస్థలో డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వినియోగం' అనే అంశంపై శరత్ కాటిపల్లి ప్రసగించారు. ప్రతి రోజు సగటున 55 లక్షల మందిని తమ బస్సుల్లో టిజిఎస్ ఆర్‌టిసి గమ్యస్థానాలకు చేర్చడం గొప్ప విషయమన్నారు. వారి ప్రయాణ డేటాకు అనుగుణంగా రియల్ టైంలో మెరుగైన రవాణా సేవలను అందించవచ్చని చెప్పారు. మెసేజ్, మెసెంజర్, మెకానిక్స్, మెషినరీ అనే 4 ఎం కాన్సెప్ట్‌తో సంస్థను ఉన్నతస్థాయికి ఎలా తీసుకవెళ్లవచ్చు అని వివరించారు. సాంకేతికతలో వస్తోన్న మార్పులను అందిపుచ్చుకుంటూ ప్రయాణికులకు సంతృప్తికర సేవలను అందించే తీరును తన అనుభవంతో ఉదాహరించారు. అనంతరం ఆర్‌టిసి అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

**లూషియా ఏఐకి సలహాదారుగా కొనసాగుతున్న శరత్ కాటిపల్లి..**

తెలంగాణకు చెందిన శరత్ కాటిపల్లి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీని అమెరికాలో చేశారు. ప్రముఖ స్టాన్ ఫర్డ్ యూనివర్శిటీలో డేటా సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సును అభ్యసించారు. అనంతరం మల్టీనేషనల్ సంస్థలైన లెక్స్ మార్క్స్, జిఎపి ఐఎన్‌సి, ఐబిఎం గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్, హెచ్ఎస్‌బిసి, అమెజాన్ లాంటి సంస్థల్లో డేటా సైంటిస్ట్‌గా విధులు నిర్వర్తించారు. జెపి మోర్గాన్ కార్పొరేట్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ సంస్థకు చీఫ్ డేటా ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సంస్థ లూషియా ఏఐకి సలహాదారుగా కొనసాగుతున్నారు.

**ప్రజలకు మరింత చేరువయ్యేందుకే డేటా సైన్స్ : టిజిఎస్ ఆర్‌టిసి ఎం.డి. సజ్జనార్**

డేటా సైన్స్‌ను వినియోగించుకుని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు టిజిఎస్ ఆర్‌టిసి కసరత్తు చేస్తోందని టిజిఎస్ ఆర్‌టిసి ఎం.డి. వి.సి. సజ్జనర్ అన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలకు జీవనాడిలా డేటా సైన్స్ పనిచేస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతమైన సేవలందించేందుకు డేటా విశ్లేషణను వినియోగించుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఓఓ డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, ఆర్థిక సలహాదారు విజయపుష్ప, సిపిఎం ఉషారాణి, సిఎంఈ వెంకన్న తదితరులతో పాటు వర్చ్‌వల్‌గా ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డిఎంలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్పౌస్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ఉద్యోగుల్లో భార్య/భర్త దరఖాస్తుల పట్ల సానుకూలం

### 'జిఓ 317 మంత్రివర్గ ఉప సంఘం' సమావేశంలోకీలక నిర్ణయాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్పౌస్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య/భర్త చేసుకున్న దరఖాస్తుల పట్ల జిఒ 317 మంత్రివర్గ ఉప సంఘం సానుకూలంగా నిర్ణయం తీసుకున్నది. క్యాబినెట్ సబ్ కమిటీకి చేసుకున్న దరఖాస్తులను సంబంధిత శాఖాధిపతులకు పంపించాలని సాధారణ పరిపాలన శాఖ(జిఎడి) అధికారులను క్యాబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. మిగతా దరఖాస్తులను వివిధ శాఖలకు పంపి, వాటిని పరిశీలించిన తర్వాత తిరిగి క్యాబినెట్ సబ్ కమిటీ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేసింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ హైదరాబాద్, సచివాలయంలో గురువారం సమావేశమైంది. ఈ సమావేశంలో క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ కార్యదర్శి ఎం. రఘునందన్ రావు, రిటైర్డ్ ఐఎఎస్ శివశంకర్,సాధారణ పరిపాలన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఒయు ఘటనపై మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బుధవారం జర్నలిస్టులపై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునే విధంగా చూడాలని పలువురు జర్నలిస్టులు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు జర్నలిస్టులు గురువారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ దాడి ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకునే విధంగా చూడాలని ఈ సందర్భంగా జీ తెలుగు న్యూస్ చీఫ్ ఎడిటర్ భారత్‌తో పాటు పలువురు జర్నలిస్టులు శ్రీనివాస్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

**డిజిపిని కలిసిన జర్నలిస్టులు :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జీ తెలుగు న్యూస్ రిపోర్టర్‌పై పోలిసుల దాడి ఘటనపై జర్నలిస్టులు డిజిపి జితేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు గురువారం జీ తెలుగు న్యూస్ చీఫ్ ఎడిటర్ భారత్, క్రైమ్ రిపోర్టర్స్, హైంద వ జర్నలిస్టులు డిజిపికి వినతి పత్రం సమర్పించారు.



మల్టీ జోన్-II ఐజిగా గురువారం బాధ్యతలను స్వీకరించిన ఐపిఎస్ అధికారి వి.సత్యనారాయణ

# రూ.500 కోట్లతో మైక్రో లింక్ నెట్‌వర్క్ పరిశ్రమలు

### పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అమెరికా టెలికమ్యూనికేషన్స్ దిగ్గజం మైక్రోలింక్ నెట్ వర్క్స్ రూ.500 కోట్ల పెట్టుబడితో తెలంగాణాలో తమ ఎలక్ట్రానిక్, ఇతర ఉత్పత్తుల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన పిఎస్ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో మైక్రోలింక్ పరిశ్రల క్లస్టర్‌ను ప్రారంభిస్తుందని తెలిపారు. గురువారం మైక్రోలింక్ గ్లోబల్ ప్రతినిధులు, భారతీయ భాగస్వామి 'పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీరంగారావు తెలంగాణ సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. వచ్చే మూడేళ్లలో రూ.500 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్, ఐటి, నిర్మాణరంగ పరికరాలను ఉత్పత్తి చేస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. రానున్న మూడేళ్లలో 700 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇటీవల తన అమెరికా పర్యటనలో మైక్రోలింక్ నెట్ వర్క్స్ యాజమాన్యంతో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. అనంతరం తెలంగాణాలో పెట్టుబడులకు అంగీకరించిందని మంత్రి తెలిపారు. డేటా ట్రాన్స్ మిషన్, నెట్ వర్కింగ్ కేబుల్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మల్టీ లెవెల్ పార్కింగ్ మిషన్ల ఉత్పత్తిలో మైక్రోలింక్ నెట్ వర్క్స్ గ్లోబల్ లీడర్ గా ఉందన్నారు. ఇప్పుడా కంపెనీ పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో పరిశ్రమలను ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణాలో నైపుణ్యం ఉన్న సిబ్బందికి కొరతలేదని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో పిఎస్ ఆర్ ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీరంగారావు, డైరెక్టర్ నమ్యుత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధర్మరాజు చక్రవరం, మైక్రోటెక్ గ్లోబల్ ప్రతినిధులు డా. డెనిస్ మొటావా, సియాన్ ఫిలిప్స్ , జో జోగ్బి , అశోక్ పెర్సోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్, కెటిఆర్‌లు కాళ్లు మొక్కినా బిఆర్ఎస్‌లో ఉండడం లేదు

### టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదేళ్లుగా సొంత పార్టీ మంత్రులు, ఎంఎల్ఎలను ఇంటి గేటు లోపలికి రానివ్వకుండా తరిమికొట్టి వారిని అప్పటి సిఎం కెసిఆర్ తీవ్రంగా అవమానించారని, అందుకే ఇప్పుడు ఫామ్ హౌస్‌కు పిలుచుకుని కాళ్ళు మొక్కినా ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు బిఆర్ఎస్ పార్టీలో ఇమడలేక కాంగ్రెస్‌లోకి వస్తున్నారని టిపిసిసి క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కిగౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ కనీసం బిఆర్ఎస్ పార్టీ మంత్రులు, ఎంఎల్ఎలను ఏనాడూ కెసిఆర్ గౌరవించలేదని, అందుకే కెసిఆర్‌కు ఈ గతి పట్టిందన్నారు. టిడిపి నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు, కాంగ్రెస్ నుంచి గెలిచిన సబితా ఇంద్రారెడ్డికి ఏ ప్రాతిపదికన మంత్రి పదవులు ఇచ్చారని, అప్పుడు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గుర్తు రాలేదా అని మాజీ మంత్రి కెటిఆర్‌ను ప్రశ్నించారు. కెసిఆర్ కుటుంబం అవినీతిలో కూరుకుపోయిందని, అవినీతి చేస్తే కొడుకు అయినా బిడ్డ అయినా అల్లుడైన సహించేది లేదని చెప్పిన కెసిఆర్‌కు ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఇరికిన బిడ్డ కవితను బయటకు తీసుకొచ్చేందుకు అపసోపాలు పడుతున్నారన్నారు. ఇందుకు మోడీతో కుమ్మక్కై బిడ్డను జైలు నుంచి విడిపించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలన్న కుట్ర చేశారని మధుయాష్కీ ఆరోపించారు. బిజెపి, బిఆర్ఎస్‌లు ఒక్కటై అప్రజాస్వామికంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలని కుట్ర చేస్తుంటే ప్రజాస్వామ్యయుతంగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే వారిని ఆహ్వానిస్తున్నామని ఆయన అన్నారు. పదేళ్లలో ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగులను మోసం చేసిన కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులు ఏ ఒక్క రోజైనా ఉస్మానియా యూనివర్సిటీలోకి అడుగు పెట్టారా? ఇప్పటికైనా తెలంగాణలోని ఏ యూనివర్సిటీలోనైనా అడుగుపెట్టే ధైర్యముందా? అని మధుయాష్కీగౌడ్ ప్రశ్నించారు.

# దాడులకు పాల్పడిన పోలీసులను అధికారంలోకి వచ్చిన తర్వాత వదిలిపెట్టం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థులు, ప్రజలపైన దాడులకు పాల్పడుతున్న పోలీస్ అధికారులను తాము తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత వదిలిపెట్టబోమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు హెచ్చరించారు. విద్యారంగంలో జరిగే ప్రతి అన్యాయం వద్ద విద్యార్థి విభాగం అందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన బిఆర్ఎస్‌వి నాయకుల సమావేశంలో కెటిఆర్ మాట్లాడారు. శరీరంపైన గాయాలు మానిపోయినా, ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని మాత్రం మర్చిపోరని, తమపైన చేస్తున్న దాడులను విద్యార్థి నాయకులు తమ డైరీలో నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే రాజకీయ నాయకులుగా ఎదిగేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. పార్టీ విద్యార్థి విభాగానికి చెందిన అనేకమంది నాయకులను ప్రజాప్రతినిధులుగా, చైర్మన్లుగా, మేయర్లుగా, జిల్లా స్థాయి అధ్యక్షులుగా తయారు చేసుకున్నామని వివరించారు. సిఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు, యువకులకు రాజకీయాలను అంటగడుతున్నారన్నారు. ఉద్యోగాలను, నోటిఫికేషన్లను అడిగితే వారిని అవమానపరిచేలా అడ్డగోలుగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 50వేల ఉద్యోగాలతోని మెగా డిఎస్‌సిని విడుదల చేయాలని రేవంత్ రెడ్డి మాట్లాడారని, అధికారంలోకి రాగానే కేవలం సుమారు 6వేల అదనపు ఉద్యోగాలతో డిఎస్‌సి పేరుతో యువకులను మోసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న ప్రతి ఒక్క తెలంగాణ యువకుడు తెలంగాణ కథానాయకుడిగా నిలబడిపోతారన్నారు. నిరుద్యోగులను రాహుల్ గాంధీ, కాంగ్రెస్ వాడుకున్నదని ఆరోపించారు. తమ విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులపైన పోలీసు దాడులు చేస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులను, నిరుద్యోగులను అవమానపరిచేలా మాట్లాడిన సిఎం రేవంత్ వెంటనే వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

### మంత్రి జూపల్లికి యూనియన్ ప్రతినిధి బృందం వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తు న్న కాం టాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని గురువారం తెలంగాణ పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుని తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధి బృందం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మా ట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో చాలీచాలని వేతనాలతో కార్మికులు పని చేస్తున్నారని మంత్రి జూపల్లికి తెలియజేశామని అన్నారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలని, వెంటనే కాంటాక్ట్ ఔట్ సో ర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరినట్లు వారు తెలిపా రు. మం త్రి జూపల్లిని కలిసిన వారిలో ఎల్ సాంబశివరెడ్డి, పుల్లారెడ్డి, జ్యోతి, రాజశేఖర్, ఎగ్బాల్ తదితరులు ఉన్నారు.

**శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము**
సెవెన్ హిల్స్, నిజాంపేట్ రోడ్, కూకట్‌పల్లి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, హైదరాబాద్-500085

**బహిరంగ వేలం ప్రకటన**

సంవత్సర కల పరిమితి సీల్డ్ టెండర్ / బహిరంగ వేలం తేది: 01.08.2024 నుండి తేది: 31.07.2025 వరకు దిగువ తెలుపబడిన లైసెన్స్ హక్కులు నిమిత్తం సీల్డ్ టెండర్ / బహిరంగ వేలము కోరడమైనది.

| క్ర.సం. | వేలముల వివరములు | టెండర్ ధర | ధరావతు |
|---|---|---|---|
| 1 | ప్రతి రోజు పూల దండల సరఫరా | 300/- | 10,000/- |
| 2 | పర్వదినాలలో పూల అలంగరణ | 500/- | 10,000/- |
| 3 | విద్యుత్ అలంకరణ (లైటింగ్ డెకరేషన్) | 500/- | 10,000/- |
| 4 | కిరాణా సామాగ్రి సరఫరా | 500/- | 10,000/- |
| 5 | శేష వస్త్రాలు (షాల్, పంచులు, చీరలు, జాకెట్లు, ముక్కలు, సేల్లాలు) సరఫరా | 300/- | 10,000/- |
| 6 | కరపత్రాలు, ఫ్లెక్సీలు, రశీదు పుస్తకాలు, సరఫరా మరియు ముద్రణ | 300/- | 10,000/- |
| 7 | కొబ్బరికాయలు మరియు ఇతర పూజ సామాగ్రి అమ్ముకొను హక్కు గురించి | -- | 10,000/- |

తేది : 25.07.2024, గురువారం రోజున మధ్యాహ్నం 12:30 గం.లకు సీల్డ్ టెండర్ / బహిరంగ వేలం నిర్వహించడం జరిగింది. కావున ఆసక్తి గలవారు షరతులకు లోబడి వేలములో పాల్గొనగలరు. పూర్తి వివరాలకు దేవాలయంలో సంప్రదించగలరు - ఫోన్ : 9030908818

సం/- జి. సుధాకర్
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 1721-PP/CL/ADVT/1/2024-25 Date: 11-07-2024

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
ఫారం-VI
(ప్రాథమిక నోటిఫికేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రూల్ 19 సబ్ రూల్ (1) ను అనుసరించి.

కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నం. G1/4166/2022 తేది: 03.07.2024
రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నం. B/70/2024 తేది: 21.06.2024
గెజిట్ నెంబరు. 87/2024 తేది: 03.07.2024

తెలంగాణ ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరచిన సిద్దిపేట జిల్లాలోని, సిద్దిపేట(రూరల్) మండలములోని అంకంపేట గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ. **6.15 1/4 గుంటలు** ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ ప్యాకేజీ -12, 6R డిస్ట్రిబ్యూటర్ యొక్క 2R మైనర్ కెనాల్ నిర్మాణ నిమిత్తం కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ఈ ప్రకటన జారీ చేయనైనది. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 35, తేది: 30.06.2017 ద్వార నీటి పారుదల మరియు కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ శాఖ వారు 10-A అనుసరించి సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ మరియు ఆహార భద్రతను మినహాయింపు ఇవ్వనైనది.

కావున సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట (రూరల్) మండలములోని అంకంపేట గ్రామములో విస్తీర్ణం ఎ. **6.15 1/4 గుంటలు** గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారికి భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం, ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేయమైనది.

షెడ్యూల్

గ్రామము: అంకంపేట్ మండలము: సిద్దిపేట్ (రూరల్) జిల్లా: సిద్దిపేట

| క్ర. సం. (1) | సర్వే నెం. (2) | విస్తీర్ణం (3) | భూమి పట్టాదారు / అనుభవదారు పేరు (4) | భూమి స్వభావం | సరిహద్దులు తూర్పు (5) | పడమర (6) | ఉత్తరం (7) | దక్షిణం (8) | భూమిపై ఉన్న చెట్లు / బావులు / కట్టడాలు / ఇతరములు (9-10) |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 182 | 0.02 | బెంజరం రాజిరెడ్డి తండ్రి నర్సారెడ్డి(అ) | పట్టా | 181 | V.B | 181 | 179 | 20 - నీలగిరి |
| 2 | 182 | 0.04 | బెంజరం సుగుణమ్మ భర్త బాపు రెడ్డి | పట్టా | 181 | V.B | 181 | 179 | 80 - నీలగిరి |
| 3 | 182 | 0.14 | మంద మల్లవ్వ భర్త మల్లయ్య | పట్టా | 181 | V.B | 181 | 179 | భూ తగాదా కలదు హైకోర్ట్‌లో పెండింగ్‌లో కలదు. 1-మోదుగ, 4- వేప, 1-కానుగ |
| 4 | 181 | 0.13 | వసూరి లక్ష్మి భర్త బాలయ్య | పట్టా | 180 | 182 | - | 179 | 1-పైప్ లైన్, 1-డ్రిప్, 4- నీలగిరి, 1-చింత, 1-నీళ్ళకుండి |
| 5 | 180 | 0.07 | జింక యెల్లయ్య తండ్రి మల్లయ్య (పట్టాదారు) జింక నరేశ్ తండ్రి యెల్లయ్య (అనుభవదారు) | పట్టా | 179 | 181 | - | 179 | 4-టేకు |
| 6 | 180 | 0.06 | జింక యెల్లయ్య తండ్రి మల్లయ్య (పట్టాదారు ) జింక మహేశ్ తండ్రి యెల్లయ్య (అనుభవదారు) | పట్టా | 179 | 181 | - | 179 | 1-పైప్ లైన్ |
| 7 | 180 | 0.10 | జింక యాదగిరి తండ్రి యెల్లయ్య | పట్టా | 179 | 181 | - | 179 | 1-పైప్ లైన్ 1-కానుగ |
| 8 | 180 | 0.02 | రంగు తిరుపతి తండ్రి మల్లయ్య (పట్టాదారు ) రంగు శేఖర్ తండ్రి మల్లయ్య (అనుభవదారు) | పట్టా | 179 | 181 | - | 179 | |
| 9 | 179 | 0.08 1/2 | కర్రోల్ల కనకవ్వ భర్త యాదగిరి | లావుని పట్టా | - | V.B | 182, 181, 180 | - | 1- టేకు |
| 10 | 179 | 0.20 | పెద్దిగాని బుచ్చవ్వ భర్త రాజయ్య | లావుని పట్టా | - | V.B | 182, 181, 180 | - | 4-వేప, 3-కానుగ 10-నీలగిరి, 2- మోదుగ, 25- మామిడి |
| 11 | 179 | 0.04 1/2 | జింక మానెవ్వ భర్త యెల్లయ్య | లావుని పట్టా | - | V.B | 182, 181, 180 | - | 4- వేప |
| 12 | 188 | 0.03 1/2 | వట్టిపల్లి మధుసూదన్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి | పట్టా | 149 | 179 | - | 179 | |
| 13 | 188 | 0.09 1/2 | వట్టిపల్లి యాదవరెడ్డి తండ్రి బాల్ రెడ్డి | పట్టా | 179 | 181 | - | 179 | 230-నీలగిరి 3-వేప |
| 14 | 149 | 0.08 | వట్టిపల్లి శ్యామల భర్త వెంకట్‌రెడ్డి | పట్టా | 152 | 188 | - | 179 | 2-టేకు 200-నీలగిరి |
| 15 | 149 | 0.01 | వట్టిపల్లి యాదవరెడ్డి తండ్రి బాల్‌రెడ్డి | పట్టా | 152 | 188 | - | 179 | |
| 16 | రాస్తా | 0.03 | రోడ్ | ప్రభుత్వ | 149 | 188 | - | 179 | |
| 17 | 152 | 0.06 1/2 | కొసిరెడ్డి రాజురెడ్డి తండ్రి నారాయణరెడ్డి | పట్టా | 153 | 149 | 148 | 179 | 10- టేకు 1-బోరు |
| 18 | 148 | 0.12 | కొసిరెడ్డి స్రవంతి భర్త రాజు | పట్టా | 147 | రోడ్ | 145 | 152 | 1-డ్రిప్, 1-పైప్ లైన్, 1-నీలగిరి, 2- మామిడి, 1-చనంగా |
| 19 | 148 | 0.02 1/2 | కొసిరెడ్డి నర్సింహారెడ్డి తండ్రి రామయ్య(అ) | పట్టా | 147 | రోడ్ | 145 | 152 | 1-మామిడి |
| 20 | 147 | 0.07 | కొసిరెడ్డి బాల్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి(అ) | పట్టా | - | 148 | 145 | 153 | 2-టేకు, 180 - నీలగిరి, 1-బోరు |
| 21 | 147 | 0.03 | కొసిరెడ్డి నిర్మల భర్త వెంకట్ రెడ్డి | పట్టా | - | 148 | 145 | 153 | 10 - నీలగిరి 2-వేప,1-బోరు |
| 22 | 147 | 0.05 1/4 | కొసిరెడ్డి కొండల్ రెడ్డి తండ్రి రాఘవరెడ్డిరెడ్డి (పట్టాదారు ) కొసిరెడ్డి సురేందర్ రెడ్డి తండ్రి రాఘవరెడ్డిరెడ్డి (అనుభవదారు) | పట్టా | - | 148 | 145 | 153 | 6-వేప 4-టేకు 45- నీలగిరి |
| 23 | 147 | 0.09 1/2 | కొసిరెడ్డి అమరేందర్‌రెడ్డి తండ్రి కిషన్‌రెడ్డి(అ) | పట్టా | - | 148 | 145 | 153 | 10-నర్రేంగా 4-టేకు,2-వేప, 200-నీలగిరి |
| 24 | 145 | 0.07 1/2 | భైరి శిరీష భర్త రాజిరెడ్డి (అ) | పట్టా | 144 | రోడ్ | - | 147 | 2-నీలగిరి 1-వేప |
| 25 | 144 | 0.13 1/2 | వట్టిపల్లి యాదవ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి(ప) వట్టిపల్లి కిష్టవ్వ భర్త బాల్‌రెడ్డి (అ) | పట్టా | 142 | 145 | 138 | - | 1000-నీలగిరి 1-బోరు |
| 26 | 144 | 0.07 | వట్టిపల్లి మధుసూదన్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | పట్టా | 142 | 145 | 138 | - | 1-పైప్ లైన్ 1-బోరు, 3-టేకు, 1-వేప |
| 27 | 143 | 0.05 1/2 | బైరి రాజీ రెడ్డి తండ్రి నారాయణరెడ్డి | పట్టా | 142 | - | - | 144 | |
| 28 | 142 | 0.25 | వట్టిపల్లి మల్లారెడ్డి తండ్రి నర్సారెడ్డి | పట్టా | V.B | 138, 144 | 141 | - | 1- పైప్ లైన్ 1-బోరు |
| 29 | 142 | 0.13 | వట్టిపల్లి రాజిరెడ్డి తండ్రి నర్సా రెడ్డి | పట్టా | V.B | 138, 144 | 141 | - | 1-వేప 1-శనంగా |
| 30 | 141 | 0.04 | భైరి లావణ్య తండ్రి కిష్టారెడ్డి | పట్టా | 142 | - | రోడ్ | 142 | |
| 31 | రాస్తా | 0.03 | రోడ్ | ప్రభుత్వ | V.B | - | 129 | 142 141 | |
| 32 | 129 | 0.10 | వంగపల్లి రాజు తండ్రి తిరుపతి | పట్టా | V.B | - | - | రోడ్ | 1-వేప 1-టేకు |
| 33 | 179 | 0.05 | జింక దేవవ్వ భర్త సాయిలు | లావుని పట్టా | - | V.B | 182, 181, 180 | - | 6-నీలగిరి 3-వేప |
| మొత్తం విస్తీర్ణం : 6.15 1/4 | | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013, సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూయజమానులకు చట్టప్రకారం భూనష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్ సిద్దిపేట మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ యూనిట్-1, సిద్దిపేట వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయాల పనివేళలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారు ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ యూనిట్-1, సిద్దిపేట గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో యేదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు/ అమ్మకాలు/ తాకట్లకు సంబంధించిన చర్యలు చేపట్టరాదు.

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూపిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణ పై సెక్షన్ 15 (1) ప్రకారం అభ్యంతరములు ఉన్నచో, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలో భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- **తహశీల్దార్, సిద్దిపేట (రూరల్) మండలము**
సం/- **ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), యూనిట-1, కాళేశ్వరం ప్రాజెక్ట్**
సం/- **అదనపు కలెక్టర్, సిద్దిపేట జిల్లా**
సం/- **జిల్లా కలెక్టర్, సిద్దిపేట జిల్లా**

DIPR RO NO. 116/LA/PP/Advt/Pub/2024-25

ప్రజాపక్షం

శుక్రవారం, జులై 12

# ముస్లిం మహిళలకు భరణంపై హేతుబద్ధమైన తీర్పు

విడాకులు పొందిన ముస్లిం మహిళలకు భరణం రాజ్యాంగబద్ధమైన హక్కుగా తొలిసారి లభించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 125(1) మతం, జాతి, కులం, లింగం, జన్మ స్థానం వగైరా కారణాలతో రాజ్యం తన పౌరులమధ్య వివక్షత చూపరాదని ఆదేశిస్తున్నది. అందువల్ల కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సిఆర్‌పిసి)లోని సెక్షన్ 125 కింద, ముస్లిం మహిళలు సహా విడాకులు పొందిన మహిళలందరూ భర్తనుండి భరణం పొందేందుకు అర్హులేనని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసీతోకూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారంనాడు మైలురాయి వంటి తీర్పు చెప్పింది. సెక్షన్ 125 భార్య, పిల్లలు, తల్లిదండ్రులకు భరణం చెల్లింపునకు సంబంధించింది. న్యాయమూర్తులు విడివిడిగా తీర్పులు రాసినప్పటికీ ప్రధాన విషయంలో ఏకీభావం వ్యక్తం చేశారు. ముస్లిం పర్సనల్ లా ప్రకారం విడాకులు పొందిన మహిళలు ఇద్దత్ కాలంలోనే (90 రోజులు) భరణానికి అర్హులు. సాంప్రదాయక సమాజాల్లో సర్వసాధారణంగా పురుషులు పిత్రార్జితానికి వారసులుగా, వృత్తి, వ్యాపారాలు నిర్వహిస్తూ ధన సంపాదనపరులుగా ఉంటారు కావున కుటుంబ పోషణ భారం వారిపైనే ఉంటుంది. ఏదోక కారణంతో (మరీ అమానవీయంగా ట్రిపుల్ తలాఖ్ ఉచ్ఛారణతో) భర్త భార్యకు విడాకులిచ్చినపుడు భార్యకు జీవితాంతం లేదా ఆమె పునర్వివాహం చేసుకునేవరకు, పిల్లలకు వారు మేజర్‌లయ్యేంతవరకు భరణం చెల్లించటం అతని బాధ్యత. సిఆర్‌పిసిలోని లౌకిక సెక్షన్ 125 ఇదే చెబుతున్నది.

ఈ కేసు మన తెలంగాణ నుండే సుప్రీంకోర్టుకు రావటం, దానిపై ప్రభావవంతమైన, మార్గదర్శకమైన తీర్పు వెలువడటం వల్ల రికార్డుల్లో మన రాష్ట్రమూ శాశ్వతంగా ఉంటుంది. ట్రిపుల్ తలాఖ్ ద్వారా విడాకులిచ్చిన మహమ్మద్ అబ్దుల్ సమద్ అనే వ్యక్తి తన భార్యకు నెలకు రూ.20వేలు భరణం చెల్లించాలని కుటుంబ వ్యవహారాల కోర్టు తీర్పు ఇచ్చింది. దానిపై ఆయన తెలంగాణ హైకోర్టుకు వెళ్లగా భరణం సొమ్ము రూ.10,000కు తగ్గించబడింది. దానిపై ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లి ఆమెకు 1986 చట్టం తప్ప సెక్షన్ 125 వర్తించదని వాదించారు.

సమస్య ఎక్కడ మొదలైందో తెలుసుకోవాలంటే 1980వ దశకంలోకి వెళ్లాలి. ప్రసిద్ధమైన షాబానో అనే ముస్లిం మహిళ కేసులో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు, దేశంలోని ఆనాటి పరిస్థితుల్లో ముస్లిం మత ఛాందసుల ఒత్తిడికి లొంగి నాటి ప్రధాని రాజీవ్‌గాంధి ఆ తీర్పును వమ్ము చేస్తూ పార్లమెంటులో చట్టం చేయటం, దానిపై పెద్ద ఎత్తున జరిగిన రాజకీయ వాదోపవాదాలు ఈ సందర్భంగా స్ఫురణకు వస్తున్నాయి. విడాకులిచ్చిన తన భర్తనుండి భరణం కోసం షాబానో కేసు సుప్రీంకోర్టుకు చేరింది. ఆమెకు ముస్లిం పర్సనల్ లా తప్ప సిఆర్‌పిసి సెక్షన్ 125 వర్తించదని బలమైన వాదనలు చేశారు పర్సనల్ లా సమర్థకులు. కాగా సెక్షన్ 125 నుండి ముస్లింలకు మినహాయింపులేదని, ఆమె భరణానికి అర్హురాలని సుప్రీంకోర్టు 1985లో తీర్పు చెప్పింది. దీన్ని తమ పర్సనల్‌లాలో జోక్యంగా ముస్లిం పెద్దలు ధ్వజమెత్తారు. ఆ ఒత్తిడికి రాజీవ్‌గాంధి లొంగిపోయారు. ఆ తీర్పు చెల్లకుండా 1986లో "ముస్లిం ఉమెన్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ డైవోర్స్) చట్టం తెచ్చారు. రాజకీయ క్షేత్రంలో – ఇది తప్పుడు సలహాపై తీసుకున్న తిరోగమన చర్యగా వామపక్షాలు ఖండించాయి. ముస్లిం మతపెద్దలను బుజ్జగించేచర్యగా బిజెపి ధ్వజమెత్తింది. అప్పటినుండి ముస్లిం మహిళల్లో అంతర్గతంగా క్రమంగా హక్కులపట్ల స్పృహ కలిగింది. పర్యవసానంగా మూడుసార్లు 'తలాఖ్' ఉచ్ఛారణతో భార్యకు విడాకులిచ్చే వికృతమైన పర్సనల్ లా రక్షణను పురుషులకు రద్దు చేస్తూ పార్లమెంటు 2017లో చట్టం ఆమోదించింది. 2019లో తెచ్చిన ముస్లిం ఉమెన్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ మ్యారేజి) చట్టం ట్రిపుల్ తలాఖ్‌ను క్రిమినల్ నేరంగా ప్రకటించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పు ఒక రకంగా 1986 నాటి చట్టాన్ని తిరస్కరించింది. విడాకులిచ్చిన భర్త తమ పిల్లలకు రెండేళ్ల వరకే భరణం చెల్లించాలనే 1986 చట్టం నిర్దేశన రద్దవుతుంది. సెక్షన్ 125 ప్రకారం పిల్లలు మేజర్ అయ్యేవరకు భరణం చెల్లించాలి. అంతేకాక 1986 చట్టంలో చెప్పినట్లు భరణానికి గరిష్ట పరిమితి ఉండదు. సుప్రీంకోర్టు తాజా తీర్పును మతం దృష్టినుండి కాకుండా రాజ్యాంగం ఆశించిన మహిళల సమానత్వం దృష్టినుండి, చట్టం ముందు అందరూ సమానులేనన్న దృష్టినుండి చూడాలి.

వేరుగా తీర్పు రాసిన జస్టిస్ మాసి, మహిళలు తమ జీవితం అన్ని దశల్లో, తమ మతంతో నిమిత్తం లేకుండా, మర్యాదగా జీవించే పరిస్థితులు కలుగజేయాలన్న రాజ్యాంగ వాగ్దానాన్ని సెక్షన్ 125 ప్రతిబింబిస్తుందని చెప్పటం ద్వారా ఆయన జస్టిస్ నాగరత్న తీర్పుతో ఏకీభవించినట్లయింది. అయితే సెక్షన్ 125, 1986 చట్టం మధ్య పరస్పర ఘర్షణ లేదని అంటూ, విడాకులు పొందిన ముస్లిం మహిళలు తమ ఆర్థిక స్థితిని బట్టి సెక్షన్ 125 కింద లేక 1986 చట్టం కింద – ఏదో ఒకదాని కింద భరణం కోరవచ్చునన్నారు. ఎంచుకునే స్వేచ్ఛను ఆమెకు ఇచ్చారు. కోర్టులు రెండు చట్టాలకు సామరస్యపూర్వకమైన, ప్రయోజనకరమైన భాష్యం చెప్పాలని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న తమ తీర్పులో మహిళలకు మేలు చేసే, ఆర్థిక భద్రత భావం కలుగజేసే విలువైన సూచన చేశారు. ఇది పురుషులు ఆలోచించాల్సింది, పాటించాల్సింది. కేవలం గృహిణులుగా ఉన్న స్త్రీలకు కనీసం తమ సొంత అవసరాలకు కూడా ఆర్థిక వనరులు ఉండవు. అందువల్ల భర్త తన ఆదాయార్జనలో కొంత భార్యకు లభ్యం చేయాలి. ఆర్థికంగా స్వతంత్రంగా లేదా ఉద్యోగినిగా ఉన్న వివాహిత స్త్రీకి, కేవలం కుటుంబ సేవే పరమావధిగా గడిపే స్త్రీకి మధ్య ఉండే తేడాను ఆమె ప్రస్తావించారు. ఆదాయార్జనలేని గృహిణుల మానసిక స్థితిని పురుషులు అర్థం చేసుకోవాలని, జాయింట్ బ్యాంక్ అక్కౌంట్ లేదా ఎటిఎం కార్డు వంటిది భార్యకు కల్పించాలని సలహా ఇచ్చారు. బలహీనమైన స్త్రీకి 'ఆర్థిక సాధికారీకరణ' కల్పించటం తాను కుటుంబంలో భద్రంగా ఉన్నానన్న భావన కల్పిస్తుందన్నారు. స్త్రీకి 'ఆర్థిక భద్రత', 'నివాస భద్రత' కల్పించాలి, పెంపొందించాలి అన్నారు న్యాయమూర్తి. బలమైన భారతీయ కుటుంబం, సమాజం దేశాన్ని శక్తిమంతం చేస్తాయన్నారు.

# బిసి వర్గాలపై పాలకుల చిత్తశుద్ధి ఎంత?



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

ప్రభుత్వం వెనుకబడిన వర్గాల వారికి విద్య, ఉపాధిలో వారి జనాభా దామాషా ప్రకారం సరైన ప్రాతినిధ్యం కల్పించి ఆర్థికంగా వీరిని ప్రోత్సహిస్తూ సంపద కొందరి చేతుల్లో పోగు పడకుండా అందరికీ అందేలా చూడాలని రాజ్యాంగంలోని 38, 39 అధికరణలు చెబుతున్నాయి. కాని దేశ స్వాతంత్ర్యం పొంది 77సం.రాలు అవుతున్నా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టటంలో పాలకులు వైఫల్యం చెందారనే చెప్పక తప్పదు. జనాభాలో అధిక సంఖ్యాకులైన బడుగు బలహీన వర్గాలు బాగుపడిన నాడే దేశం బాగుపడుతుంది.

స్వాతంత్ర్యానికి పూర్వమే 1946లో ఎస్‌సి ఎస్‌టి జనాభా ప్రాతిపదికగా 12.5 శాతానికి ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించారు. స్వాతంత్ర్యానంతరం వారికి 1952లో రాజ్యాంగ బద్ధత కూడా కల్పించారు. కాలక్రమంలో రిజర్వేషన్లు గడువు పెంచుతూ వస్తున్నారు. అయితే బిఆర్ అంబేద్కర్ మాత్రం 1952లోనే వెనుకబడిన వర్గాలకు కూడా రిజర్వేషన్లు వర్తించాలని వారి తరఫున గట్టిగా వాదించారు. అయితే వారి జనాభా వివరాలు లేకపోవడం కారణమైంది.

**వెనుకబడిన వర్గాలు ఎవరు?**

భారత రాజ్యాంగంలో వెనుకబడిన వర్గాలను నిర్వచించకపోవడం... వెనుకబడిన వర్గాలు అనే పదానికి నిర్దిష్టమైన నిర్వచనం లభించడం లేదు. కేంద్ర ప్రభుత్వం 1953 జనవరి 30న ఆర్టికల్ 340 అనుసరించి వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిశీలించేందుకు 'కాకా కాలేర్కర్' ఆధ్వర్యంలో కమిషన్ వేసింది. ఆ కమిషన్ వెనుకబడిన వర్గాలు అంటే ముఖ్యంగా బిసిల స్థితిగతులపై పరిశీలనచేసి వెనుకబాటుతనాన్ని నిర్మూలించేందుకు ప్రమాణాలు నిర్ణయిస్తూ నివేదిక 1955, మార్చి 30న సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం హిందూమతంలోని సాంప్రదాయక నిచ్చెనమెట్ల కులాల అమరికలో సాంఘికంగా అట్టడుగుస్థాయిలో ఉండటం. ఒక కుల సముదాయంలో అంతర్భాగంగా లేదా ఆ కులంలో అభివృద్ధికి ఆమడదూరంగా ఉండటం, ప్రభుత్వ సేవల్లో ప్రాతినిధ్యం లేకపోవడం, ఈ కొలమాన అంశాలపరంగా కాక కాలేల్కర్ కమిషన్ 2399 సముదాయాల సమూహాలను విద్యాపరంగా, సాంఘికంగా వెనుకబడినవిగా ప్రకటించింది. వీటిలో 913 సముదాయాల జనాభా 11.5కోట్లుగా పేర్కొంది. అప్పటి దేశ జనాభా సుమారు 39,85,77,992. మిగిలిన 1486 సముదాయాల జనాభా పరిగణలోకి తీసుకోబడలేదు. అంటే వారి జనాభా ఇంకా ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు.

నాటి నుండి నేటి వరకు బిసిల జనాభా 50శాతానికి పై మాటే. కానీ కులాల వారి జనాభా లెక్కలు నేటి వరకు లెక్కించకపోవడం బిసిల దౌర్భాగ్యం, బిసిలపై పాలకులు ఉన్న కుటిల నీతికి నిదర్శనం.

**సెన్సెస్‌లో బి సి ల కులగణన చేర్చాలి:**

సాధారణంగా జనాభా లెక్కలు నిర్వహణను సెన్సెస్ చట్టం 1948 ప్రకారం కేంద్ర ప్రభుత్వం జరుపుతుంది. ఆ సెన్సెస్‌లో ఎస్‌సిలు, ఎస్‌టిలకు సంబంధించి ఆర్టికల్ 330,332,335 ప్రకారం కులగణన జరుగుతుంది. అలాగే కేంద్ర ప్రభుత్వం అనుకుంటే రాబోయే సెన్సెస్‌లో ఒబిసి కులగణ చేయవచ్చు. సెన్సెస్ ఫార్మాట్ మార్చి కార్యనిర్వహణ ఆదేశాలిస్తూ అవసరమైతే చట్టంచేసి కుల గణన చేయవచ్చు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి చేపట్టే జనగణన 2020–21లో కోవిడ్ కారణంగా వాయిదా వేశారు. 2025 లోనైనా జరిగే సెన్సెస్ లో బి సి కులగణన చేర్చాలి.

**రాష్ట్రంలో బిసిల కులగణన చేపట్టాలి:**

స్థానిక సంస్థలకు ఎన్నికలు వస్తున్నవేళ రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచాలని.. బిసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే కులగణన చేసి బిసి కమిషన్ నివేదిక ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించింది. అలాగే స్థానిక సంస్థలలో ప్రస్తుతం ఉన్న23 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ప్రకటించింది. సెన్సెస్ చట్టం ప్రకారం కేంద్రప్రభుత్వమే సెన్సెస్ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం 'కలెక్షన్ ఆఫ్ స్టాటిస్టిక్స్ యాక్ట్ 2008' క్రింద కుల సర్వే చేయవచ్చు. ఇప్పటికే బీహార్, ఒరిస్సా, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలు కుల సర్వే చేశాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కులగణనపై అసెంబ్లీ తీర్మానం చేయడమే కాక కులగణనకు రూ.150 కోట్లు కేటాయిస్తూ, 15 మార్చి 2024, న జిఒ. నెం.26 జారీచేసింది. వెంటనే చేపట్టి రెండు నెలల్లో పూర్తిచేసి బిసిలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలుచేయాలి.

**స్థానిక సంస్థలు–రిజర్వేషన్లు:**

1994 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రాష్ట్రంలో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. కానీ కొత్తగా వచ్చిన పంచాయతీరాజ్ చట్టం – 2018ప్రకారం 1) గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లలో23.59శాతం, సర్పంచ్‌లకు 22.75%, ఎంపిటిసిలకు 17.87%, జడ్‌పిటిసి లకు 16.9%, మాత్రమే ఉన్నది. దీనివలన బిసిలు తీవ్రంగా నష్టపోయారు. స్థానిక సంస్థలలో బిసిల రిజర్వేషన్ ఆ రాష్ట్ర పరిధికి వదిలిపెట్టారు. కానీ సుప్రీంకోర్టు 50% సీలింగ్ విధించింది.

**కులాలు :** కేంద్ర ఒబిసి కోటాలో నేడు గుర్తించిన కులాలు 2,633 వరకు ఉన్నాయి. మన తెలంగాణ రాష్ట్రంలో జిఒ నెం.3(9.9.2020) ప్రకారం 186 కులాలు ఉన్నాయి. ఇవన్నీ చాలావరకు కడు పేదరికంలో ఉన్నాయి. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నాయి. మారుతున్న సామాజిక నేపథ్యంలో కులవృత్తులు దూరమవుతున్నాయి. బిసిలు పొట్టకూటి కోసం దేశ, విదేశాలు ప్రధానంగా గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్తూ వివిధ వృత్తులు చేపడుతున్నారు. వారికి సామాజిక, రాజకీయ చైతన్యం, స్పృహ తక్కువ, జీవనోపాధి వెతుకులాటల్లోనే జీవితాలు మునిగిపోతున్నాయి. విద్యావంతులలో ఒబిసి స్పృహ కొంత ఉన్నా మనకెందుకులే అనే ధోరణి ఎక్కువ. అందుకే ఒబిసిలలో చైతన్యం రగిలించాలి.

ఇప్పటికైనా రాజకీయ వివాదాలు పక్కనపెట్టి బిసిలు ఒక ఐక్యశక్తిగా అవతరించినప్పుడే రాజ్యాధికారం వారికి అందుతుంది. చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలన్న.. బిసిల జనాభా తేల్చాల్సిందే.. జనాభాకు తగినట్లుగానే స్థానిక సంస్థలతోపాటు.. చట్టసభల్లో కూడా రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉంది. అప్పుడే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించిన వారమవుతాం.

# మహిళల్లో అక్షరాస్యత పెరగాలి..

పితృస్వామ్య విధానాలు వేళ్లూనుకున్న మన దేశంలో మహిళల హక్కులకు అర్థం లేకుండాపోతున్నది. సమాన హక్కుల మాట ఎలావున్నా, వారిని కనీసం సాటి మనుషులుగా చూడడం మానేసిన వైనం మన కళ్ల ముందు కనిపిస్తునే ఉంది. తమ డిమాండ్లపై మహిళలు చేస్తున్న పోరాటాలు ఎవరికీ కనిపించడం లేదు. ఇక వారి నిశ్శబ్ద రోదనలను పట్టించుకునేది ఎవరు? వారి గొంతుకలు మూగపోతున్నారు. వారి జీవితాలు అణచివేతకు గురవుతున్నాయి. సెలవు అనే మాటే లేకుండా, ప్రతి రోజూ... ప్రతి గంటా ఏదో ఒక పని చేయక తప్పడం లేదు. నిరక్షరాస్యత కూడా మహిళల్లోనే ఎక్కువగా ఉంది. అమ్మాయిలకు చదువులు ఎందుకు? అనే ఆలోచన మన సమాజంలో వేళ్లూనుకుంది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి,ముఖ్యంగా అక్షరాస్యతా శాతాన్ని పెంచడానికి ఎన్నో సంస్థలు కృషి చేశాయి. ఇప్పటికీ చేస్తునే ఉన్నాయి. ఈ క్రమంలో చైల్డ్ రైట్స్ అండ్ యు (సిఆర్‌వై/ క్రై) అనే స్వచ్ఛంద సంస్థ ఒడిశాలోని పూరీ వద్ద 'దేశ్ కీ భలై' (దేశ హితవు కోసం) అనే నినాదంతో దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించింది. పాఠశాలల్లో బాలికల భాగస్వామ్యాన్ని పెంచడం, మహిళలతో హానికారకమైన కంపెనీల్లో పనులు చేయించడాన్ని నిషేధించడం వంటి లక్ష్యాలతో ఈ ప్రచారం కొనసాగనుంది. 2011 జనాభా లెక్కల సమాచారం: పురుషుల అక్షరాస్యత రేటు 82.14 శాతంగాకా, మహిళల్లో ఇది 65.46 శాతం మాత్రమే. అంతేకాదు, ఉన్నత విద్యకు వెళుతున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటున్నది. స్కూళ్లకు వెళుతున్న ప్రతి 100 మంది బాలికల్లో కేవలం ఒకరు మాత్రమే 12వ తరగతికి చేరుకుంటున్నారంటే, పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. సుమారు 40 శాతం మంది బాలికలు ఐదవ తరగతి కూడా పూర్తి చేయక ముందే, చదువును ఆపేస్తున్నారు. అంటే, వీరు కేవలం లెక్కల్లోనే అక్షరాస్యులుగా కనిపిస్తారు గానీ, వాస్తవానికి నిరక్షరాస్యులుగానే పరిగణించా లి. అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల ప్రాథమిక స్కూళ్లలో నమోదు కొంత మెరుగ్గా ఉంది. 89.28 శాతం మంది అబ్బాయిలు స్కూళ్లలో చేరుతుంటే, అమ్మాయిలు 94.32 శాతం మంది ఉన్నారు. కానీ, అత్యధిక శాతం డ్రాపౌట్స్ కూడా బాలికల్లోనే ఉంది. ప్రాథమిక పాఠశాలను పూర్తిచేసి, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలకు వెళ్లే బాలికలు చాలా తక్కువ. ఆ తర్వాత ఇంటర్, డిగ్రీ, పిజి స్థాయికి వచ్చేసరికి మహిళల శాతం మరింత కుదించుకుపోతుంది. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి. సామాజిక కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, పితృస్వామ్య ఆలోచనా ధోరణులను ప్రధానంగా పేర్కోవాలి. నిజానికి 1990 దశకం నుంచి పాఠశాలల్లో బాలికల నమోదు వేగంగా పెరిగినప్పటికీ అసమానతలు కొనసాగుతున్నాయి. అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల్లో డ్రాపౌట్ రేట్లు ఎక్కువగా ఉన్నాయి. చదువు పూర్తిగా మానకపోయినా, స్కూలుకు హాజరుఅయ్యే బాలికల్లో చాలా తక్కువ. ఇక, ప్రభుత్వ పాఠశాలల్లో , కిక్కిరిసిన తరగతి గదులు, ఉపాధ్యాయులు గైర్హాజరు వంటి సమస్యలున్నాయి. చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవు. పారిశుద్ధ సౌకర్యాలు కరువు. అలాంటి పరిస్థితుల్లో బాలికలు ఏ విధంగా తరగతులకు హాజరుకాగలరో ప్రభుత్వ పెద్దలో చెప్పాలి. 'బేటీ బచావో.. బేటీ పఢావో' వంటి నామమాత్రపు నినాదాలు, పైపై కబుర్లు కాదు.. వారి సంక్షేమానికి, ప్రత్యేకించి అక్షరాస్యతను పెంచడానికి కట్టుదిట్టమైన చర్యలు అవసరం. ఇక సామాజిక అంశాలు కూడా బాలికలను చదువుకు దూరం చేస్తున్నాయి. ఆచార వ్యవహారాలు, బాల్య వివాహాలు, కదలికలపై ఆంక్షలు వంటి సమస్యలు వారిని చదువుకోకుండా అడ్డుకుంటున్నాయి. బయటకు వెళితే, వేధింపులు అదనం. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయేగానీ తగ్గడం లేదు. ప్రేమ పేరుతో దాడులు రోజువారీ వార్తగా మారింది. ఇలాంటి దుస్థితిని ఎదుర్కొని మహిళలు విద్యావంతులు కావడం చెప్పినంత సులభం కాదు.

# అగ్ని ప్రమాద రహిత దేశంగా భారత్ నిలవాలి

మనదేశంలో అగ్ని ప్రమాదాలు ఇటీవల కాలంలో తరచుగా జరుగుచున్నవి. దీనివలన ప్రజల ప్రాణాలకు, ఆస్తులుకు తీవ్రమైన నష్టం జరుగుతున్నది. కర్మాగారాలలో కార్యాలయాలలో ఎక్కడ ఎటువంటి అగ్నిప్రమాదమైనా అగ్ని ప్రమాదక భద్రత నిబంధనలోని లోపాలను ఎత్తిచూపుతున్నవి వివిధ నివేదికల గణాంకాల ప్రకారం అగ్ని ప్రమాదాల కారణంగా రోజుకు సగటున 60 నుండి 70 మరణాలు సంభవిస్తున్నాయి. వీటికి కారణం ప్రధానంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్స్ అని విదితమవుతున్నది. అనేక రకాల ఒత్తిళ్ల వలన అగ్నిమాపక భద్రతా నియమ నిబంధనలు సరిగా అమలు చేయడం లేద ని నిరూపణ అవుతున్నది. నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా అగ్ని భద్రత కోసం సమగ్ర మార్గదర్శకాలను రూపొందించింది. అయితే ఇవి చాలా అరుదుగా ఎక్కడో ఒకచోట ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. సరైన తరలింపు వ్యవస్థలు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్‌లతో సహా ఎత్తైన భవనాల కోసం ఎన్‌బిసి అగ్నిభద్రతా చర్యలను తప్పనిసరి చేస్తున్నది కానీ వాస్తవ రూపంలో అనేక భవనాలకు అగ్ని భద్రతకు సంబంధించిన ప్రాథమిక నిబంధనలు అమలు చేయడంలేదు. వివిధ అగ్ని ప్రమాద కఠినమైన నిరోధక చట్టాల నిబంధనలు ఉన్నప్పటికీ సక్రమంగా అమలు చేయకపోవడం వలన పదేపదే విషాద సంఘటనలు జరుగుతున్నవి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మరియు ఇతర నియంత్రణ సంస్థలు అగ్ని ప్రమాదాల అవశ్యకత గురించి ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నాయి కానీ అధికారుల అలసత్వం అవినీతి మరియు వనరుల కొరత కారణం గా తరచుగా వీటిని పట్టించుకోవడం లేదు. దేశం లో అగ్నిమాపక సిబ్బంది చాలా తక్కువగా ఉన్నా రు.

అగ్ని ప్రమాదాలను నివారించడానికి భద్రతా నిబంధనలకు తగు సవరణలు చేయాలి. కఠినంగా అమలుపరచాలి. అన్ని భవనాలకు ఫైర్ సేఫ్టీ ఆడిట్‌లు తప్పనిసరి చేయాలి. నిష్పాక్షికతను నిర్ధారించడానికి ఈ ఆడిట్‌లను స్వతంత్ర ఏజెన్సీలు ఏర్పాటు చేయాలి. ప్రజలందరికీ అవగాహన కల్పించడానికి మరియు అత్యవసర పరిస్థితులకు సిద్ధం చేయడానికి అగ్ని భద్రతపై క్రమ శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలి. అగ్ని ప్రమాదాలకు అయా యజమానులను, నిర్వాహకులను బాధ్యులను చేయాలి వివిధ సందర్భాలలో వివరించిన సుప్రీం కోర్టు తీర్పులను ఖచ్చితంగా అమలు చేయాలి.

అగ్ని భద్రతకు చురుకైన, కఠినమైన విధానాన్ని అవలంబించడం ద్వారా దేశంలో విషాద సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించవచ్చు. ఫలితంగా ప్రజల జీవితాలను ఆస్తులను పరిరక్షించి అగ్ని ప్రమాద రహిత దేశంగా పేర్కొనవచ్చు.

దండంరాజు రాంచందర్ రావు
9849592958

# మత్తు(మట్టి) మనుషులు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమయంలో మనం మట్టి మనుషుల చరిత్ర గురించి చదివాము. అహర్నిశలు బువ్వకోసం పోరాటం, ఆ బువ్వ దొరకనప్పుడు చెరువులు, కుంటలలో దొరికే మెత్తటి రేగటి మట్టిని ఆహారంగా తినేవారి గడ్డురోజుల చరిత్ర చదివాము. అటువంటి మట్టి వాసన చరిత్ర కలిగిన ఈ నేలలో నేడు ప్రజలు మత్తులో మునిగి తేలుతున్న చరిత్రను చదువుతున్నాము, చూస్తున్నాము. మత్తు మందులను చిత్తుగా తాగేసి, తాగుడుకు బానిసలై చిన్నాభిన్నమైన కుటుంబాలు నేడు వేలకొలది ఉన్నాయి. భర్తలు దూరమై కొందరు, భార్యలు దూరమై ఇంకొందరు పిల్లలు మత్తుకు బానిసలైన కుటుంబాలు మరికొన్ని ఇలా, ఈ రాష్ట్రంలో, దేశంలో చాపకింద నీరులా మత్తు "ప్రమాదకర ఘంటికలు" మోగుతున్నాయి. కాని అవి ప్రభుత్వాలకు గాని, పాలకులకు గాని, ప్రజలకు గాని, వారి కుటుంబాలకుగాని కనబడడం లేదా అనేది ప్రశ్న. కనిపించినా అది ఒక అలవాటు అని, ఒక ఫ్యాషన్ అని మరికొందరు, కష్టపడిన తరువాత అలసట తీర్చుకోవడానికి, సేదతీరడానికి ఒక అమృతం అన్నట్లుగా ఇలా అనేక సాకులతో, పేర్లతో మత్తు పానీయాలను ఉపయోగిస్తున్నారు. కాని అది, ఆ కోరిక వ్యసనం వైపు అడుగులు వేయిస్తుందని అనుకోవడం లేదు. ఈ మధ్యకాలంలో యువత గంజాయి, ఇ–సిగరెట్లుతో మత్తులో తూగుతున్నారు. విందులలో, పబ్బులలో, క్లబ్బులలో, హోటళ్లలో, మార్కెట్లలో, జిమ్‌సెంటర్లలో, మసాజ్ సెంటర్లలో, చివరికి పాఠశాల, కళాశాలల పరిసరాలలో కూడా "గంజాయి" దొరుకుతుందంటే పరిస్థితి ఎంత దయనీయంగా తయారయిందో అర్థమవుతుంది. రోజుకు 10గంటలు పనిచేసే కూలి తన సంపాదనలో సగం వరకు "మద్యం" కొరకే ఖర్చు పెడుతున్నాడు, ఒక్కడే సగం ఖర్చు పెడితే, మిగతా ఆ కుటుంబ సభ్యులు జీవించటం ఎలా? పని దొరికిన రోజు తాగడం, దొరకని రోజు అప్పుచేసి తాగడం ఇలా తాగనిదే బ్రతకలేను అనే స్థాయికి, ఆ 'మద్యం మత్తు' ఒక వ్యసనం లా తయారు చేస్తుంది. ఇక శ్రీశ్రీ చెప్పినట్లు కొంతమంది యువకులు ముందు యుగం దూతలు, భావన నవజీవన, బృందావన నిర్మాతలు అని యువతకు వర్ణించినాడు. కాని నేటి యువత మద్యం మత్తులో, గంజాయి మత్తులో మునిగి తేలుతున్నారు. తల్లిదండ్రుల గారాబం ఒకవైపు, రాజకీయ నాయకుల అండదండలు మరొకవైపు, సంఘ విద్రోహకర శక్తుల అభయహస్తం, ఇక పాఠశాలలు, కళాశాలలు, మాకెందుకులే అని చూసీచూడనట్లు, సామాజిక స్పృహ ఉండవలసిన సమాజం, తన వ్యక్తిగత అభివృద్ధికి సమయం కేటాయించడం, గంజాయి మత్తుపై ఉక్కుపాదం మోపవలసిన అధికారులు, అవినీతికి పాల్పడుతూ, మత్తు పదార్థాలను సరఫరా చేసేవారికే సహకరించడం, శిక్షలు పడవలసిన యువతకు రాజకీయ నాయకుల అండదండలతో క్షేమంగా బయటపడుతున్నారు. పేరుకే డిగ్రీలు, పీజీలు యువత పూర్తిచేస్తున్నారు. కాని వారికి ఆ చదువులలో కనీస విద్యాప్రమాణాలు కూడలేని చదువులు అని వారు ఉద్యోగాలలో ఇంటర్వ్యూలకు వెళ్లినపుడు తెలుస్తున్నది. ఇక తెలుగు రాష్ట్రాలలో తమ ఇళ్లల్లో ఎటువంటి చిన్న శుభకార్యాలు జరిగిన "మందు" పేరుతో వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ధనవంతుల ఇళ్ళల్లో జరిగే పెళ్లి విందులను చూసి, పేద మధ్యతరగతి వారు కూడా అదే బాటలో విందులు చేసి, అప్పుల పాలవుతున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఇటువంటి విందులు, పుట్టుక మొదలు చావు కార్యం వరకు, ఏది చేసిన అది మందుతో మొదలై, చివరకు ఖరీదై అప్పుల ఊబిలోకి నెట్టబడుతున్నారు. నలుగురు వ్యక్తులు గుమికూడితే చాలు విందు చేసుకుందాం అని, ఆ విందు కాస్తా మత్తుగా మారి గంజాయి, ఇ–సిగరెట్లు, ...ఇలా అనేక మత్తు పదార్థాలను తీసుకుని మెదడు, శరీరంపై తమ పట్టును కోల్పోయి, వికృత చేష్టలు చేస్తూ, అది చివరకు, దోపిడి, దొంగతనం, మానభంగాలు, దౌర్జన్యాలు చేస్తూ, సంఘ విద్రోహకర శక్తులుగా మారి చివరికి సమాజానికి, దేశానికి వారి కుటుంబాలకు మాయనిమచ్చగా తయారు కాబడుతున్నారు. అందుకే

- పాలకులు, ప్రభుత్వాలు, ఆదాయమే పరమావధిగా భావించే మద్యం షాపులను రద్దు చేయాలి. దానికి ప్రత్యామ్నాయంగా, ఆర్థిక పరమైన ఆదాయాలు సమకూరే ఆర్థిక విధానాలను అన్వేషించాలి.
- మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపాలి
- ఇందులో ఎటువంటి రాజకీయ, వ్యక్తిగత, బంధుత్వ, పక్షపాతం వంటివి ఉండకుండా అధికారులు, ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలలు, కళాశాలలు, రిసార్ట్‌లు, క్లబ్బులు, పబ్బులు, మసాజ్‌సెంటర్లు, జిమ్‌సెంటర్ల వద్ద నిరంతర నిఘా కొనసాగించాలి.
- దీనికోసం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- పాఠశాలల్లో, కళాశాలల్లో, మహమ్మారి మత్తు పదార్థాల వాడకం, నిర్మూలనకై అవగాహన సదస్సులు, కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- గ్రామాలలో, పట్టణాలలో, బస్తీలలో "మద్యం"కు బానిసలవుతున్న వ్యక్తులను, కుటుంబాలను గుర్తించి వారి జీవితంపై, భవిష్యత్తుపై కుటుంబ అవసరంపై, పిల్లల పోషణ వంటి వాటిని క్రోఢీకరించి, అవగాహన సదస్సులు నిర్వహించడానికి, ప్రత్యేక వాలంటీర్లను నియమించాలి.



వై.కరుణాకర్‌రెడ్డి
ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
9866103202

# పేదలను 'సమాధి' చేస్తున్న అక్రమ అవయవ వ్యాపారం

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అక్రమ అవయవ వ్యాపారం ధనవంతుల జీవన ప్రమాణాలను పెంచుతుండగా.. మధ్యవర్తులకు లాభాలపంటను పండిస్తున్నది. అదే సమయంలో పేదలను మాత్రం 'సమాధి' చేస్తున్నది. ఇటీవల ఢిల్లీ, విజయవాడలో వెలుగుచూసిన ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సోషల్ మీడియా ద్వారానూ ఈ ఆర్గాన్ రాకెట్ యథేచ్ఛగా కొనసాగుతుండడం ఆందోళనకు గురి చేస్తున్నది.

**ఇండియాలో విదేశీయుల ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్**

హ్యూమన్ ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ రాకెట్ ను ఇటీవల ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఒక మహిళా డాక్టర్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. ఇందులో దాతలు, గ్రహీతలతోపాటు కీలక సూత్రధారి బంగ్లాదేశ్ కు చెందిన వారిగా గుర్తించారు. 2019 నుంచి ఈ ఆర్గాన్ రాకెట్ కొనసాగుతున్నదని నిర్ధారించారు. ఒక్కొక్కరి నుంచి రూ. 25 నుంచి రూ.30 లక్షలు వసూలు చేస్తున్నారని భావిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన ఈ రాకెట్ ఢిల్లీలోని ఒక మహిళా డాక్టర్ సహాయంతో నోయిడాలోని ఆస్పత్రిలో 15 నుండి 16 కిడ్నీలు మార్పిడి చేసినట్లు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో ఇక్కడికి తీసుకొచ్చి, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, బంధువుల పేరుతో ప్రవేశపెట్టి కిడ్నీ మార్పిళ్లు చేస్తున్నట్లు నిర్ధారించారు.

**భారతీయులను విదేశాల్లోకి తీసుకెళ్లి..** ఇండియాలో వెలుగుచూసిన పలు ఆర్గాన్స్ రాకెట్స్ లో అంతర్జాతీయంగా వ్యాపారం కొనసాగుతున్నట్లు తేలింది. 2024 మేలో వెలుగు చూసిన హైదరాబాద్ వయా కొచ్చి టూ ఇరాన్ కేంద్రంగా నడిచిన ఓ కిడ్నీ రాకెట్ గతంలో భారత దేశంలో సంచలనం సృష్టించింది. ఓ యువకుడు అనారోగ్యంతో మృతిచెందగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కిడ్నీ రాకెట్ ముఠా గుట్టురట్టు చేశారు. ఈ ముఠా పేద యువకులను లక్ష్యంగా చేసుకుని ఒక్కో కిడ్నీకి రూ.20 లక్షలు ఇస్తామని ఆశ జూపి.. ఇరాన్‌కు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అక్కడ కిడ్నీలు తీసుకుని.. తిరిగి ఇండియాకు తీసుకొస్తున్నట్లు నిర్ధారించారు. హైదరాబాద్, కేరళకు చెందిన 40 మంది యువకులను ఇలా ఇరాన్ కు తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేయించినట్లు పోలీసులు గుర్తించారు. శ్రీలంక, ఈజిప్ట్, టర్కీలకు సైతం తీసుకెళ్లి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు కొన్ని కేసుల్లో నిర్ధారించారు.

**పేదరికాన్ని ఆసరాగా చేసుకొని..** పేదల ఆర్థిక అవసరాలే అవయవాల అక్రమ వ్యాపారానికి పెట్టుబడిగా మారుతున్నాయి. గుంటూరుకు చెందిన ఆటో డ్రైవర్ ఆర్థిక పరిస్థితి, అతడి అప్పులను ఆసరాగా చేసుకొని కిడ్నీ తీసుకున్న ఘటన ఇటీవల విజయవాడలో కలకలం రేపింది. అయితే రూ. 30 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని రూ.1.10లక్షలు మాత్రమే చెల్లించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎపి ప్రభుత్వం సీరియస్ అయి విచారణకు ఆదేశించింది. గతంలో విశాఖపట్నంలో కూడా ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. విశాఖపట్నంలో చట్టవిరుద్ధంగా 10 శాతం మేర కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయని గతంలో నగర పోలీసు కమిషనర్ కూడా చెప్పడం గమనార్హం.

**సోషల్ మీడియా ద్వారా..** సోషల్ మీడియా ద్వారానూ అక్రమ అవయవ వ్యాపారం కొనసాగుతున్నట్లు అర్థమవుతున్నది. ఇటీవల విజయవాడలో వెలుగు చూసిన కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ వ్యవహారం కూడా సోషల్ మీడియా పరిచయాల ద్వారానే జరిగినట్లు తెలుస్తున్నది. గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబుకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైన బాషా కిడ్నీ అమ్మి డబ్బులు సంపాదించుకోవచ్చని సలహా ఇవ్వడంతోనే మధుబాబు దానికి ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు మానవ అవయవాలను విక్రయించేందుకు ఓ ప్రముఖ ఆస్పత్రి వెబ్ సైట్‌ను పోలి ఉన్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు 2023లో గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు ఆఫ్రికన్ పౌరులతో సహా ఐదుగురిని చెన్నై పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. ఓ ముఠా ఈ నకిలీ వెబ్‌సైట్‌ను నడుపుతున్నట్లు కేసు దర్యాప్తులో తేలింది. ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి మానవ అవయవాలను మార్పిడి చేయడానికి ఈ ముఠా రూ.5కోట్ల వరకు ధర చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. అవయవదానం పేరుతో ఫేస్ బుక్ అడ్డాగా దందా సాగిస్తున్న గ్యాంగ్ ను గతంలో రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.

**కిడ్నీలకు ఫుల్ డిమాండ్...** అవయవాల మార్పిడిలో కిడ్నీలకు ఫుల్ డిమాండ్ ఉంటున్నది. జీవన్ దాన్ వెబ్ సైట్స్ లో వంద మంది అవయవదానం కోసం ఎదురు చూస్తుంటే వాటిలో కిడ్నీల కోసం ఎదురు చూస్తున్నవారే 70 మంది వరకు ఉంటారు. కిడ్నీ మార్పిడి అవసరమైన వాళ్లు దేశంలో ఏటా సుమారు 1.5 లక్షల నుంచి 2 లక్షల మంది పెరుగుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 8 లక్షల నుంచి 9లక్షల మంది వరకు కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు.

**కఠిన శిక్షలున్నా..** ఎవరికైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి బంధువుల అనుమతితో అవయవదానం చేయవచ్చు. అలాగే రక్త సంబంధీకులు వారి కుటుం బ సభ్యులకు అవయవదానం చేయవచ్చు. రెండు కిడ్నీలు, రెండు కళ్లు, రెండు ఊపిరితిత్తులు, కాలేయం, గుండె ఇలా ఒక మనిషి అవయవదానం చేస్తే ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. అయితే అవయవదానం చేయాలంటే ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేయకుండా ఎవరైనా అవయవదానం చేస్తే అది నేరం. వారికి ఐదు నుంచి పది సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష పడుతుంది.

అవయవ మార్పిడి చట్టం–1994 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించి ఆపరేషన్ చేసిన డాక్టర్ల రిజిస్ట్రేషన్, ఆపరేషన్ జరిగిన ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తారు. అవయవదాన చట్టంలో 2023 లో కేంద్రం కొన్ని మార్పులు చేసింది. నోటో (నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంట్ ఆర్గనైజేషన్)లో ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అందుబాటులో ఉంచింది.

**ఖిజర్ పాషా,** 8008710143

## విధిగా మొక్కలు నాటాలి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధిగా మొక్కలు నాటాలని మునుగోడు ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం 75వ వన మహోత్సవం సందర్భంగా మునుగోడు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. పాఠశాలలో మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారని ఎంఎల్ఎ దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. నాలుగైదు రోజుల్లో బాల బాలికలకు వేరువేరుగా మూత్రశాలలను ఏర్పాటు చేయాలని సంబం ధిత శాఖ అధికారులను కోరారు. మండల అభివృద్ధి అధికారి పూజ, పిఆర్ఎఈ సతీష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్యంలో మిర్యాలగూడను ముందుంచాలి : ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** తెలంగాణాలో 119 నియోజకవర్గాల్లో మిర్యాలగూడ పట్టణాన్ని పారిశుద్ధ్యంలో ముందుంచాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పలు స్వచ్ఛంద కార్యక్రమాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రి నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను నా మిర్యాలగూడ అని ప్రతి ఒక్క మిర్యాలగూడ వాసి గర్వంగా చెప్పుకునే విధంగా మిర్యాలగూడ పట్టణాన్ని తీర్చిదిద్దాలన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య సిబ్బంది నీరు నిల్వ లేకుండా చూడాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చెత్తాచెదారం లేకుండా పనిచేయాలన్నారు. మిర్యాలగూడను పారిశుద్ధ్యం తోపాటు విద్యా, వైద్యం రంగాల్లో ముందుంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో భవిష్యత్తు బిజెపిదే

మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణలో భవిష్యత్ బిజెపి పార్టీదేనని మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గాల సమక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బిజెపి పార్టీ ఊసేలేదని ఎంతోమంది అన్నారని నేడు రాష్ట్రంలో బిజెపి రెండోస్థానంలో ఉందన్నారు. ఇదే ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు పని చేసి పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఊసే లేకుండా పోయిందన్నారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి కృషి చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర్ రావు, మాజీ శాసన సభ్యులు శానంపూడి సైదిరెడ్డి, నాయకులు వర్షిత్ రెడ్డి, బండారు ప్రకాష్, కర్నాటి కిషన్, జుట్టుకొండ సత్యనారాయణ, సలిగంటి వీరంద్ర పాల్గొన్నారు.

## విద్యతోనే బంగారు భవిష్యత్తు

టిజిటిడిసి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇమాంపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ మోడల్ స్కూల్ బాలిక వసతి గృహంలోని విద్యార్థులకు స్ప్రెడ్ ఇండియా, సెన్ ఫ్లెక్స్ సెంచరీ మ్యాట్రెస్ సహకారంతో పరుపులు, బెడ్ షీట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సంపూర్ణ విద్య అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. రూ. 70లక్షలకో గదుల నిర్మాణం, ట్రాన్స్ ఫార్మర్, నీటి ట్యాంక్ ఏర్పాటు తాను చేయించినట్లు తెలిపారు. ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరడంతో అది కూడా త్వరలో సమకూరుస్తానని చెప్పారు. అనంతరం విద్యార్థులకో తలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టు శ్రీనివాస్, షఫిఉల్లా, రమణారెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణకు పాటుపడాలి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** కుటుంబ నియంత్రణను ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ప్రపంచ జనా భా దినోత్సవ వేడుకల్లో భాగంగా జనాభా పెరుగుదలపై అవగాహన, కుటుంబ నియంత్రణ పద్ధత్తులపై ఆయన మాట్లాడారు. జనాభా పెరుగుదల సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అభివృద్ధికి నిరోధకంగా మారుతుందన్నారు. ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణ కోసం పాటుపడాలన్నారు. స్త్రీవైద్య నిపుణులు డాక్టర్ బి.వనజ మాట్లాడుతూ స్త్రీలకు అంతర ఇంజెక్షన్ ద్వారా కుటుంబ నియంత్రణ పాటించే విధానంపై వివరించారు. కుటుంబ నియంత్రణ పద్దతులపై ఉత్తమ ప్రతిభ కనబర్చిన డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ జయ శ్యాంసుందర్, డాక్టర్ పి వెంకటమణ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కోటిరత్నం పాల్గొన్నారు.

# గ్రామాలు అభివృద్ధి చెందాలంటే దాతలు ముందుకు రావాలె

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/(నల్లగొండ)తిప్పర్తి :** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వంతోపాటు, దాతలు ,స్వచ్ఛంధ సంస్థలు ముందుకు వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లాలోని తిప్పర్తి మండలం శిలార్‌మియా గూడెం గ్రామంలో రామచంద్రారెడ్డి, భారతీల జ్ఞాపకార్థం నిర్మించిన లైబ్రరీ ,అంగన్వాడీ కేంద్రం, క మ్యూనిటీ హాళ్లను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గ్రామంలోని యువత, రైతులు, మ హిళలు ,అన్ని వర్గాల వారు ప్రపంచం లో జరుగుతున్న విషయాలను తెలుసుకునేందుకు లైబ్రరీ నిర్మించడం, చిన్న పిల్లలకు పౌష్టికాహారం, విద్యను అందించేందుకు అంగన్వాడి భవనాన్ని నిర్మించడం, అలాగే గ్రామంలోని అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ ని ర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. ప్ర భుత్వం అన్ని కార్యక్రమాలు చేపట్టలేదని, ఇలా ంటి దాతలు ముందుకు వచ్చినపుడు అభివృద్ధి స్ప ష్టంగా సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి శిలార్‌మియా గూడెం గ్రామానికి సబ్ స్టేషన్ వారం రోజుల్లో ఫౌండేషన్ వేస్తామని ,అందుకు అవసరమైన స్థలం చూడాలని ఆదేశించారు. ఎస్ఎల్ బిసి పూర్తికి 2,200 కోట్లలను కేటాయించడమే కాకుండా, బడ్జెట్లో ఇబ్బందులు లేకుండా గ్రీన్ ఛానల్ లో పెట్టించినట్లు తెలిపారు. అలాగే బ్రాహ్మణ వెల్లేముల పూ ర్తికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.పేదలకు ఇచ్చిన హామీల మేరకు త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు కట్టించనున్నామని ఆయన వెల్లడించారు. ఆయన వెంట జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి, ఆర్‌డిఓ రవి తదితరులు పాల్గొన్నారు.

**✻ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి**

పర్యావరణం కాపాడేందుకు సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం అయన తిప్పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు, వర్షాలు అధికంగా కురిసేందుకు మొక్కలు దోహదం చేస్తాయని, అడవులు ఎక్కువగా ఉన్నచోటనే వర్షాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో ఈ ఏడాది 66 లక్షల మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్క సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడ ఖాళీ స్థలం ఉన్న, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుం డా అన్ని స్థలాలలో అలాగే రహదారులకు ఇరువైపులా అన్నిచోట్ల మొక్కలు నాటాలని కోరారు. అంతకుముందు మంత్రి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ టీ. పూర్ణచంద్ర , డిఎఫ్ఓ రాజశేఖర్ ,డి ఆర్‌డిఓ నాగిరెడ్డి, డిఈఓ బిక్షపతి, ఎస్ ఈ వెంకటేశ్వర్లు, భూమయ్య, రవి, శివరామిరెడ్డి,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమే ష్, పల్లి ఎల్లయ్య, విజయలక్ష్మి తదితరులలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/గుండాల :** రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారి సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి మండల అధ్యక్షులు సిమోన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తే ఆ సందర్భంగాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిందని గుర్తు చేశారు. అదే తరుణంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా అంగన్‌వాడీలకు తక్షణమే రూ. 18వేల వేతనం ఇవ్వాలని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. లక్ష, ఆయాలకు రూ. 50వేలు ఇస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి, ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందించాలని వినతి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కేసారం, కుసుమవారిగూడెం వద్ద గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను లబ్దిదారులకు అందించాలని కోరుతూ సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి మూడెళ్లు అవుతున్న డ్రా పద్దతిలో లబ్దిదారులను ఎంపిక చేసి అధికారులు వారికి ఇండ్లను కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు నిమ్మల ప్రభాకర్, నాయకులు పెండెం కృష్ణ, నవీన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి లేనియెడల ఉద్యమాలకు సిద్ధం కావాలి

సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** నగరంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై కాం గ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం సిపిఐ కార్యకర్తలు ప్రజలను ఉద్యమాలకు సిద్ధం చేయాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ నగర కౌన్సిల్ సమావేశం కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో అనేక సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయని, ఏ ఒక్క ప్రజా ప్రతినిధి ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా నగరంలో స్మార్ట్ సిటీ పనులు గత సంవత్స రానికి పైగా నిలిపివేయబడివని, ప్రధాన రహదారుల్లో రోడ్లు , డ్రైనేజీలు మధ్యలోనే నిలిచిపోవడం వల్ల చాలా ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారని, వీటిని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యం వల్ల రోడ్లు డ్రైనేజీలు మధ్యలో నిలిచిపోవడం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పి ఆరు నెలలుగడిచినా ఇప్పటికీ అమలు కాకపోవడం సరికాదన్నారు. నేటి వరకు చాలా మంది నగర ప్రజలకు 500 రూపాయల గ్యాస్ రావడం లేదని, 200 యూనిట్ల ఉచిత కరెంటు పథకం అందరకపోవడంతో చాలా మంది మున్సిపల్ కార్యాలయంలో ఉదయం ఏడు గంటలకు వెళ్లి లైను కడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మ హిళకు రూ.2500, రేషన్‌కార్డులు ఇవ్వకపోడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కేంద్ర మంత్రిగా ఎన్నికైన బండి సంజయ్ స్మార్ట్ సిటీ కరీంనగర్‌కు ఎక్కువ నిధులు తీసుకువచ్చి నగరాన్ని అభివృద్ధి పరచాలని, విద్యారంగంలో ఎన్ఐటి, ఐఐటి, సైనిక్ స్కూల్ లాంటి ఉన్నత విద్యాసంస్థలను నెలకొల్పుటకు కృషి చేయాలన్నారు. సిపిఐ పార్టీ నిర్మాణాన్ని వాడవాడనా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమా వేశంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లమ్మ, నలువాల సదానందం, శాఖ కార్యదర్శులు న్యాలపట్ల రాజు, చెంచల మురళి, హేమంత్, తంగెళ్ల సంపత్, బాగోతం వీరయ్య, నరసింహ, సదయ్య, అరవింద్ మల్లేశం, రాజేందర్, లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుపంట రుణాలను మాఫీ చేయాలి

✻ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

✻ సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/చండూరు :** తెలంగాణ రాష్ట్రంలో 2018 కన్న ముందు ఉన్న రైతు పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. గురువారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో జరిగిన మునుగోడు నియోజకవర్గం స్థాయి మండల కార్యవర్గ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. బ్యాంకులలో 2018 కన్న ముందు రైతులు తీసుకున్న రైతు రుణమాఫీ 2లక్షల వరకు మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు రుణ మాఫీతో పాటు రైతు భరోసా కింద ఎకరానికి 15వేలు ఇవ్వాలన్నారు. ప్రజలు ఎదురు చూస్తున్న రేషన్ కార్డులు , ఫిన్షన్లు , అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని అన్నారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి నియోజకవర్గానికి సాగు, త్రాగు నీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. చండూరు మండలంలో ఉన్న చిన్న నీటి వనురులైన బెండమలమ్మ చెరువు , శేటిలేటి వాగు ఫీడర్ ఛానల్, వెల్మ కన్నె ఫీడర్ ఛానల్ ను పూర్తి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వమించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ , ఎంపిటిసిలను గెలిపించుకోవాలని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల జనరల్ కౌన్సిల్ సమావేశాలు , గ్రామ శాఖ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్గూరి నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు ఆర్ అంజాచారి,నల్పరాజు రామలింగయ్య, తీర్పారి వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, మండల పార్టీ కార్యదర్శులు నల్పరాజు సతీష్ కుమార్, ఈదుల బిక్షం రెడ్డి, చాపల శ్రీను, సూదనబోయిన రమేష్, పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, సుర్గి చలపతి, బూడిద సురేష్ , బరిగెల వెంకటేష్, జగన్, రాజు, లాలు తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాజి మంత్రి నర్సింహులు

**ప్రజాపక్షం/ఆలేరు :** కాంగ్రెస్ ప్ర భుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజి మంత్రి మో త్కుపల్లి నర్సింహులు అన్నారు. గురువారం ఆలేరు పట్టణంలో మా జి మంత్రి జన్మదిన వేడుకలు పురస్కరించుకొని, స్థానిక వైఎస్ఆర్ గార్డెన్‌లో ఎండి సలీం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏడు నెలలు గడిచిన అమలు చేయకుండా కాంగ్రెస్ కాలక్షే పం చేస్తుందని, ప్రతి నెల మహిళలకు రెండు వేలు ఇస్తామని, గ్యాస్ సిలిండర్ 500కే ఇస్తామని, రైతులకు ప్రతి ఏటా 15 వేలు పంట పెట్టుబడి సాయం, కూలీలకు 12 వేలు, 18 ఏళ్లు వయసు నిండిన అమ్మాయిలకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ అమలులో మాత్రం అతిగతి లేదని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ విషయంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పుట్ట మల్లేష్ గుంటి మధుసూదన్, ఇస్తరి, అరె రాములు, జుకంటి ఉప్పలయ్య, భోగ సంతోష్, కందుల శ్రీకాంత్, పత్తి వెంకటేష్, దయ్యాల సంపత్,గిరిరాజు వెంకన్న, పసుపునూరి వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కండి

గ్రామస్థాయిలో సిపిఐని బలోపేతం చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి




**ప్రజాపక్షం/చిగురుమామిడి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటిపోయినప్పటికీ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదని, ప్రజా సమస్యలపై ప్రజలను చైతన్య పరుస్తూ ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. గురువారం చిగురుమామిడి మండల కేంద్రంలోని సిపిఐ మండల కార్యాలయం ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్‌లో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం సహాయ కార్యదర్శి అందె చిన్న స్వామి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిజెపి ప్రభావం రోజురోజుకు తగ్గిపోతుందని అందుకు నిదర్శనమే ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సొంతంగా బిజెపి అధికారంలోకి రాకపోవడం అని, ఎన్డీఏ కూటమి పక్షాల మద్దతుతో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు న్యాయం జరగడం లేదని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కుటుంబ పాలన జరిగిందన్నారు. అన్ని సంక్షేమ పథకాల్లో అవినీతి అక్రమాలు జరిగాయని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడం లాంటి అనేక వైఫల్యాలను దృష్టిలో పెట్టుకుని శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మి గెలిపించారని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచి పోయిందని, అయినప్పటికీ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు పరచడం లేదని, అన్ని ప్రభుత్వ రంగ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ప్రామాణికం అని చెప్పుతూనే ఇప్పటికీ ప్రజలకు రేషన్ కార్డులు జారీ చేయలేదన్నారు. ప్రతి మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి ఇంకా అమలు చేయడం లేదని, ఉచిత కరెంటు అందరికీ ఇవ్వడం లేదని, రైతుల భూ సమస్యలు పరిష్కరించడం లేదని, రైతు రుణమాఫీ చేస్తామని కాలం గడుపుతున్నారే తప్ప అమలు పరచడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాలకు సిద్ధం కాక తప్పదని హెచ్చరించారు. మండలంలో సిపిఐ బలోపేతం కోసం నా యకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా గ్రామాల్లో తిరిగి పనిచేయాలని, పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం అధికారుల వద్దకు తీసుకెళ్లాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికంగా సర్పంచులను, ఎంపిటిసిలను, జడ్పిటిసి స్థానాలను కైవసం చేసుకునేందుకు ము మ్మరంగా పనిచేయాలని సిపిఐ శ్రేణులకు మర్రి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల నిర్మాణ బాధ్యులు అందె స్వామి, కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, మం డల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శి అందె చిన్న స్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్య, మాజీ మండల కార్యదర్శి తేరాల సత్యనారాయణ, మహి ళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు రాకం అం జవ్వ, గ్రామ శాఖ కార్యదర్శులు ఎండి ఉస్మాన్ పాషా, గందె కొమురయ్య, కాత మల్లయ్య, అనుమోజు జనార్దన్, అందె సంపత్, నాయకులు బసం తం, అంజయ్య, రవి, తిరు పతి, సంపత్, వెంకట్, వీరయ్య పాల్గొన్నారు.

## డ్రగ్స్ మహమ్మారి నుండి యువతను దేశాన్ని కాపాడుకుందాం

ఎఐపిఎస్ఒ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్




**ప్రజాపక్షం/నల్లగొండ:** డ్రగ్స్ బారిన పడి విద్యార్థి యువత విలువైన జీవితాలు కోలుపోతున్నారని డ్రగ్స్ మహమ్మారి నుండి యువతను దేశాన్ని కాపాడుకుందామని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్ఓ)రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె వి ఎల్ పిలుపునిచ్చారు. ఎఐపిఎస్ఓ జిల్లా కమిటీ సమావేశం స్థానిక టిఎన్‌జిఓఎస్ భవనంలో గురువారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రయెల్ ఏకపక్షంగా చేస్తున్న దాడులతో ఆ దేశ భవిష్యత్తు నేలమట్టం అయిందనిఆవేదన వ్యక్తం చేశారు.పాలస్తీనాపై ఇజ్రయెల్ చేస్తున్న దాడులను అన్ని దేశాలు ఖండించి అన్ని వర్గాల ప్రజలు పాలస్తీనాకు మద్దతు నిలబలాని కోరారు.ఈ దాడుల వలన ప్రజలు క్షతగాత్రులై చనిపోవడం జరిగిందని వెంటనే ఐక్యరాజ్య సమితి దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర భారతదేశంలో అలీన విధానం అమలు కావడంలేదని దీని మూలాన యుద్ధోన్మాదులు, మతోన్మాదం పెచ్చరిల్లి పోతుందని పేర్కొన్నారు. దేశంలో ఉన్న మేధావులు శాంతి ఉద్యమకారులు యుద్ధోన్మాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరా డాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఆగస్టు 16,17,18 తేదీలలో దేశ రాజధాని ఢిల్లీలోఎఐపిఎస్ఓ జాతీయ సమితి సమావేశాలు మూడు రోజులు పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ శాంతి అంటేనే పోరా టం నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం, శాంతి కొరకు ఎఐపిఎస్ఓ జిల్లాలో వివిధ రూపాలలో కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య మాట్లాడుతూ నేటితరం విద్యార్థి, యువత డ్రగ్స్, బెట్టింగ్,ఆన్లైన్ గేమ్‌లకు అలవాటు పడి అందులో మోసపోయి ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పై ప్రజలను చైతన్యం చేయడం కోసం అవగాహన కార్యక్రమం చేపట్టబోతున్నామని అందులో భాగంగా ఈ నెల చివరి వారంలో జిల్లాలోని 4 రెవిన్యూ డివిజన్ కేంద్రాలలో అవగాహన సద స్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి జిల్లా అధ్యక్షులు కట్ట వెంకటరెడ్డి,ప్రధాన కార్యదర్శి అనంతుల శంకరయ్య అధ్యక్షత వహి ంచగా గుర్రం వెంకటరెడ్డి కోమటిరెడ్డి ప్రద్యుమ్న రెడ్డి,శ్యామల నాగసేన రెడ్డి,బుక్క ఈశ్వరయ్య పసల శౌరయ్య ఎల్.వి యాదవ్ సత్యనారాయణ కస్తాల వెంకన్న,బ్రహ్మాచారి,పి వెంకట్రావ్ మోత్కూర్ శ్రీనివాస్ శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షులుగా పసల శౌరయ్య, కార్యదర్శి గా బుక్క ఈశ్వరయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన బెల్లంకొండ విజయలక్ష్మి ,వైస్ చైర్మన్‌గా ఎన్నికైన తాళ్ల సురేష్‌రెడ్డిని సిపిఐ ఆధ్వర్యంలో గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో శాలువా,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు మాట్లాడుతూ నేరేడుచర్ల,పాలకవీడు పరిసర ప్రాంతాలలోని రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని,విత్తనాలు అందుబాటులో ఉంచాలని,మార్కెట్ ద్వారా రైతులు పండించిన పంటలు నేరుగా కొనుగోలు చేసి దళారీ వ్యవస్థను రూపుమాపే విధంగా కృషి చేయాలన్నారు.గతంలో నిర్వహించిన మాదిరిగా మార్కెట్ యార్డులో పశువుల,గొర్రెల,మేకల సంతను నిర్వహించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి,వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం,మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మీ , ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను,ఏఐటియూసి మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న,మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, తిప్పన రామ్‌రెడ్డి, గోరుగంతం శ్రీనివాస్,యరమాద శేఖర్,మంగమ్మ పాల్గొన్నారు.

# విద్యార్థులకు విలువలతో కూడిన విద్య

కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేసి విద్యార్థులకు సకల సదుపాయాలు అందించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాలల ఆవరణలో చింత, ఉసిరి, వెలగ, కరివేపాకు, మునగ వంటి మొక్కలు నాటించాలన్నారు. 9వ తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన పేర్కొన్నారు. 9వ తరగతి విద్యార్థి యూనిఫామ్ ధరించకపోవడంతో యూనిఫామ్ ఎందుకు వేసుకోలేదని కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు తన పుట్టినరోజని శివాజీ అనే విద్యార్థి తెలుపగా విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ టివిని పరిశీలించారు. డిజిటల్ టివి ద్వారా విద్యార్థులు పాఠాలు వినేందుకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని 10 పాఠశాలలో హెచ్‌డిఎఫ్‌సి సిఎస్ఆర్ నిధులతో 10 టివిలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటి ద్వారా విద్యాబోధన జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన, నాణ్యమైన విద్యా బోధన చేయాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో మరమ్మతు పనులను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపట్టిన మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభించి మూడు నెలలైనా ఎందుకు పూర్తి చేయలేకపోయారని, తక్షణమే పూర్తి చేయువిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని, ఈ వారంలో మూడు రోజులు కోడిగుడ్లు అందించాలని ఆయన సూచించారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, మున్సిపల్ చట్టం ప్రకారం పరిశుభ్ర చేపించు బాధ్యత మున్సిపాలిటీదేనని, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి ఆవరణలో వ్యర్థాలను, పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్ర చేయాలని కమిషనర్ ను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి



**ప్రజాపక్షం / నర్సంపేట :** పెండింగ్ స్కాలర్ షిప్స్ వెంటనే విడుదల చేయాలని, సైనిక్ స్కూల్‌ను వరంగల్ జిల్లాలో ఏర్పాటుచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు చుక్క ప్రశాంత్, ఏబివిఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్ రూ.700 కోట్లు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ రాకపోవడం వల్ల విద్యార్థులు సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వలేకపోవడం వల్ల విద్యార్థులు విద్య దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాలలో, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలతోపాటు సొంత భవనాలు నిర్మించి విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించే విధంగా చూడాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లాకు సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్న విషయాన్ని విద్యార్థి సంగబూల నుండి స్వాగతిస్తున్నామన్నారు.

## పోతన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** రెండు నెలల్లో పోతన స్మారక సమాధి వద్ద పర్యాటక శాఖ నిధులు నుంచి చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బమ్మెర గ్రామంలోని పోతన స్మారక సమాధి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోతన స్మారక సమాధి వద్ద రూ.10కోట్లకు పైగా నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా 25 ఫీట్లు గల ఎత్తులో పోతన కాంస్య విగ్రహం నెలరోజులలో ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పాలకుర్తి, బమ్మెర, వల్మిడి గ్రామాలను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేపడుతానన్నారు. అనంతరం పోతన ఆడిటోరియం ప్రాంగణంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మొక్కలను నాటారు. ఈ సమావేశంలో ఎస్ఈ నాగేందర్‌రావు, ప్రొఫెసర్ పాండురంగారావు, ఆర్డీవో డీఎస్ వెంకన్న, ఏసీపీ నర్సయ్య, ఈఈ దామోదర్‌రావు, హుస్సేన్, ఆర్‌అండ్‌బీ డీఈ జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు పూర్తిగా అంతం చేయాలి

సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలో గంజాయి, ఇతరత్రా నార్కోటిక్ మత్తు పదార్థాలను పూర్తిగా అంతం చేసేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల బారిన పడకుండ వాటిని ఉపయోగించటం, రవాణ, క్రయ విక్రయాలు, పూర్తిగా నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినటు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డ్రగ్స్ నివారణకు సంబంధించిన విషయంపై వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి ప్రతి ఒక్క విద్యార్థి ఆ పోటీల్లో పాల్గొని అందులో విజేతలుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు నగదుబహుమతి అందచేయాలన్నారు. అలాగే ప్రతి తరగతి వారిగా యాంటి డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా బడికి రాని, బడి మానేసిన పిల్లల వివరాలను సేకరించి డ్రగ్ బారిన పడకుండ పిల్లలు, వారి తల్లి దండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని డిఈఓకు సూచించారు. జిల్లాలో ఇదివరకు డ్రగ్ రవాణ, క్రయ విక్రయల జరిగిన ప్రాంతాలను హాట్ స్పాట్‌గా గుర్తించి తరుచు తనిఖీ చేయాలన్నారు. రైతులు గంజాయి చెట్లను పెంచినట్లయితే కఠినశిక్షలకు గురవుతారని రైతులకు తెలుపాలని డిఎకు తెలిపారు. జిల్లాలో బిహార్, యుపి,ఇతరరాష్ట్రాల నుండి రోజు వారి లేబర్ పనులు, డ్రగ్స్ రవాణ, వినియోగం జరుగకుండ వారిపై నిఘా పెట్టాలన్నారు. లేబర్ డిపార్టుమెంట్ నుండి లేబర్ విక్రయించకుండ ,రవాణ చేయకుండ సమావేశాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో డ్రగ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు.దీనికి సంబంధించిన స్థలాన్ని అన్వేషించాలని ఆర్డీఓకు సూచించారు. డ్రగ్స్‌కు అడిక్ట్‌కు గురయిన వారిని చిన్న. పెద్ద ఏవరైన దీని నుండి బయటకు వచ్చి మాములు మనిషి అయ్యేలా మార్పు తీసుకరావటం ముఖ్య ఉద్దేశమన్నారు జిల్లాలో కల్లు కంపోండు, మెడికల్ షాపుల్లో మత్తు పదార్థామైన ఆల్ప్రాజోలం, విక్రయిస్తున్నట్లు తెలుపుతూ ఎక్సైజ్, పోలీస్ అధికారులు తరుచుగా వాటిపై రైడ్స్ జరిపి ఎక్కడ ఏలాంటి విక్రయాలు జరుగకుండ చూసుకోవాలన్నారు. కెజివిపి,రెసిడెన్సియల్ స్కూల్, మోడల్ స్కూల్, మత్తు చాక్లెట్లు ఇతరత్రా పదార్థాల రూపంలో డ్రగ్స్ రవాణ జరిగితే వెంటనే ట్రోల్ ప్రి నెంబర్ 1446, 8712671111, లేదా 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈసమావేశంలో అడిషనల్ డిసిపి మల్లారెడ్డి, ఆర్డీఓలు సదానందం, బన్సిలాల్, రాంమూర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, జిల్లా ఆటవిశాఖ అధికారి శ్రీనివాస్, కృష్ణమూర్తి, వినయ సుష్మి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కుడా చైర్మన్



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** కుడా ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఇనుగాల వెంకట్రాంరెడ్డి గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర రహదారి అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, శాతావాహన పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డిలను కలిశారు. అనంతరం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

## శ్రావణపల్లి బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను కార్పొరేట్ కంపెనీలకు వేలం వేయకుండా తెలంగాణ నుండి శ్రావణపల్లి బ్లాక్ ను సింగరేణి సంస్థకే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనుల వేలం వేయడాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భూపాలపల్లి జీఎం కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలను ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, మాతంగి రామచందర్, గురిజెపల్లి సుధాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై దీక్షా శిబిరంలో కార్మికులకు దండాలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే గత ఐదు రోజులుగా సీఎం కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు ధర్నాలు నిర్వహించడం జరిగిందని, ఇప్పటికైనా ప్రభుత్వం పునరా లోచించి బొగ్గు బ్లాకుల వేలం వేయడాన్ని రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమాలో 5వ రోజు భాగంగా భూపాలపల్లి ఏరియా కేటీకే ఓసి 2, ఏరియా హాస్పిటల్ ఫిట్ కమిటీ నాయకులు సికిందర్ సింగ్, తాళ్ల పోశం, రాయ నర్స్, క్యాథరాజు సతీష్, కార్మికులు సుమారు 50 దీక్షలో పాల్గొన్నారు.

## మేడారం అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా చర్యలు

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** మేడారం అభివృ ద్ధికి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మేడారంలోని ఐటిడిఏ గెస్ట్‌హౌస్ సమావేశ మందిరంలో మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి, పారిశుధ్యం పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్‌జితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మేడారం గ్రామంలో శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలు, వాటి స్థితిగతులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సెలవు రోజుల్లో దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. ఆలయ పరిధిలో అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పారిశుధ్యాన్ని పకడ్బందీగా చేపట్టాలని అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ సమ్మక్క సారలమ్మ దేవాలయం ప్రాంగణం, క్యూలైన్‌లు మంచే పరిసరాలు పరిశీలించారు. చిలుకల గుట్ట, జంపన్నవాగు, మ్యూజియం, కొంగలమడుగు, రెడ్డిగూడెంలను కలెక్టర్ సందర్శించి రెడ్డి గూడెం వద్దనున్న 28 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కె సత్యపాల్‌రెడ్డి, మేడారం దేవాలయం ఈవో రాజేందర్, ఆర్‌అండ్‌బి, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దారు రవీందర్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు పూర్తి స్థాయి సహకారం

జిల్లా ఎస్పి సుధీర్ రాంనాథ్ కేకన్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** జర్నలిస్టులు పోలీసులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించగలమని జిల్లా ఎస్పి సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ లోని మీటింగ్ హాలులో డిఎస్పి తిరుపతి రావుతో కలిసి ఆయన జర్నలిస్టులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యంగా జిల్లాలోని లా అండ్ ఆర్డర్ సమస్యలపై, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, గుట్కా, గుడుంబా, బెల్లం లాంటి అక్రమ రవాణా అరికట్టడం, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్ లేకుండా వాహానాలు నడపడం, గంజాయి మత్తులో యువత, భూ దందాలు, ఆందోలనకు గురిచేసే రౌడీషీటర్లపై చర్యలు వంటి పలు అంశాలపై చర్చలు నిర్వహించారు. మీడియా సహాయసహకారంతో ప్రజలలో అవగాహన కల్పించి మార్పు తీసుకురావచ్చని ఎస్పీ అన్నారు. ప్రజలకు పోలీసులకు మధ్య మీడియా పని చేయాలని అన్నారు. పోలీసులకు మీడియా సలహాలు, సూచనలు అందిస్తూ ప్రజలకు బరోసా కల్పించాలని అన్నారు. త్వరలో మీడియా పోలీసుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించాలని ఎస్పీ కోరారు. ప్రజలు ఏ సమయంలోనైనా సమస్యలను వారి దృష్టికి తీసుకువెల్లి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

# నియోజకవర్గ అభివృద్ధే నా ప్రధాన ఎజెండా

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** నియోజకవర్గ అభివృద్ధే నా ప్రధాన అజెండా అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ.. గత పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం అవినీతి పెరిగిందన్నారు. 2014కు ముందు వారి ఆస్తులు ఎంత.. 2024 తరువాత ఎంతో ప్రజల ముందు చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నాయకత్వం మీద నమ్మకం లేకనే రాజకీయ వలసలు పెరిగాయన్నారు. రాజకీయ వలసలు మీరు చేస్తే సంసారం.. వేరేవారు చేస్తే వ్యభిచారమా... అని ప్రశ్నించారు. డివిజన్‌గా ఘన్‌పూర్ ఏర్పడినప్పటికీ సరిపోను కార్యాలయాలు లేవని, 15 డివిజనల్, సబ్ డివిజనల్ సమీకృత కార్యాలయాల ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ గ్రామాల ప్రతీ ఎకరాకు సాగునీరు అందించే దిశగా పని చేస్తున్నామన్నారు. నియోకవర్గంలో నూతనంగా ఏర్పడ్డ చిల్పూరు, వేలేరు మండలాలకు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు మంత్రి సీతక్కకు వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. ఈ సంవత్సర కాలంలో రూ. 500 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. గతంలో ప్రతిపక్ష హోదా లేకుండా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకొని ఇప్పుడు సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, బూర్ల లతా శంకర్, బెలిదె వెంకన్న, పోగుల సారంగపాణి, రజాక్ యాదవ్, నాగరబోయిన శ్రీరాములు, సింగపురం వెంకటయ్య, నీరటి ప్రభాకర్, తోట సత్యం, గట్టు రమేశ్‌గౌడ్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## 18న కొరివిలో జరిగే సిపిఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారధి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఈనెల 18న కొరవిలో నిర్వహించబోయే జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారధి పిలుపునిచ్చారు. గురువారం నెల్లికుదురు మండల కేంద్రంలో బైసా స్వామి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావవేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సిపిఐ బలోపేతానికి నెల్లికుదురు మండలంలోని కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. రాభోతున్న గ్రామపంచాయతీ, ఎంపిటిసి ఎన్నికల్లో ప్రాతినిధ్యం కొరకు కార్యకర్తలు ప్రజల మధ్యన ఉండి ప్రజా సమస్యల కొరకు ఉద్యమించాలన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నెల్లికుదురు మండలం అభివృద్ధికి నోచుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో నెల్లికుదురు అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కొరివిలో జరిగే కౌన్సిల్ సమావేశానికి నెల్లికుదురు మండల కేంద్రం నుండి సిపిఐ శ్రేణులు బారీఎత్తున కదలిరావాలని పిలుపునిచ్చారు. కొరవిలో జరిగే సమావేశానికి సిపిఐ రాష్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెల్లపల్లి శ్రీనివాస రావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని అన్నారు. సిపిఐ మహబూబాబాద్ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారధి రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి వరిపల్లి వెంకన్న, మండల సహయ కార్యదర్శి బైసా స్వా మి, తూటి వెంకట్ రెడ్డి, చిర్ర సత్యనారాయణ, చిర్ర వెంకన్న, కొట్టే లక్ష్మి, యాకయ్య, చీకటి సోమయ్య, గారె అనిల్, గంట నాగయ్య, పోరండ్ల నర్స య్య, ఋసిపట్ల జ్యోతి, ఎస్కే దస్తగిరి, ఉప్పరబోయిన లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

# నింధితుడిని కఠినంగా శిక్షించాలి



**ప్రజాపక్షం / నర్సంపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని 16 చింతల్ తండాలో భార్యభర్తలను హత్య చేసి, పిల్లలపై హత్యాయత్నం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించి, ఆకుటుంబాన్ని న్యాయం చేయాలని మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, తండావాసులు డిమాండ్‌చేశారు. నర్సంపేట పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట సుమారు రెండు గంటల పాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు వాహనాలను దారిమళ్లించడంతో రాస్తారోకో చేస్తున్నవారు వరంగల్ రోడ్డుకు చేరుకొని రాస్తారోకోకు అక్కడ ప్రారంభించారు. దీంతో వాహనాలు భారీ ఎత్తున నిలిచిపోయాయి. నింధితుడిని ప్రజాక్షేత్రంలో ఉరితీయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, వరంగల్ కమీషనర్ , మంత్రి వచ్చి సరైన హామీ ఇస్తేనే ధర్నా, రాస్తారోకో విరమిస్తామని భీష్మించుకోని కూర్చున్నారు. ధర్నా , రాస్తారోకో మృతుడికి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకోని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించడంతో పోలీసులు ఆ బాటిల్‌ను తీసుకోని ఆవ్యక్తికి నచ్చచెప్పారు. రాస్తారోకో ఘటనకు నర్సంపేట ఏసిపి కిరణ్ కుమార్, నర్సంపేట టౌన్, రూరల్, నెక్కొండ సిఐలు, ఎస్సైలు ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా భారీ బందోబస్తును నిర్వహించారు. ధర్నా, రాస్తారోకో వద్ద నర్సంపేట మాజీ ఎంఎల్‌ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి చేరుకోని ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. మృతుల కుటుంబానికి న్యాయం చేయాలని, బాధితుడికి కఠినంగా శిక్షించాలన్నారు. బెయిల్‌పై వచ్చి నింధితుడిలో ఆ కుటుంబాని ఆపద ఉంటుందని ప్రభుత్వమే వారికి రక్షణ కల్పించాలని, కుటుంబానికి పెద్దదిక్కును కొల్పోయి ఆపిల్లలకు అన్ని విధాలుగా ఆదుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మృతుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగంకల్పించాలని డిమాండ్ చేశారు.

# పోజిషన్లో ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయాలి

స్థానిక తహసీల్దార్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా



**ప్రజాపక్షం/ సదాశివపేట :** పోజిషన్లో ఉన్న వారికి పట్టాలు మంజూరు చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఆరు సంవత్సరాల నుండి సదాశివపేట పట్టణంలోని సర్వే నెంబర్ 260 సిద్దాపూర్ కాలనీలో పురిపాకలు వేసుకుని అక్కడే నివాసము ఉంటున్న అర్హులైన నిరుపేదలకు పోజిషన్ పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. అనంతరం తహసీల్దార్ సరస్వతికి వినతి పత్రం సమర్పించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వినోద మాట్లాడుతూ పట్టణంలోనే నిరుపేదలు అద్దెలు చెల్లించలేక గత ఆరు ఏళ్ల క్రితం పురిపాకలు వేసుకొని ఏలాంటి మౌళిక సదుపాయాలు లేకున్నా చలికి వానకు ఎండకు అక్కడే ఉంటూ కాలం వెళ్లదిస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హాయాంలో పట్టాలు మంజూరి చేయాలని అనేక దఫాలుగా అప్పటి ప్రభుత్వానికి విన్నవించినప్పటికి ఫలితం లేకుండా పోయిందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది అధికారం చేపట్టి దాదాపు 6 నెలలు పూర్తి అవుతుంది. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల గురించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని పట్టాలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని సిపిఐ పార్టీ వారికి విజ్ఞప్తి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సభ్యులు ఎం తాజుద్దీన్, షఫీ రహిమాన్ ,ముంగి రమేష్, శంకరప్ప దుర్గయ్య, మాబూబ్, అలి, ఉమేష్, పాండు ముస్తఫా, అనుసూజా, బుజ్జమ్మ, లక్ష్మి తస్లీమ్ రాధా జ్యోతి , శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయంలో అగ్నిప్రమాదం

పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన అధికారులు




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలప ల్లి ప్రతినిధి :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బు ధవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో బీరువాలో భద్రపరిచిన విలువైన సుమారు (15 ఫైల్స్) భూసేకరణ పత్రాలు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి జరిగిన ఘటనపై గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు. దగ్ధమైన పత్రాల్లో కాలేశ్వరం మేడిగడ్డ, సింగరేణి, కేటీపీపీలో భూములకు చెల్లించే విలువైన ఫైల్స్ వు న్నాయి. అధికారులు మాత్రం సాఫ్ట్ కాఫీలు సిష్టం, ఆన్ లైన్ లో భద్రంగా ఉన్నట్లు తెలిపారు. అయితే ఈ ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా.. లేదా ఎవరైనా కావాలని చేశారా అనే కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను వివరించాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనాభా విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ఆశలు, ఎఎన్ఎంలు కుటుంబ నియంత్రణ ఆవశ్యకతపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రిజ్బాన్ బాష షేక్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పద్దతులను స్వచ్చంగా పాటించి జనాభా పెరగకుండా చూడాలన్నారు. కుటుంబ నియంత్రణలో జనగామ జిల్లా మొదటి స్థానంలో ఉండాలని, అందుకు క్షేత్ర స్థాయిలో ఆశాలు, ఎఎన్ఎంలు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాం తాలైన ఎస్సీ, ఎస్టీ తండాల్లో కుటుంబ నియంత్రణపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి గర్భిణీకి న్యూట్రిషన్ ఫుడ్ మీద అవగాహన కల్పించాలని, మొ దటి కాన్పుకి రెండో కాన్పుకి మధ్య ఉండాల్సి గ్యాప్‌పై వివరించాలన్నారు. కుటుంబ నియంత్రణకు సంబంధించి అపేషన్ కేవల్ స్త్రీలకే కాకుండా పురుషులు కూడా ముందుకు రావాలన్నారు. మారుమూల గ్రామాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం కుటుంబ నియంత్రణపై విశేష సేవలందించిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, సర్జన్ డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీదేవి, రవి రాథోడ్, డాక్టర్ విష్ణు, సామాజిక ఆదర్శ అధికారి ఎంఎం రహమాన్, నీలిమ, సురేష్, వెంకన్నను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్‌రాజ్, జిల్లా వ్యైధికారి డాక్టర్ సుగుణాకర్‌రాజు, కుటుంబ నియంత్రణ పోత్రా అధికారి డాక్టర్ దేవి, డాక్టర్ మహేందఋ, రవిందర్‌గౌడ్, డాక్టర్ కరుణాకర్‌రాజు, డిప్యూటి డిఎంహెచ్‌ఓ సుధీర్, డాక్టర్ అశోక్‌కుమార్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి రక్షణకు కేంద్రంపై ఐక్యపోరాటాలు

ఎఐటియుసి నాయకుల పిలుపు




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిని ప్రైవేటీకరణ నుంచి కాపాడుకునేందుకు కార్మికవర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు నాలుగో రోజుకు చేరుకున్న సందర్భంగా దీక్షల్లో కూర్చున్న ఓసిపి 5, సివిల్ డిపార్ట్మెంట్, సిఎస్పి, ఎస్అండ్ పిసి, జి.ఎం.కార్యాలయంకు చెందిన కార్మికులు, ఉద్యోగులు దండలు వేసి దీక్షలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ అని, 130 సంవత్సరాల చరిత్ర కలిగిన, అనుభవం ఉన్న సింగరేణి బొగ్గుబ్లాకులను కేంద్రప్రభుత్వం ప్రైవేటుకు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా తెలంగాణ ప్రజలకు, కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సింగరేణికి కేంద్రప్రభుత్వం బొగ్గు గనులను ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేటు వారికి ఇవ్వడం వల్ల భవిష్యత్తులో సింగరేణి కాలరీస్ కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. సింగరేణికి బొగ్గు గనులను ఇవ్వాలని వారంరోజులుగా ఎఐటియుసితో పాటు అన్ని కార్మికసంఘాలు ఆందోళన లు చేస్తున్నా ఈప్రాంత ప్రజాప్రతినిధులు పట్టించుకోరా అని ప్రశ్నించారు. జూలై 12తో ముగుస్తున్న రిలే నిరాహారదీక్షల అనంతరం వేలాది కార్మికులతో జూలై 17న హైదరాబాద్‌లో బొగ్గు గనుల వేలం జరిగే కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన, ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎగౌస్, మద్దెల దినేష్, రేణికుంట్ల ప్రీతం, తొడుపునూరి రమేష్ కుమార్ పాల్గొనగా, దీక్షల్లో గండి ప్రసాద్, బోగ సతీష్‌బాబు, ఎస్‌కె సోహెల్, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి, ఏలేశ్వరం సత్యనారాయణ, చీకటి అంజయ్య, భక్తి శ్రీనివాస్, మడ్డి కిరణ్, పెర్క రమేష్, రాజు, బండి మల్లేశ్, బుడిమె సమ్మయ్య, జానిమియా, తాని రాజబాబు, అటికేటి రాజు, ఆకునూరి శంకరయ్య, జెరిపోతుల దేవయ్య, వొన్నాల లక్ష్మి నారాయణ, దాసరి శ్రీనివాస్, దర్శిరెడ్డి వెంక స్వామి, బోయినస్వామి, కే.శ్రీనివాస్, వేణుగోపాల్, గులాం రసూల్‌తో పాటు 67 మంది కార్మికులు దీక్షల్లో కూర్చున్నారు. యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య దీక్షల శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలుపుతూ సందేశాన్ని ఇచ్చారు. కళాకారులు కొప్పుల రాజనర్సు, పానుగంటి రవి, చీకటి అంజయ్య, గండి ప్రసాద్ గేయాలు ఆలపించి దీక్షల్లో కూర్చున్న వారిని ఉత్సాహపరిచారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

డిఆర్‌డిఒ విజయలక్ష్మి



**ప్రజాపక్షం/దిల్వార్పూర్ :** మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నిర్మల్ జల్లా డిఆర్‌డిఓ విజయలక్ష్మి సూచించారు. గురువారం దిలావర్పూర్ మండలంలోని సిర్గాపూర్,న్యూ లోలం,దిలావర్పూర్ గ్రామ పంచాయతీలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా డిఆర్డిఓ విజయలక్ష్మి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దివ్య రెడ్డి పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజ సేవ అతి ముఖ్యం

అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** సమాజ సేవలో మన వంతు సేవ అనే దృక్పథంతో ప్రతిఒక్కరూ సమాజ సేవ చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం దుబ్బలో ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సంస్థ వ్యవస్థాకులు మద్దుకూరి సాయిబాబు తనకు ఆదర్శప్రాయుడన్నారు. 'కోవెల ఆశ్రమ' ఏర్పాటు నిర్మాణానికి తన సహాయ సహకారముంటాయన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు చిట్టిమల్ల హరిప్రసాద్, ప్రధానకార్యదర్శి డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, సభ్యులు, సుమీలాశర్మ, సుజాత, సూర్యరాజ్, చందా జగన్మోహన్, దారం గంగాధర్, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసు దాడికి నిరసనగా విధులు బహిష్కరించిన న్యాయవాదులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** న్యాయవాదిపై పోలీసు దాడికి నిరసనగా విధులను బహిష్కరించామని బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్‌గౌడ్ అన్నారు. గురువారం నిరసన కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. సిద్ధిపేట బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది రవికుమార్‌పై స్థానిక అసిస్టెంట్ క్లబ్ ఇన్‌స్పెక్టర్ ఉమారెడ్డి భౌతికదాడి చేయడం పట్ల రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోఇసయేషన్ పిలుపు మేరకు జిల్లా న్యాయవాదం నేను విధులను బహిష్కరించి జిల్లా కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేందర్‌రెడ్డి, రాజు, వసంతరావు, దీపక్, మానిక్‌రాజ్, విఘ్నేష్, గణపతి, మాధవరావు, గంగాధర్, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, కవితారెడ్డి, నారాయణ, జైపాల్ పాల్గొన్నారు.




**మంచిర్యాల క్రైం :** సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై పోలీస్ అధికారి దాడిని నిరసిస్తూ గురువారం కోర్టు విధులు బహిష్కరించి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ న్యాయవాదిపై ఎఎస్ఐ అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం అమానుషం అని, న్యాయవాది రవికుమార్‌పై చేసిన దాడి చేసిన పోలీస్ అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ అడ్వకేట్స్ పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వద్దు

**ప్రజాపక్షం/బోథ్ :** పాఠశాలల్లో విద్యా ర్థులకు అందించే మధ్యాహ్న భోజనం పట్ల నిర్లక్ష్యం వద్దని ఆర్‌జెడి సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సొనాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో పరిసరాలను పరిశీలించి చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూ చించారు. ఆరవ తరగతి పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి డిజిటల్ ప్యానెల్ బోర్డును వినియోగించే విధానాన్ని వివరించారు. పాఠశాలలో విద్యార్థినులకు మూత్రశాలలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య ఆర్‌జెడికి వివరించారు. నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు.



## పర్యావరణంపై అవగాహన ఉండాలి

డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్

**ప్రజాపక్షం/కాసిపేట :** ప్రతి ఒక్కరు పర్యావరణం, పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి.ప్రవీణ్ నాయక్ కోరారు. గురువారం కాసిపేట మండలంలోని పర్యటక కేంద్రమైన సల్పల వాగు ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులు తిని పడేసిన ప్లాస్టిక్ ప్లేట్లను అటవీ ప్రాంతంలో సంచరించే వన్యప్రాణులు తిని జీర్ణ సంబంధ వ్యాధులకు గురవున్నాయని, వాటి ప్రాణాలకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. వర్షాకాలంలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, అందుకోసం పర్యాటకులు సల్పల వాగు ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం, మద్యం సీసాలు పగలగొట్టడం లాంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సల్పల వాగు ప్రాంతాన్ని పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అయన తెలిపారు.

## చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎసిపి రవికుమార్

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ అన్నారు. గురువారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిమడుగు గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంని నిర్వహిస్తున్నామన్నారు. యువత మద్యం, గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని, సైబర్ నేరగాళ్లకు వలలో పడి మోసపోవద్దని, అనవసర ఫోన్ కాల్స్, మెసేజ్, వాట్సాప్ కాల్స్ కు స్పందించవద్దని సూచించారు. క్రార్యక్రమంలో మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్ఐ రాజశేఖర్, బెల్లంపల్లి, తాళ్ళగురజాల ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, స్పెషల్ ఆర్మడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సేకరణపై ప్రత్యేక దృష్టి

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి, ఎన్టిపిసి క్రింద చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సింగరేణి ఆర్జి1, ఆర్జి 2, ఆర్జి 3, ఎన్టిపిసి పరిధిలో పెండింగ్ భూ సేకరణపై అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ భూసేకరణ, ఆర్అండ్ఆర్ స్థితిగతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో మంథని ఆర్డీఓ హనుమా నాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్, సింగరేణి, ఎన్టీపీసీ, రెవెన్యూ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు

ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పాఠశాల విద్యపై కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లతో కలిసి సమీక్షించారు. సమీక్షించారు. ఎఫ్ఎల్ఎన్. కార్యక్రమం అమలు, కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలల మానిటరింగ్, విద్యా బోధన విధానాలు, ప్రస్తుత విద్యా సంవత్సరం రూపొందించుకున్న లక్ష్యాలు మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డిఇఒ డి.మాధవి, జిల్లా అకడమిక్ అధికారి పీఎం షేక్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్.

**ప్రజాపక్షం/ధర్మపురి :** మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీ, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌లతో కలిసి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం మానవాళీ మనుగడకు వన మహోత్సవాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 46 లక్షల మొక్కలు నాటాలని సంకల్పించడం జరిగిందన్నారు. ప్రజలు ఏ మొక్కలు కావాలన్నా వారు కోరిన ప్రకారం పూలు, పండ్ల మొక్కలతో పాటు ఇతర మొక్కలను అందించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు.

### నృసింహుడిని దర్శించుకున్న ఎంపి, ఎమ్మెల్యేలు

ధర్మపురి శ్రీలక్ష్మి నృసింహస్వామి దేవస్థానంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ, విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌లు గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. ఎంపిగా గెలుపొంది మొదటిసారిగా ధర్మపురి లక్ష్మి నృసింహుడిని దర్శించుకోవడానికి వచ్చిన సందర్భంగా దేవస్థానం పక్షాన సాంప్రదాయ రీతుల్లో స్వాగతం పలికారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డిసిఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.






### ధర్మపురిని సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దాలి

సమస్యలు లేని పట్టణంగా ధర్మపురిని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన నిధులు కేటాయిస్తాయని విప్ లక్ష్మ ణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ధర్మపురిలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. గోదావరిలో మురికినీరు కలవ కుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహలక్ష్మి పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న పేదలకు జీరో బిల్లు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయని, వాటిని సత్వరమే సవరించాలని ఆదేశించారు. కరెంట్ కోతలు లేకుండా చూసుకోవాలన్నారు. రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలన్నారు. దేవాలయానికి సంబంధించిన పలు అంశాలపై అధికారుల తో చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, తహసీల్దార్ కృష్ణ చైతన్య, డిపివో దేవరాజ్, యంపిడివో రవీందర్ తదితరులు ఉన్నారు.

## గ్రామీణ పాఠశాలల అభివృద్ధి లక్ష్యం

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గ్రామీణ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు తెలిపారు. గురువారం సుల్తానాబాద్ మున్సిపాలిటీలోని పూసాల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మాణం చేపట్టిన పాఠశాల నాలుగు గదులను, పాత భవన మరమ్మత్తు పనులను విజయరమణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచే విషయంలో కట్టుబడి ఉన్నామన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపడతామని ఐదు సంవత్సరాల కాలంలో పెద్దపల్లినీ అభివృద్ధి పరుస్తూ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసి సుల్తానాబాద్‌ను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమత కృష్ణ, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మినుపాల ప్రకాష్ రావు, సాయిరి మహేందర్, అంతటి అన్నయ్యగౌడ్, దన్ నాయక్ దామోదర్ రావు, చిలుక సతీష్, అబ్బయ్య గౌడ్, ముత్యాల రవీందర్, అమీర్ శెట్టి రాజలింగం, తిరుపతి, సిద్ధ తిరుపతి, కుమార్ కిషోర్, గాదాసు రవీందర్, దున్నపోతుల రాజయ్య, మహ్మద్ రఫీక్ తదిదరులు పాల్గొన్నారు.





### చెరువుల మరమ్మత్తులు, రోడ్ల నిర్మాణానికి కృషి

రైతులకు సక్రమంగా నీరు అందించేందుకు చెరువు మత్తడి మరమ్మత్తులకు కృషిచేస్తామని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలోని చెరువును రైతుల కోరిక మేరకు రైతులతో, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు మాట్లాడుతూ గర్రెపల్లి చెరువు నుండి నీరు లీక్ అవుతోందని రైతులు సూచించిన దృష్ట్యా మైనర్ ఇరిగేషన్ చెరువు కట్టను అభివృద్ధి చేసి మత్తడి వద్ద నీరు వృధా పోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి, సిసి నిర్మాణం చేపడతామన్నారు సాంబయ్యపల్లి గొల్లపల్లి నుండి గర్రెపల్లి వరకు చెరువు కట్టను అభివృద్ధి చేసి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజలు రాకపోకలు సాగించే విధంగా దశలవారీగా పనులు చేపడతామని సూచించారు. రాకపోకలు సాగించే విధంగా కట్టను అభివృద్ధి పరిచి రైతులకు నీరును సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, కల్లేపల్లి జానీ, చిలుక సతీష్, పులి అనూష, ఇరిగేషన్ శాఖ అధికారులతో పాటు రైతులు పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణపై మాట్లాడుకుందాం : డిఎంహెచ్‌ఒ

**ప్రజాపక్షం/నస్పూర్ :** కుటుంబ నియంత్రణపై మాట్లాడుకుందామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.అనిత అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నస్పూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 21 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 100 పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉండేందుకు కుటుంబ సంక్షేమ కార్యక్రమాలలో భాగం పంచుకుందామని, ఇందులో భాగంగా జిల్లాలో కుటుంబ నియంత్రణపై వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు కార్యచరణ రూపొందించడం జరిగిందని, తాత్కాలిక పద్ధతులు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తాయని తెలిపారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమాలలో ఉత్తమ సేవలు అందించినందుకు డా.అరుణశ్రీ, ఎఎన్ఎం రాజేశ్వరి, సూపర్వైజర్ మార్త, ఆశా కార్యకర్త డి.కవితలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం కుటుంబ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు డా.నీరజ, డా.విజయపూర్ణిమ, డా.అరుణశ్రీ, డా.సమత, డా.ఫయాజ్, ఎస్‌ఒ వెంకటేశ్వర్లు, దామోదర్, శ్రీనివాస్, నాందేవ్, డిపిఒ ప్రశాంతి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి తరలిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠా అరెస్ట్




**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు అంతర్ రాష్ట్ర ముఠాను జగిత్యాల జిల్లా పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. గురువారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. పోలీసుల అదుపులో ఒడిస్సాకు చెందిన ఒకరు, ఏపీకి చెందిన మరొకరు, ధర్మపురికి చెందిన మొత్తం ముగ్గురు నిందితుల నుంచి ఆరున్నర కిలోల గంజాయి, 3సెల్ ఫోన్లు, రూ.3500 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, గంజాయి కొన్న, సేవించిన, రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి, డయల్ 100 కి సమాచారం అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. గంజాయి ముఠాని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన జగిత్యాల డిఎస్పీ రఘుచందర్, ధర్మపురి సిఐ ఏ.రామనర్సింహా రెడ్డి, ధర్మపురి, గొల్లపల్లి ఎస్ఐలు ఉదయ్ కుమార్ ధర్మపురి, చిర్ర సతీష్, పీసీలు బి.రమేష్‌నాయక్, బి.పూర్ణసాయి, ఎం.రమేష్, రామ స్వామి, అశోక్, ఎండి. సలీముద్దీన్, వెంకటయ్య, నవీన్, లను జిల్లా ఎస్పి అశోక్ కుమార్ అభినదించి రివార్డ్‌లు అందించారు. సమావేశంలో డిఎస్పి రఘు చందర్, సి.ఐ రామ్ నరసింహారెడ్డి రెడ్డి , ఎస్.ఐ లు ఉదయ్ కుమార్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు..

## సమన్వయంతో సకాలంలో రైల్వేలైన్ పనులు పూర్తి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సకాలంలో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. భూసేకరణ, రైల్వే లైన్ పనులు, ఇతర అంశాలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా జిల్లాలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఏడీ సర్వే శ్రీనివాస్, రైల్వే శాఖ అధికారులు మూర్తి, జనార్ధన్, ప్రసాద్, ట్రాన్స్ కో ఈఈ హనుమంతు, డీఏఓ భాస్కర్, ఆర్అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

### ప్రజాపాలన సేవా కేంద్రం పరిశీలన

జిల్లాలోని ముస్తాబాద్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ రాజేందర్, ఈడీఎం శ్రీనివాస్ ఉన్నారు.

### ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరణ

ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ఔత్సాహికులు తమ ఆవిష్కరణల వివరాలు ఆగస్టు 3వ తేదీ వరకు పంపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఐడిఓసి కార్యాలయం తన ఛాంబర్లో ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈప్రదర్శన జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉంటుందని తెలిపారు. వ్యవసాయరంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలు మొదలగునవి అంగీకరించబడతాయన్నారు. ఆవిష్కరణకు సంబంధించిన 6వాక్యాలు, 2నిమిషాల నిడివి గల వీడియో, ఆవిష్కరణకు చెందిన 4 ఫోటోలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నెంబర్, వయసు, ప్రస్తుత వృత్తి, గ్రామంపేరు, జిల్లా పేరు తదితర వివరాలను 9100678543 నంబర్‌కు వాట్సాప్ చేయాలని తెలిపారు. దరఖాస్తులు స్వీకరించడానికి చివరి తేదీ ఆగస్ట్ 3అని, అందుకున్న దరఖాస్తుల నుండి మొదటి షార్ట్ లిస్ట్ తరువాత 5ఆవిష్కరణలు ప్రదర్శనకు ఎంపిక చేయబడుతాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డిపిఆర్‌ఒ వి.శ్రీధర్, డిఆర్డిఓ శేషాద్రి, డిఈఓ. రమేష్‌కుమార్, ఈడియం శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.





ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ – రంగారెడ్డి
హైదరాబాద్ | శుక్రవారం | 12 జులై, 2024 | 9

## స్వచ్ఛమైన గాలికి మొక్కల పెంపకం అనివార్యం

వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** మొక్కల పెంపకంతో ప్రజలకు స్వచ్ఛమైన గాలి వస్తుందని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మల్లికార్జుననగర్ కాలనీపార్కులో వనమహోత్సవంలో మొక్కలు నాటారు. వనస్థలిపురం డివిజన్‌లో పార్కులు సుందరీకరణ చేస్తామన్నారు. జిహెచ్‌ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజియాసుల్తానా, ఏఈ ప్రజ్ఞ, కాలనీ వాసులు ప్రేమ్‌కుమార్, వెంకటేశ్వరరావు, రాజేందర్‌రెడ్డి, కోలన్ శ్రీనివాస్‌రావు, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి కృషి : సుజాత నాయక్



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. గురువారం డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కాలనీలో నిధులు కొరతతో నిలిచిన పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా సుజాతనాయక్ మాట్లాడుతూ కాలనీ వాసులకు అనుగుణంగా సిసి రోడ్డు పనులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ హేము నాయక్, కాలనీవాసులు శ్రీకాంత్‌రెడ్డి, గంధం శ్రీనివాస్, షాకీర్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం : ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ నగర్ కాలనీ న్యూ సైబర్ వ్యాలీ కాలనీలలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని వారి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కృష్ణనగర్ కాలనీ, న్యూ సైబర్ వ్యాలీ కాలనీల వాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని , కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ కాలనీ వాసులు నర్సింగరావు,వెంకటేష్ గౌడ్,వెంకట్ రెడ్డి, వీరభద్ర ,సూర్యనారాయణ, అశోక్ పాత్రో, ఫణిరాజు,రాజా చెలమకురి, కృష్ణారావు,మంగేష్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం కాజేసిన వారిపై క్రిమినల్ కేసు : భూనిర్వాసితులు



**ప్రజాపక్షం/కొత్తూరు:** నష్ట పరిహారం సొమ్మును కాజేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిద్ధాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామ రైతులు ఆందోళనకు దిగారు. పరిహారం సొమ్ము కాజేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డియాండ్ చేశారు. టిజి ఐఐసికి కేటాయించిన భూముల్లో పేదల ఇళ్ల స్థలాల కోసం 25ఎకరాల భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మండల రెవిన్యూ అధికారులు గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్తతో కుమ్మక్కై గ్రామ రైతులకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నా, అసైండ్ భూముల్లో సాగు చేస్తున్న రైతులకు కాకుండా ఇతరుల పేర్లు చేర్చి పరిహారం సొమ్ము కాజేసినట్లు గ్రామ రైతులు వివరించారు. ఒకసారి పారిశ్రామిక పార్కు.. మరోసారి ఎయిమ్స్..ఇంకోసారి ఐటిహబ్ అంటూ ప్రభుత్వాలు రైతులకు మోసం చేస్తూ సాగు చేస్తున్న భూములను లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూముల్లో ఏమి చేస్తారో కూడా అధికారులు ఎలాంటి సమాచారం తమకు ఇవ్వడం లేదని, పారిశ్రామిక అభివృద్ధి కోసం కేటాయించిన భూముల్లో 25ఎకరాలను పేదలకు ఇళ్ల స్థలాలు, సామాజిక అవసరాల నిమిత్తం కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## సిఆర్‌సిఎస్ ద్వారా చెల్లింపుల ప్రక్రియ వేగవంతం చేయాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేత



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ రిజిస్ట్రార్ కోఆపరేటివ్ సోసైటీ(సిఆర్‌సిఎస్) రిఫండ్ పోర్టల్ ద్వారా సహార వినియోగదారులకు చెల్లించాల్సిన చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి హైదరాబాద్, సికింద్రాబాద్ రిజియన్ల అధికారుల ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రిజియన్ మేనేజర్లు షేక్ సొందు సాహేబ్, సిహెచ్.శ్రీనివాస్, జోన్ అడ్వజర్ బి.సత్యనారాయణలు మాట్లాడారు. కార్యక్రమంలో సహార ఇండియా సెక్టార మేనేజర్లు శ్రీనివాస్,రామక్రిష్ణ బ్రాంచ్ మేనేజర్లు రవీందర్‌రావు, నాగరాజు, ప్రభాకర్, ఇలిటం భిక్షపతి, సుదర్శన్, రాములు, శ్యాం, సత్యం, రాజలింగచారి, ఆశోక్, నర్సింగ్‌రావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## యాచారం మండలంలో ఉపాధి పనులు బాగున్నాయి

వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధి పిడిలు

**ప్రజాపక్షం/యాచారం :** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు ఎంతగానో బాగున్నాయని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధి బృదం కితాబ్ నిచ్చారు. గురువారం మండల పరిధిలోని గడ్డమల్లాయగూడ గ్రామంలో రూరల్ డెవలఫ్‌మెంటు ప్రాజెక్ట్ అధికారులు, నేషనల్ ఇన్సూట్యూట్ రూరల్ డెవలఫ్‌మెంటు అధికారులు లకాన్‌సింగ్ కోర్సు డైరెక్టర్‌తో బాటు జమ్ముకాశ్మీర్, నాగాలాండ్, ఒరిస్సా, కేరళ, మహారాష్ట్ర, హిమచల్‌ప్రదేశ్ జిల్లాస్థాయి అధికారులు పర్యటించారు. కార్యక్రమంలో డిఆర్డిఒ ప్రాజెక్ట్ అధికారి సుభాషిణి, ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి, ఎపిడి సక్రియా, ఎంపిఓ శ్రీలత, ఎపిఒ లింగయ్య, ఇసి శివ, పంచాయతి కార్యదర్శి దీపిక తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడానికి సర్వం సిద్ధం చేయాలని జిల్లా డిఅర్‌డిఒ సుభాషిణి అన్నారు. గురవారం యాచారం మండల కేంద్రంలో ప్లాంటేషన్ చేసే ప్రాంతాలను సందర్శించారు. మొక్కలు జాగ్రత్తగా నాటాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి, ఎపిడి సక్రియా , ఇంజనీర్ శివ శంకర్‌రెడ్డి ఎపిఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# గీత కార్మికుల సంక్షేమం, రక్షణకు కృషి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** గీత కార్మికుల సంక్షేమం, తాటి చెట్టు ఎక్కే సమయంలో మరణాల బారిన పడకుండా 'గీత కార్మిక లైఫ్ సేవ్ కిట్'ను అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజక వర్గం, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, లష్కర్ గూడ గ్రామంలో కలెక్టర్ శశాంక, కల్లు గీత కార్మికులను, గీత సంఘాల నాయకులను,ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమీషనర్ టి.దశరథ్, ఆర్‌డిఒ అనంతరెడ్డి, టాడీ ట్యాపర్ కార్పొరేషన్ ఎండి ఉదయ్ ప్రకాష్‌లతో కలిసి గీత కార్మకుల వృత్తిని పరిశీలించారు. పరిశీలనలో భాగంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ కల్లు గీత కుటుంబాలు తమ కులవృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. గీత కార్మికులు కల్లు తీస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రమాదాల భారిన పడకుండా గీత కార్మికులకు అండగా నిలిచేందుకు బిసి వెల్ఫేర్ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మిక లైఫ్ సేవ్ కిట్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నదని తెలిపారు. గీత కార్మికుడు లైఫ్ సేవ్ కిట్ ధరించి సునాయసంగా చెట్టు ఎక్కడం ట్రయల్ రన్ గా ట్రైనర్స్ పర్యవేక్షనలో నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. పర్యవేక్షణలో చెట్టు ఎక్కిన గీత కార్మికుడిని లైఫ్ సేవ్ కిట్ ఉపయోగం గూర్చి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పర్యవేక్షణలో డిస్టిక్ ప్రోబూషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఉజ్వాలా రెడ్డి, సరూర్ నగర్ మండల తహసీల్దార్, ట్రైనర్ శేఖర్ బాబు, స్థానిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### వైద్యంపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ప్రజలకు అందించే వైద్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా జిల్లా కలెక్టర్ కె.శశాంక హెచ్చరించారు. గురువారం ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ శశాంక తనిఖీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు అందిస్తున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. సెంటర్ లోని డయాలసిస్ వార్డును పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రతి వార్డుకు తిరుగుతూ రోగులను పలకరిస్తూ డాక్టర్లు అందిస్తున్న సేవలు గురించి వివరాలు తెలుసుకున్నారు. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు కొనసాగాలని, సీజనల్ వ్యాధులు రానున్న నేపథ్యంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో సరిపడా మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సంబంధిత వైద్య అధికారులను ఆదేశించారు.

### అమ్మ ఆదర్శ పాఠశాలల తనిఖీ

ఇబ్రహీంపట్నం గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను కలెక్టర్ శశాంక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరాతీశారు. విద్యార్థులను బోధన, భోజనం, వసతులపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు పని చేయాలని సూచించారు. యూనిఫార్మ్, పుస్తకాలు అందజేత పూర్తయిందని, ఇంకా ఏవైనా వసతులు కావాలన్నా అందుకు సంబంధించిన బడ్జెట్‌ను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి అని, చదువుతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని తెలిపారు. చదువును కష్టంతో కాక ఇష్టంగా చదవాలన్నారు.

### ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

ఇబ్రహింపట్నం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలనలో వచ్చిన ధరఖాస్తులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎంపిడిఓ కార్యాలయంలో ధరఖాస్తుల ఆన్‌లైన్ డేటా విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకం కింద వచ్చే దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమాలలో జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్‌రావు, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత, ఎంపిడిఒ, స్కూల్ హెడ్ మాస్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటే విధానంపై అవగాహన

**ప్రజాపక్షం/కేశంపేట :** కేశంపేట మండలంలోని గ్రామాల్లో మొక్కలు నాటే విధానంపై గురువారం అధికారులు కొత్తపేట ఫారెస్ట్‌లో కేశంపేట, తలకొండపల్లి మండలాల పంచాయితీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో గుంతలు తీసే విధానం, మొక్కలు నాటి వాటిని కాపాడే విధానాలపై అధికారులు కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, తలకొండపల్లి ఎంపిడిఓ శ్రీకాంత్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకటయ్య, బీట్ ఆఫీసర్ రవీందర్‌గౌడ్, పంచాయితీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ పంటతో ఆర్థికంగా అభివృద్ధి

రంగారెడ్డి జిల్లా ఆదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** అన్నదాతలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఆయిల్‌పామ్ పంటలను సాగు చేసేందుకు ప్రోత్సహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఆదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ వివరించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల గ్రామంలో రైతులు సాగుచేసిన ఆయిల్ పామ్ పంటలను పరిశీలించడంతోపాటు కూరగాయల పంటల మార్కెటింగ్, కొండన్నగూడ గ్రామంలో ఆటోమెటిక్ రీలింగ్ యూనిట్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలను చేస్తే అన్నదాతలు ఎంతో ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎనిమిదేళ్లు కష్టపడి పంటలను సాగుచేస్తే పంట చేతికి వచ్చే అవకాశం ఉంటుందని, అంతలోగా అంతర్ పంటలను సాగు చేసుకునే అవకాశాలు సైతం ఉన్నాయని వివరించారు. ఆయిల్ పామ్ పంటలలో అంతర్ పంటలైనా కూరగాయాలు, కంది, తీగ పంటలను సాగు చేసుకోవచ్చునని తెలిపారు. కూరగాయల పెట్టుబడులు, దిగుబడులు, మార్కెటింగ్ ఎలా ఉందనే విషయాలపై అధికారులతో ఆరాతీశారు. అన్నదాతలు పండించిన కూరగాయల పంటలను గిట్టుబాటు ధర కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల పట్ల ఉద్యానవనశాఖ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ అధికారిని నీరజ గాంధీ, జిల్లా సెరికల్చర్ ఏడిహెచ్ ముత్యాలు, షాద్‌నగర్ డివిజన్ హార్టికల్చర్ అధికారిణి ఉషారాణి, ఫామ్ ఆయిల్ ఏరియా మేనేజర్ ప్రమోద్, ఫీల్డ్ అధికారి మల్లారెడ్డితోపాటు అన్నదాతలు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతానికి కృషి

-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సహకార సంఘాలు బలోపేతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో డివిజన్‌లోని ఆరు సహకార సంఘాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని ఆరు సహకార సంఘాలలో మొత్తం 22,694 మంది రైతులు సభ్యుత్వం తీసుకున్నారని, 6.58కోట్ల రుణాలను ఇచ్చినట్లు అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చారని ఎంఎల్‌ఏ తెలిపారు. సహకార సంఘాలలో సభ్యుత్వం తీసుకునే అన్నదాతలు రూ.330చెల్లించడంతోపాటు పట్టాదారు పాస్‌పుస్తకం జీరాక్స్‌కాఫీ ఇచ్చి సభ్యుత్వం తీసుకోవాలని సూచించారు. అంతకుముందు కొందుర్గు మండలం ఆగిర్యాల గ్రామానికి చెందిన నాగం భానుప్రసాద్ చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి ధరఖాస్తు పెట్టుకొగా రూ.4.50లక్షల చెక్కు మంజూరైంది. చెక్కును ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడి ఉన్నారు.

### రోగులకు ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించేది లేదు

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. ఉదయం



11గంటలు అయినా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులు రాకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సమయవేళలు పాటిస్తూ ఆసుపత్రులకు రావాలని, విధుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని సూచించారు. గురువారం ఉదయం ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి పేదలకు వైద్యసేవలు అంధిస్తుంటే వైద్యులు ఇష్టారాజ్యంగా రావడం సరికాదన్నారు. ఈవిషయంలో వైద్యాధికారిని సర్ధిచెప్పేందుకు యత్నించగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవారు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాలను గాలికి వదిలేసి సొంత ఆసుపత్రులను పెట్టుకుంటే ఉపేక్షించేది లేదని, సమయవేళలను విధిగా పాటిస్తూ వైద్యసేవలు అందించాలని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిని అప్రతిష్ట పాలు చేస్తే శాఖ పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

## 13న జగన్నాథ రథయాత్ర

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఇస్కాన్ మియాపూర్ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 13న జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామని మియాపూర్ ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు రాందాస్ తెలిపారు. గురువారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. 13న మధ్యాహ్నం చందానగర్‌లోని ఆర్‌ఎస్ బ్రదర్స్ వద్ద నుండి జగన్నాథుడి రథయాత్ర ప్రారంభమౌతుందని రథయాత్ర మదీనాగూడ, అల్విన్ కాలనీ, మియాపూర్ క్రాస్ రోడ్, జెపి నగర్ వీధుల గుండా కొనసాగుతూ మియాపూర్‌లోని విశ్వనాథ్ గార్డెన్ వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. అదే రాత్రి 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు విశ్వనాథ్ గార్డెన్‌లో సమావేశంతో పాటు సాంస్కృతిక కర్యక్రమాలు, ప్రసంగాలు ఉంటాయని తదుపరి భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులు జగన్నాథుడి రథయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీరాం ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో అనంద్ గోపినాథ్, మధుర్ శ్యాం, ఇస్కాన్ సభ్యులు గోపరాజు శ్రీనివాస్, దేవిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.




# జనాభా నియంత్రణపై అవగాహన అవసరం

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** సమాజంపై జనాభా పెరుగుదల ప్రభావం గురించి అవగాహన కల్పించడం కోసం ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డిఎం అండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వర అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు, ప్రోగ్రామ్ ఆఫీసార్లు, డిఇఎంఒ శ్రీనివాసులు, జిల్లాలోని సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

**యాచారం :** వర్షాకాలంలో అంటువ్యాదులు ప్రబలకుండా తగిన జాగ్రతలు తీసుకొవాలని ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి, డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి సూపర్ వైజర్స్ మేడికల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు యాచారం మండల కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ వర్షాకాలంలో విషజ్వరాల రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**రాజేంద్ర నగర్ :** జనాభా నియంత్రణకు ఎలాంటి నియంత్రణ చర్యలు తీసుకోవాలో ప్రణాళికలను రూంపొందించి అమలు పరచటానికి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరపుకుంటున్నమని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రాజేంద్రనగర్ శివరాం పల్లి రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌వోలు, ప్రోగ్రా ఆఫీసర్లు, డిఈఎంవో శ్రీనివాసులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** జనాభా నియంత్రణలో ప్రజలందరు భాగస్వాములు కావాలని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ కోరారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి ముఖ్యకూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ర్యాలీని డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాన్పుల మద్య దూరం తల్లిబిడ్డలకు శ్రేయస్కారమని, అధిక జనాభా అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని వివరించారు. జనాభా పెరుగుతుండటం వనరులు తగ్గుతున్నాయని, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు దేశ ప్రగతికి ఆరోగ్య సోపానాలని, చిన్నకుటుంబం చింతలేని కుటుంబం ఆరోగ్యంగా జీవించు ఆదాయం పెంచేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఆరోగ్య రక్షణ పద్ధతులు పాటించి ఆనందమైన జీవితం సాగిం చు, ఒక్కరు ముద్దుఇద్దరు హద్దు, కుటుంబ క్షేమం ఆరోగ్య కేంద్రాలకు లక్ష్యం అని పేర్కొన్నారు. ఆర్థిక స్థోమతను పెంచుకోవడంతోపాటు కుటుంబ వ్యవస్థలను బలోపేతం చేసుకునేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫరూక్‌నగర్ మండల వైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ రాఘవేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, ఎంపిహెచ్ఈఓ డాక్టర్ శ్రావణ్‌కుమార్, హెల్త్ సూపర్ వైజర్లు అమృత, శ్రీరామ, పిహెచ్‌ఎన్ పుష్పలీల, రెడ్యానాయక్, గౌస్, రవి పాల్గొన్నారు.





## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం పాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ విచ్చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లాలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రతి మంగళవారం, శుక్రవారం పీపీ యూనిట్ మహబూబ్‌నగర్ నందు జరుగుతాయని డాక్టర్ భాస్కర్ రఫీక్ శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు .అదేవిధంగా తాత్కాలిక పద్ధతుల్లో అంతరా ఇంజక్షన్లు వాడుకోవాలని వీటిపై ప్రజలకు అవగాహన కల్పిం చాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లాలో కుటుంబ నియంత్రణ కార్యక్రమానికి సంబంధించిన విశిష్ట సేవలు అందించిన ఉద్యోగస్తులకి అవార్డ్స్ ఇవ్వడం జరిగినది. .ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ రెడ్డి డాక్టర్ భాస్కర్ నాయక్ ,డాక్టర్ శశికాంత్ డాక్టర్ సంధ్య కిరణ్మయి. డాక్టర్ తిరుపతిరావు ,ఏఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు .

## తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** తెలంగాణ ముదిరాజ్ మహాసభ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామకృష్ణ ముదిరాజ్ ను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అభినందనలు తెలిపారు. నియామక పత్రం అందుకున్న అనంతరం మర్యాద పూర్వకంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయన కలిశారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గణేష్, నవకాంత్, కౌన్సిలర్ రాములక్ష్మ ణ్, శ్రీనివాస్ రెడ్డి, వరద భాస్కర్, కిషన్ పవార్, కుర్మయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని వైన్స్

### బెల్టు షాపులకు మద్యం సరఫరా

**ప్రజాపక్షం / అడ్డాకుల :** అడ్డాకుల మండల కేంద్రంలోని వైన్స్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. రాత్రి 10 గంటల వరకు షాప్ తెరిచి ఉంచాలనీ, మైనర్లకు మద్యం సరఫరా చేయకూడదని, షాపు ముందు ధరల పట్టిక ఉంచాలని, ప్రభుత్వ నిబంధనలు ఉన్నా షాపు నిర్వాహకులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ నిబంధనలు పక్కపెట్టి బెల్టు షాపులకు మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. బెల్టు షాపులలో రాత్రి 12. గంటల వరకు విచ్చలవిడిగా మద్యాన్ని అమ్ముతున్నారు. నిబంధనలు అతిక్రమించిన వైన్ షాపు పై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మంచి మనసు లేని ప్రతి ఒక్కరూ అంగవైకల్యులే : ఎమ్మెల్యే మేఘారెడ్డి

ప్రజాపక్షం / వనపర్తి టౌన్ : మనిషికి అంగవైకల్యం అనేది శాపం కాదని, మంచి మనసు లేని ప్రతి ఒక్క వ్యక్తి అంగవైకల్యుడేనని, అంగవైకల్యం ఉందని ఎప్పుడు కూడా అధైర్య పడవద్దని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని వికలాంగుల పునరావాస కేంద్రాల్లో నూతనంగా ఏర్పాటు చేసుకున్న పేపర్ ప్లేట్ల తయారీ యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వికలాంగుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సమాఖ్య అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్ , వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకుల సతీష్ , డిఆర్డీఓ అధికారులు , నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేరు మార్పునకు ఇబ్బందేమిటో చెప్పండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థులు తమ పేర్లను మార్పు చేసుకుంటూ గెజిట్ ప్రకచరణ చేశాక వాళ్ల పేర్లను సర్టిఫికెట్లలో మార్పు చేయడానికి ఉన్న ఇబ్బందులు ఏమిటో చెప్పాలని టెన్త్, ఇంటర్ బోర్డులను హైకోర్టు ఆదేశించింది. స్టూడెంట్స్ పేరు మార్చి సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఉన్న సమస్యలు ఏమిటో వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గెజిట్ జారీ అయ్యాక కూడా తన సర్టిఫికెట్లలో పేరు మార్చడం లేదంటూ హయత్‌నగర్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన బెంచ్ గురువారం విచారించింది. బోర్డులు, యూనివర్సిటీలు పేరు మార్చకపోడం అన్యాయమని 1961లో జారీ చేసిన జీవో 1263ను కొట్టేయాలని, ఆ Mజీవోని సెక్షన్లను రద్దు చేయాలని పిటిషనర్ వాదన. గెజిట్ వచ్చాక సర్టిఫికెట్లలో పేరు మార్పు చేయాల్సిన అవరం లేదని ప్రభుత్వం చెప్పింది. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పెట్టిన స్టూడెంట్ తన గెజిట్‌లోని పేరు రాసి పాత పేరుతో ఉన్న సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేస్తే ఆ విద్యార్థి ఉద్యోగం పొందే అర్హత ఉండదని హైకోర్టు చెప్పింది. గెజిట్ వచ్చాక పేరును సర్టిఫికెట్‌లో కూడా మార్పు చేసేందుకు ఉన్న సమస్యలేమిటో చెప్పాలని కోరుతూ విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

## పిజి మెడికోపై లైంగిక వేధింపుల కేసులో స్టే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఒక పీజీ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డారనే అభియోగాలపై ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ ఇచ్చిన రెండు రిపోర్టుల అమలును హైకోర్టు నిలిపివేస్తూ స్టే ఇచ్చింది. కమిటీ రిపోర్టును లైంగిక వేధింపుల కేసు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు హైకోర్టులో సవాల్ చేశారు. మెడికల్ స్టూడెంట్స్, నర్సు, రిటైర్డు ప్రొఫెసర్లు వేసిన పిటిషన్లను జస్టిస్ విజయసేన్‌రెడ్డి విచారించారు. తమకు ఫిర్యాదు కాపీ ఇవ్వలేదు. ఫిర్యాదుదారుతోపాటు సాక్షుల వాంగ్మూలాలను ఆడియో రికార్డు చేసిన కాపీలు కూడా ఇవ్వలేదు. ఇలా చేయడం లైంగిక వేధింపుల నిరోధం, పరిష్కార చట్టం రూల్స్ 7, 7(4)లకు వ్యతిరేకం.. అని పిటిషనర్ల వాదన తర్వాత హైకోర్టు స్టే ఇచ్చింది. విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది

## న్యాయవాదుల నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై పోలీసులు దాడి చేయడంపై హైకోర్టులో న్యాయవాదులు నిరసన తెలిపారు. కోర్టు వద్ద నిరసన చెప్పారు. హైకోర్టు బార్ అసోసియేషన్ కూడా నిరసన తెలిపింది. ఈ మేరకు అసోసియేషన సమావేశం నిర్వహించి తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బెయిల్ ఆర్డర్ ప్రతిని పోలీసులకు ఇచ్చేందుకు న్యాయవాది వెళితే అతని ఎదుటే పోలీసులు నిందితుడిపై దాడి చేశారని, ఇదేమిటని ప్రశ్నిస్తే న్యాయవాదిపై ఏఎస్ఐ దాడి చేశారన్నారు. పోలీసులపై కేసు నమోదు చేయాలని, న్యాయవాదిపై అన్యాయంగా బనాయించిన కేసును రద్దు చేయాలని పోలీసులను సమావేశం డిమాండ్ చేసిందన్నారు.

# మినరల్స్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు పూర్తిగా సహకరిస్తాం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హైదరాబాద్ ఐఐటి సహకారంతో ఆస్ట్రేలియాలోని మోనాష్ యూనివర్సిటీ ఐఐటి సంస్థ సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్ ఆన్ కోల్ మైనింగ్ అండ్ క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. డాక్టర్ బిఆర్ ఆంబే ద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో క్రిటికల్ మినరల్స్ కు సంబంధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో డిప్యూటి సిఎం స్పెషల్ సెక్ర టరీ కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సిఎండి బలరామ్ నాయక్, ఐఐటీ హైదరాబాద్ కు చెందిన ప్రొఫెసర్లు మూర్తి, నరసింహ, అశోక్ కామరాజ్, ఆస్ట్రేలియా మెల్ బోర్న్ లో మోనాష్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎలిశెట్టి మోహన్ లు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సంద ర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి పలు అంశాలను తీసుకువచ్చారు. అందులో ప్రధానంగా క్రిటికల్ మినరల్స్ ఉత్పాదనలో దేశం బాగా వెనకబడి ఉందని చెప్పారు. క్రిటికల్ అండ్ మినరల్స్ ఉత్పాదన కోసం స్టాటటిక్ అప్లి కేషన్ మినరల్స్ అండ్ మెటల్స్ ను ఏర్పాటు చేస్తే అత్యంత ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. బ్యాటరీల్లో ఉపయోగించే లిథియం సెమీకండక్టర్ల తయారీ ఉయోగించే గ్యాలియం పర్మినెంట్ బ్యాటరీల్లో ఉపయోగించే రేర్ ఎర్త్ మెటల్స్ ను మనమే సొంతంగా తయారు చేసు కుంటే దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అంతేకాక సాంకేతికంగా దేశం మరింత పురోభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడు తుందని చెప్పారు. ఇలాంటి కీలకమైన క్రిటికల్ మినరల్స్ ను మన దేశం చైనా నుంచి వంద శాతం దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల ఆర్థి కంగా భారం కావడంతో పాటు వాటి పనితీరు కూడా ఇబ్బందికరంగా ఉంటోందన్నారు. ఈ పరిస్థితి నుంచి దేశాన్ని ముందుకు తీసుకువెళ్లేం దుక సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఆన్ కోల్ మైనింగ్ అండ క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సెంటర్ ను తెలంగాణలో ఏర్పాటు చేస్తే మంచిదన్నారు. ఈ సెంటర్ ను కేంద్ర, రాష్ట్ర, ప్రైవేట్ భాగస్వా మ్యంతో ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. క్రిటి కల్ మినరల్స్ అండ్ మెటల్స్ సెంటర్ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు.. సాంకేతిక రంగంలో దేశం మరింత పురో భివృద్ధికి కారణమవుతుందని తెలిపింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ.. ఐఐటీ హైదరాబాద్ గత 10 నెలలుగా డ్రైవర్ రహిత వాహనాలను వినియోగిస్తోందని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. చివరగా సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఆన్ కోల్ మైనింగ్ అండ్ క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని వారు కోరారు. క్రిటికల్ మినరల్స్ అంశంలో రాష్ట్రం వేసే తొలి అడుగు దేశానికే దిక్సూచీలా మారు తుందన్నీరు. ఈ సమావేశంలో వారు చెప్పిన పలు అంశాలకు.. ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ.. రాష్ట్రానికి మేలు చేసే ఏ అంశానికైనా ప్రభుత్వం తన మద్దతును ఇస్తుందని చెప్పారు.



## బాగ్ లింగంపల్లిలో పర్యటించిన.. జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో ఉన్న సమస్యలకు వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమి షనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ ఎన్. రవి కిరణ్‌తో కలిసి గురువారం సుందరయ్య పార్క్, మదర్ డైరీ పార్క్, వియస్‌టి నుండి బాగ్ లింగంపల్లి వరకు ఫేస్ 2 ఫ్లై ఓవర్ ప్రతిపా దిత నిర్మాణ స్థలాన్ని కమిషనర్ ఆమ్రపాలి కాట పరిశీలించారు. సుంద రయ్య పార్క్‌లో వర్షపు నీరు నిలువడం మూలంగా ఇబ్బందులు వస్తున్నా యని, దాంతో పాటు టాయిలెట్ మరమ్మత్తులు చేపట్టాలని వాకర్స్ కమి షనర్‌ను కోరగా వాకర్స్ సూచించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఎస్ఎన్‌డిపి నాలా పనులు కూడా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మదర్ డైరీ పార్కు అభివృ ద్ధికి కూడా చర్యలు తీసుకోవాలన్నారు. వియస్‌టి నుండి బాగ్ లింగంపల్లి వరకు రెండు దశల్లో ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టాలని గతంలో నిర్ణయిం చారు. అయితే మొదటి దశలో ఇందిరాపార్కు నుండి వియస్‌టి వరకు చేప ట్టిన స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చిన విషయం తెల్సిందే.



## టివివిపి ఆస్పత్రుల్లో వేతనాలు చెల్లించాలని వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి)ఆ సుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు జిఒ ప్రకారం వెంటనే వేతనాలను చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటి యుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు గత ఐదు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ మేరకు టివివిపి కమిషనర్ అజయ్ కుమా ర్‌కు నరసింహ గురువారం వినతిపత్రం అందజేశారు. ఏరియా ఆసుప త్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న కార్మికులకు బడ్జెట్ రాలేదనే కారణంతో కాంట్రాక్టర్లు గత ఐదు నెలలుగా జీతాలను చెల్లిం చడం లేదని విమర్శించారు. వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌ను వెంటనే విడుదల చేసి, కార్మికులకు జీతాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పలు జిల్లాల్లో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒను అమలు చేయకుండా కొద్ది మంది కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై కార్మికులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. చట్ట ప్రకారం రావాల్సిన సెలవు లను కూడా అమలు చేయడం లేదని, అడిగిన కార్మికులపై దౌర్జన్యానికి తెగబడుతున్నారని తెలిపారు. దీనిపైన కమిషనర్ అజయ్ కుమార్ సాను కూలంగా స్పందించారని, కార్మికులకు జీతాలు అంశాన్ని ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లామని, ఒకటి, రెండు రోజుల్లో కార్మికులకు జీతాలు అందేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్టు నరసింహ తెలి పారు. టివివిపి పరిధిలో ఉద్యోగుల బదిలీలు ఉన్నందున 20 రోజుల తర్వాత జీతాలలో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకుంటామని, జిఒ అమలయ్యేలా కృషి చేస్తామని చెప్పినట్టు ఆయన వివరించారు.

## ఆరోగ్యసేవా కార్యక్రమాలలో ముందుంటా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రజలకు వైద్యసేవలు అందించేం దుకు నిర్వహించే సేవా కార్యక్రమాలలో తాను ముందుంటానని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో టిటిజిఆర్‌టిసి ఉద్యోగులకు ఆరోగ్యసేవలు అందించేందుకు ఏర్పాటుచే సిన వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులకు దంతవైద్య రంగానికి సంబంధించిన అవసరాలు ఉంటేతాను సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. రాజకీయాలలోకి వచ్చినతర్వాత వైద్యరంగానికి కొద్దిగాదూరం కావాల్సి వచ్చిందని ఎప్పుడు ఎలాంటి సేవలు అవసరం ఉన్న తాను 24గంటలు అందుబాటులో ఉంటానని తెలిపారు.

## చింతల్ తండా బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం చింతల్ తండాలో జరిగిన జంట హత్యలపై పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రేమ పేరుతో ఉన్మాదిలా మారి యువతి తల్లిదండ్రు లను అతి కిరాతకంగా చంపడం దారుణమని, ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేసినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.దాడిలో గాయపడిన యువతికి, ఆమె సోదరుడికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపిన సీతక్క తెలిపారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల మధ్య సమన్వయం పెంచే చర్యలు చేపడుతున్నామని సీతక్క చెప్పారు.



## పదవీ బాధ్యతలు చేపట్టిన నిర్మల జగ్గా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఐఐసి ఛైర్ పర్సన్‌గా తూర్పు నిర్మల జగ్గారెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పరిశ్రమల భవన్‌లో గురువారం అట్టహాసంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమే బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, టిపిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎంఎల్‌సి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జగ్గా రెడ్డి సహచరులు, మిత్రులు పాల్గొన్నారు.



## బిసికార్పోరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలుస్వీకరించిన శ్రీకాంత్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంక్షేమ భవన్ లో బిసి కార్పోరేషన్ ఛైర్మన్ గా నూతి శ్రీకాంత్ గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమానికి బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్‌అలీ, టిపిసి ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కీ గౌడ్‌లు నూతన ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిసి సంక్షేమ శాఖ మంత్రిగా ఈ కార్పోరేషన్ ద్వారా బలహీన వర్గాలకు సేవ చేసే విధంగా ముందుకు వెళ్తామన్నారు. గతంలో ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే హడావిడిగా బీసీ కార్పొరేషన్ కొనసాగుతుండేదన్నారు. కాని ఇప్పుడు ఎన్నికల తో సంబంధం లేకుండా నిరంతరంగా బలహీన వర్గాలకు సంబంధించి శిక్షణ , ఉపాధి , బలహీన వర్గాల అభివృద్ధి ,ఆర్థిక బలోపేతం అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

## చీకటి జిఓలతో కాంట్రాక్టర్లకు దోచి పెడుతున్న ప్రభుత్వం

### ఏలేటి మహేశ్వరరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ :రాష్ట్ర ప్రభుత్వం జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్ట కుండా చీకటి ఒప్పందాలతో కాంట్రాక్టర్లకు దోచిపెడుతోందని బిజెపి శాసనస భాపక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గురువారం బిజెపి ఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో మేఘా కృష్ణారెడ్డి దోచుకున్న తెలంగాణ సొమ్మంత కక్కిస్తానన్న సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే రహస్య జీవోలతో తన సొంత జిల్లాలోమేఘా కృష్ణారె డ్డికి రూ.1100 కోట్ల కాంట్రాక్ట్ పనులు ఇచ్చారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కేంద్రం నుంచి అమృత్ స్కీమ్ లో రూ. 3 వేల కోట్ల కాంట్రాక్టర్ల లో అవినీతి కి పాల్పడ్డారని ఆరోపించారు. దీన్ని 3 భాగాలు గా విభజించి వెయ్యి కోట్లకు ఒక్కరిగా కాంట్రాక్టు ఇచ్చారన్నారు. అదేవిధంగా ఎక్సైజ్ కుంభకో ణంలో ఉన్న రేవంత్ బామ్మర్ది సృజన్ అనే వ్యక్తీ కి చెందిన శోధ కంపెనీకి రూ. 400 వందల కోట్ల కాంట్రాక్టర్ ఇచ్చారని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. 30 నుంచి 35 శాతం తక్కువకు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్న వారికి కాకుండా తమ ఇష్టానుసారంగా ఎస్టిమెట్ పెంచి రూ. 600 కోట్లతో పూర్తి అయ్యే ప్రాజెక్ట్ ను వెయ్యి కోట్లకు ఇచ్చారని ఆరోపించారు. మొత్తం కలిపి రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని దీనిపై విచారణ జరిపించా లని ఆయన డిమాండ్ చేశారు.

## అందుబాటులో డిఎస్‌సి హాల్‌టికెట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్: డిఎస్‌సి హాల్‌టికెట్లను www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యాశాఖ తెలి పింది. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జర గనున్నాయి. ఫిబ్రవరి 29న మొత్తం 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వం డిఎ స్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. సిబిఆర్‌టి విధా నంలో రోజుకు రెండు షిఫ్ట్‌లో డిఎస్‌సి పరీక్షలు జరగనున్నాయి.

డిఎస్‌సి పరీక్షల షెడ్యూల్ :

జులై 18 న మొదటి షిఫ్ట్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ పరీక్ష
జులై 18 సెకండ్ షిఫ్ట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పరీక్ష
జులై 19న సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష
జులై 20న ఎస్‌జిటి సెకండరీ గ్రేడ్ ఫిజికల్, స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షలు
జులై 22 స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ పరీక్ష
జులై 23 న సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష
జులై 24న స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్ పరీక్ష
జులై 26న తెలుగు భాషా పండిట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష
జులై 30న స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ పరీక్ష



## యాదాద్రి థర్మల్ విద్యుత్ స్టేషన్‌ను సందర్శించిన సిఎండి రోనాల్డ్ రోస్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ ఇంధన శాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి రోనాల్డ్ రోస్ గురువారం యాదాద్రి థర్మల్ స్టేషన్‌ను సంద ర్శించి 5X800 మెగావాట్ల విద్యుత్ స్టేషన్‌ను పరిశీలించారు. అంతే కాకుండా ఈ థర్మల్ స్టేషన్ పరిధిలోని 5 యూనిట్లను ఆయన పరిశీలించారు. వీటితో పాటు అన్ని బాయిలర్లను, టర్బయిన్‌లను, జనరేటర్లను పరిశీలించి వాటి పనుల్లో మరింత వేగం పెరగాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనం తరం ఇక్కడి రైల్వే లైన్‌ను, కోల్ హ్యాండిలింగ్ ప్లాంట్‌లను సిఎండి రోనాల్డ్ రోస్ సందర్శించారు. ఈ సందర్భంగా బిహెచ్ఇఎల్ ఇతర అనుబంధ ఏజెన్సీలను ఆయన ఆదేశిస్తూ పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. యాదాద్రి థర్మల్ స్టేషన్ పరిశీలన కార్యక్రమంలో సిఎండి రోనాల్డ్ రోస్ వెంట ఈ కార్యక్రమంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ జే.సమ్మయ్య, డైరెక్టర్ , ప్రోజెక్ట్ ఎం. సచ్చిదానందం, డైరెక్టర్ సివిల్ , హెచ్‌ఆర్ ఏ. అజయ్, చీఫ్ ఇంజనీర్లు పివి శ్రీనివాస్, జి.శ్రీనివాస రావు, ,డిఈ ఈ హనుమాన్ తదితరులు ఉన్నారు.

## గృహజ్యోతి సవరణలకు అవకాశం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గృహజ్యోతి పథకం కింద అర్హులైన గృహ విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నది. ఈ పథకంలో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో వినియోగదారులు అందజేసిన యూఎస్‌సి (విద్యుత్ కనెక్షన్) నెంబర్‌కు ఈ పథకాన్ని వర్తింపజేసి జీరో బిల్లులు అందిస్తున్నది. అయితే ఈ పథక లబ్దిదారులు ఇల్లు మారినపుడు, ఆహారభద్రత కార్డు సర్వీస్ కనెక్షన్ అనుసంధానం లోపాల వల్ల గృహజ్యోతి పథక లబ్దిని పొందలేకపోతున్నారు. ఈ విషయంపై పలు వర్గాల నుండి అందుతున్న అభ్యర్థనలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం, ప్రజాపాలన సేవ కేంద్రాల్లో యూఎస్‌సి (విద్యుత్ కనెక్షన్) నెంబర్ ను సరి చేసుకోవటానికి వెసులు బాటు కల్పించింది. ఈ సందర్భముగా నల్గొండ జిల్లా పర్యటనలో ఉన్న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ ఐఏఎస్ నల్గొండ రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉన్న ప్రజా సేవా కేంద్రాన్ని సందర్శించి గృహజ్యోతి పథకం లబ్ది దారుల నమోదు విధానాన్ని పరిశీలించారు.

## నేడు శంషాబాద్‌లో బిజెపి రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయ జనతా పార్టీ (బిజెపి)రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ మల్లిక కాన్వే షన్ సెంటర్ జరగనుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పాల్గొంటారని వెల్లడించారు. గురువారం ఆయన హైదరా బాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సమావే శాల్లో రాజకీయ తీర్మానాలతో పాటు ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా పార్టీ సంస్థాగత విష యాలపై చర్చిండంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థి తులు, రానున్న పంచాయతీ, ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చ జరుగుతందని ఎన్‌విఎస్ఎస్ తెలి పారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ ప్రజల ఓట్లతో గట్టెక్కి వారి నెత్తిమీద సిఎం రేవంత్‌రెడ్డి సవారీ చేస్తున్నారన్నారు. రుణమాఫీపై మాట తప్పి వాయిదాల పర్వం కొనసాగిస్తుండగా, మరోపక్కా ప్రజా ఫిర్యాదులు పరిష్కా రానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రణాళిక ప్రకారమే బిఆ ర్ఎస్ ఎంఎల్‌ఏలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రాజకీయ నియామకా లపై త్వరలో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.




## ఎల్ వి ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థకు బెస్ట్ ఎన్‌జిఓస్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గుర్గావ్ లోని హయాత్ రెజెన్సీలో జరిగిన ప్రతి ష్టాత్మక గ్లోబల్ సిఎస్ఆర్ ఈఎస్‌జీ అవార్డులు 2024 లో ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు టాప్ 10 బెస్ట్ ఎన్‌జిఓస్ ఆఫ్ ది ఇయర్ – 2024 పురస్కారం పొందింది. ఇందులో పలువురు ప్రముఖులు సమావేశమ య్యారు. ఎల్‌వి ప్రసాద్ ఇఐ తరఫున పబ్లిక్ రిలేషన్స్ డోనర్ ఎఫైర్స్ బృందం లోని మహావీర్ సి జైన్ పురస్కారాన్ని స్వీకరించారు. పురస్కారాన్ని స్వీకరించ డంపై స్పందిస్తూ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు డా ప్రశాంత్ గర్గ్ సిబ్బంది అందరి అవిరామ అంకితభావం, మా దాతలు మరియు భాగస్వాముల అచంచల మద్దతుకు పురస్కారం ఒక నిదర్శనం అని అన్నారు. ఇటువంటి పురస్కా రాలు అందరూ చూడగలగాలి అనే మా కృషిని కొనసాగించడానికి ప్రేరణని స్తాయని పేర్కొన్నారు. కంటి ఆరోగ్య రంగంలో కృషికి ఎల్విపిఇఐ టాప్ 10 బెస్ట్ ఎన్‌జిఓస్ ఆఫ్ ది ఇయర్ – 2024 పురస్కారం అందుకోవడం అభినంద నీయమన్నారు. ప్రస్తుతం 26 ఎల్విపిఇఐ ద్వితీయశ్రేణి కేంద్రాలు ఒక కంటి డాక్టర్, ప్రాథమిక శస్త్రచికిత్స సంరక్షణకు, మరికొన్ని స్థానాలలో, కార్నియా మార్పిడివంటి క్లిష్టమైన సంరక్షణ అందిస్తున్నాయని తెలిపారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాపక్షం/కల్వకుర్తి ః సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పట్ల ఆ పట్టణ టూటౌన్ ఎఎస్‌ఐ ఉమారెడ్డి దాడిచేసి కొట్టడంపట్ల నిరసనవ్యక్తంచేస్తూ గురు వారం కల్వకుర్తి బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టువిధు లను బహిష్కరించారు. భద్రాచలంలో న్యాయవాదిని బేడిలువేసి అరెస్టుచేసిన సంఘటన మరువకముందే సిద్దిపేట సంఘటన జరగడంపట్ల న్యాయవా దులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా కల్వకుర్తి బార్‌అసోసియే షన్ అధ్యక్షుడు కె.వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసులు బరితె గించి న్యాయవాదులపట్ల అమానుషంగా ప్రవర్తించడం హేయమైన చర్య అన్నారు. న్యాయవాదిపై దాడిచేసిన పోలీసులను తక్షణమే సస్పెండ్‌చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మ ణ్‌రాజ్, సీని యర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## వ్యాధుల పట్ల జాగ్రత



**ప్రజాపక్షం/ధారూర్ :**వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రభలకుండా అప్రమత్తంగా ఉండాలని ధారూర్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వై సుస్మీ అన్నారు. గురువారం ధారూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలలో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా,చికన్‌గున్యా,మెదడెవ్యాపు, అతిసారా, జాండీస్ వ్యాధులు ప్రభలకుండా బోధనేతర సి బ్బందికి పరీక్షలు నిర్వహించారు.వ్యాధులు ప్రభలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలను విధ్యార్ధిని, విద్యార్థులకు, భోధన, భోధనేతర సిబ్బందికి వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రాధమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

## రాష్ట్రంలో ఐదురోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల ఐదు రోజులు పాటు మోస్తరు నుంచి భారీ వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ క్రమంలో వర్షసూచన ఉన్న జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో వర్షాలు పడే అవకాశాలున్నాయన్నారు. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం ఉత్తర తెలంగాణలోని పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఈ క్రమంలోవర్షసూచన ఉన్న జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను ప్రకటించారు.

## రాచకొండ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌బాబు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** తనపై నమ్మకంతో ప్రభుత్వం స్వల్ప వ్యవధిలోనే రాచకొండ పోలీస్ కమిషనర్‌గా మరో సారి విధులు నిర్వహించే కల్పించిన అవకాశాన్ని మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని నూతన కమిషనర్ జి. సుధీర్‌బాబు అన్నారు. బుధవారం నాటి ఐపిఎస్ అధికారుల బదిలీలతో రాచకొండ కమీషనర్‌గా ఐదు మాసాల వ్యవధిలో మరో సారి నియమితులైన ఆయన గురువారం నేరేడ్‌మెట్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకొంటూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేందుకు కృషి చేస్తానన్నారు.

## రాములగుట్ట క్షేత్రానికి భూమిని అప్పగించాలి

### మంత్రి శ్రీధర్‌బాబుకు మధుకృష్ణ వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని అతి పురాతణమైన శ్రీరాములగుట్ట పుణ్యక్షేత్రానికి ప్రభుత్వ భూమిని అప్పగించాలని లక్ష్మాపూర్ గ్రామ యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధుకృష్ణ మాట్లాడుతూ లక్ష్మాపూర్ గ్రామంలోని శ్రీరాములగుట్ట దేవస్థానం భూమి అటవీశాఖ ఆధీనంలో ఉన్నదని అన్నారు. దీనికి సంబంధించి అటవీశాఖ వారికి గ్రామంలోని ప్రభుత్వ భూమిని బదలాయించి దేవస్థానానికి అప్పగించడానికి రెవెన్యూ శాఖ మరియు అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేశారన్నారు. మేడ్చల్ కలెక్టర్ చైర్మన్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటి ఆమోదం తెలిపిందన్నారు. అయినప్పటికి వరుస ఎలక్షన్‌ల కోడ్‌ల వలన ల్యాండ్ డైవర్షన్‌కు సంబందించి ఎన్‌వోసిని త్వరగా ఇచ్చేటట్లు కమిటి చైర్మన్ కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయాలని మంత్రిని కోరడం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు ఫోన్ చేసి త్వరగా ఎన్‌వోసి ఇచ్చే విదంగా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారని అన్నారు.

## ఘనంగా నవాబ్ ఆలీ నవాజ్ జంగ్

### బహదూర్ 147వ జయంతి వేడుక



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ ఇంజనీర్ నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ బహదూర్ 147వ జయంతిని గురువారం రోజున నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణా లిమిటెడ్ టిజి ఎన్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం విద్యుత్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా సంస్థ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ఈ మేరకు నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ బహదూర్ చిత్ర పటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సిజియంలు , ఉద్యోగులు పూలతో నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఇంజనీర్ తెలంగాణ ఇంజనీర్ నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ఆయన ఆలోచన సరళిని స్పూర్తిగా తీసుకొని ప్రతి ఒక్క ఇంజనీర్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. ఆసియా ఖండంలోనే నిజాం సాగర్ డ్యామ్ భిన్నమైన పద్దతిలో నిర్మించిన ఘనత కేవలం నవాబ్ ఆలీ కి మాత్రమే దక్కుతుందని అన్నారు. ఛీఫ్ ఇంజనీర్ గా ఉన్న కాలంలో నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ అనేక భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు రూపక ల్పన చేసి, వాటిని విజయవంతంగా నిర్మించారన్నారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చే ఉస్మాన్ సాగర్ , హిమాయత్ సాగర్, చెరువుల రూపకల్పన నవాబ్ ఆలీ ప్రతిభ అని అభివర్ణించారు. నవాజ్ జంగ్ పేరు మీద నిజామాబాద్ లోని అలీసాగర్ ప్రాజెక్టుకు నామకరణం చేశారని సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా హాస్పిటల్, ఆర్ట్స్ కాలేజీ, జూబ్లిహాల్ ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ తదితర ఎన్నో చారిత్రాత్మక కట్టడాలను నిర్మించి ప్రజల అవసరాలను తీర్చారని అన్నారు. తెలంగాణ సమాజ వికాసానికి ఎనలేని కృషి చేసిన ఆలీ నవాబ్ జంగ్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్ , వి. తిరుపతి రెడ్డి, ఆర్టిజన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతర పాట-2024 పాట పోస్టర్ ఆవిష్కరించిన మంత్రులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆషాడ బోనా ఉత్సవాలు పురస్కరించుకుని సుపథ క్రియేషన్స్ రూపొందించిన బోనాల జాతర పాట – 2024 పోస్టర్‌ను పాటను సచివాలయంలోని మంత్రి పొన్నం ప్రభాకర్, టూరిజం సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు గురువారం ఆవిష్కరించారు. అనంతరం స్క్రీన్ ద్వారా పాట ను వీక్షించి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా బోనాల పాటను రూపొందించారని సుపథ క్రియేషన్స్ బృందాన్ని మంత్రులు అభినందించారు. ఈపాటను తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి రచించగా, ఎం ఎం శ్రీలేఖ సంగీతాన్ని సమకూర్చారు. గీతాన్ని కీర్తన శర్మ ఆలపించగా, నృత్యం దుర్గ, దర్శకత్వం చేతన్ కత్తి వహించారు. ఈ సందర్భంగా పాట కు సహకరించిన వివిధ రంగాల కళాకారులను మంత్రులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ , సాంస్కృతిక శాఖ సెక్రటరీ వాణి ప్రసాద్ ఐఎఎస్ ,దేవాదాయ శాఖ సెక్రటరీ హన్మంతరావు,సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరిక్రిష్ణ, కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ నేత వెలిచాల రాజేందర్ రావు ,పొన్నం రవిచంద్ర , ఏ.చందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి భేటి

### ప్రాజెక్టుల మరమ్మత్తులకు నిధులు కెటాయింపు చర్చ

**ప్రజాపక్షం/తాండూరు:** రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని తాండూరు ఎంఎల్ఏ బుయ్యాని మనోహర్‌రెడ్డి బేటి అయ్యారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు నియోజకవర్గంలోని ప్రాజెక్టులు, చెరువులు, అయకట్టుల మరమ్మత్తులకు గూర్చి మంత్రితో చర్చించారు. వాటిని నిధులు కెటాయించిన పనులు త్వరితగతిన ప్రారంభించే విధిందా చూడాలని కోరారు. ఇందుకు గాను రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలసిన వారిలో చేవెళ్ళ ఎంఎల్ఏ కాలే యాదయ్య ఉన్నారు.

## బ్యాంకర్లతో రుణలక్ష్య సాధనపై సమీక్ష

### జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జోన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వార్షిక ప్రణాళిక లక్ష్యం రూ.7528. 45కోట్లు నిర్దేశించిమని బ్యాంకర్లు తమ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలనీ, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ బ్యాంకర్లతో రుణా లక్ష్య సాధనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024–2025 సంవత్సరానికి గాను రూ.7528,45 కోట్లు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని బ్యాంకర్లను ఆదేశించారు. పంట రుణం క్రింద రూ.3434023 కోట్లు ఇతర వ్యవసాయరంగానికి రూ.725.51 కోట్లు అనుబంద, చిన్న, మధ్య తరహ పరిశ్రమలకు రూ.565.05 కోట్లు, విద్య, గృహ, నిర్మాణం, ఇతర రంగాలకు రూ.2803.66 కోట్లు రుణ లక్ష్యంగా నిర్దేశించమని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరములో వరి పంట రుణ పరిమితి ఎకరాకు రూ.45 వేలు, పత్తి పంటకు రూ.46వేలు, కుందులు ఎకరానికి రూ.24వేలు నిర్దేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంర్ల ఇంచార్జీకలెక్టర్ సుధీర్, జిల్లా లీడ్ బ్యాంక్ మెనేజర్ యాదగిరి, నాబార్డు డిడిఎం అఖీల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెడికల్, పారామెడికల్ అభ్యర్థులకు జాబ్‌మేళా

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** పారా మెడికల్, నాన్ పారా మెడికల్ కోర్సుల్లో 2023–24 సంవత్సరంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు శుక్రవారం మదీనాగూడలోని కెఎం పాండు మెమోరియల్ వొకేషనల్ కాలేజిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి ఎం.కిషన్ తెలిపారు. ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ జాబ్‌మేళాకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో పారా మెడికల్, నాన్ పారామెడికల్ కోర్సులకు సంబంధించి జరిగే ఈ జాబ్ మేళాలో పలు కంపనీలకు చెందిన ప్రతినిధులు నియామకాలు చేపడుతారని, ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్యా శాఖ రీజనల్ జాయింట్ అధికారి జ్యోత్స్న, డిప్యూటి డైరెక్టర్ లక్ష్మారెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

## కబ్జాదారులను కఠినంగా శిక్షించాలి

### సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



**ప్రజాపక్షం/దుండిగల్ :** కబ్జాదారుల ఇబ్బందులకు తట్టుకోలేక ఇంటి నుండి వెళ్లిపోయిన కొడుకు వార్త వినడం వల్ల తండ్రి మృతిచెందడం కుటుంబానికి తిరనిలోటని సిపిఐ నియోజకవర్గ నాయకులు బౌరంపేట్ లోని మాధవ రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యంగా ఉండి సమస్యను పరిష్కరించుకోవాలని వారికి సిపిఐ మద్దతు ఉంటుందని తెలపారు. ఈ సందర్భంగ మాట్లా డుతూ త్రిపుర ల్యాండ్ మార్క్ యాజమాన్యం దుర్మార్గంగా రైతు దొంతిరెడ్డి కి చెందిన భూమిని అక్రమించాలని సుమారు సంవత్సరం నుండి ప్రయత్నిస్తున్నారని రైతు అమ్మను అని కృతనిశ్చయంతో ఉండటం వల్ల గతంలో కొంత మందిని తీసుకువచ్చి 2 సార్లు కొట్టించారని ఈ విషయంపై 4 ఎఫ్ఐ ఆర్లు కేసులు నమోదయ్యాయిని, కోర్టు కూడా రైతుకు మద్దతు ఇవ్వడంతో ఇతర మార్గాలను ఎంచుకొని ఇబ్బందులకు గురిచేయడం వల్లే ఏమి చెయ్యలేక తను వెళ్లిపోవాల్సి వచ్చిందని సిపిఐ నాయకులతో రైతు మాధవరెడ్డి చెప్పడం జరిగిందన్నారు. కబ్జాదారులు కేసులకు భయపడకుండా ఇంతగా దౌర్జన్యానినికి దిగడం అన్యాయమని వారి వల్ల నేడు ఒక రైతు మృతిచెందడం గోరమని కావున పోలీస్ అధికారులు వెంటనే కబ్జాదారుల పై కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని క్రతువులు అయ్యిపోయాక కమీషనర్ ను కలిసి వారికి న్యాయం చేయడానికి సిపిఐ ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తామని అన్నారు. సిపిఐ నియోజకవర్గ నాయకులు శ్రీనివాస్, అశోక్ రెడ్డి, యాదయ్య, ఆంజనేయులు, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** పోచారం మున్సిపల్ ప్రజలకు సీజన్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోచారం చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో, అన్నోజిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారులతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేసిన మున్సిపల్ చైర్మన్ బోయ పల్లి కొండల్ రెడ్డి గురువారం పోచారం మున్సిపల్ కార్యక్రమంలో వైద్యాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. డెంగ్యూ, చికెన్ గునియా, డయేరియా, మలేరియా, టైఫాడ్, పలు విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వర్షా కాలంలో దోమల నివారణ చర్యలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకూ అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యా నాయక్, కమిషనర్ పి వేమన రెడ్డి, ప్రధానోపాధ్యాయులు స్వరూప రాణి, కౌన్సిల్ సభ్యులు గొంగళ్ళ మహేష్, సింగిరెడ్డి సాయి రెడ్డి, బెజ్జంకి హరి ప్రసాద్ రావు, సుర్వి రవీందర్, కోఆప్షన్ సభ్యులు అక్రమ్ ఆలీ, డా॥ సౌమ్య, మున్సిపల్ మేనేజర్ కిరణ్, ఆర్.ఐ. సాయి రాజ్, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపాలిటీ పరిధి దుండిగల్ 5వ వార్డులోని రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు, అందర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను వైస్ చైర్మన్ పద్మా రావు తో కలిసి ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ అనంతరం వారు వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఎల్లవేలలా కృషి చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని నాణ్యతలో రాజీ పడొద్దు అని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు కౌన్సిలర్లు జక్కుల క్రిష్ణ యా ద వ్, ఆనంద్ కుమార్, గోపాల్ రెడ్డి, శంకర్ నాయక్, మహేందర్ యాదవ్, సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, యువ నాయకులు విష్ణు యాదవ్, నాయకులు ఉప్పరి క్రిష్ణ, అమరం ముత్యం రెడ్డి, శంకరప్ప, బాల్ రెడ్డి,నాగేష్, దార మహేష్, భాస్కర్, అప్ప, నవీన్, క్రిష్ణ రెడ్డి, కుమ్మరి క్రిష్ణ, రాజు, భాను, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్లు ఇచ్చారు.. తాగునీరు మరిచారు

### బెడ్రూమ్ ఇండ్ల నివాసితుల ఆవేదన



**ప్రజాపక్షం/బోడుప్పల్ :**డబుల్ బెడ్ రూములు ఇచ్చిన అధికారులు మంచి నీళ్లు ఇవ్వడం మరిచారు. అధికారుల నిర్లక్ష్యం తో అక్కడ లబ్ధిదారులు కొన్ని నెలలుగా మంచి నీళ్లు లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతం కాదు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న కార్పోరేషన్ లోని డబుల్ ఇండ్ల నివాసితుల పరిస్థితి, వివరాల్లోకి వెళ్ళితే బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 2వ డివిజన్ లోని అంబేద్కర్ నగర్ కాలనీ,13వ డివిజన్ లలో ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్స్ రెవిన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో కేటాయించారు. దీంతో చాలా కుటుంబాలు నివసిస్తున్నారు. మంచినీటి సౌకర్యం కోసం అప్పటి నుండి ఇప్పటి వరకు కనీసం పైపు లైనులు వేయకుండా అధికారులు నిరుపేదలపై చిన్నచూపు చూస్తున్నారు. స్థానిక కార్పోరేటర్, డిప్యూటి మేయర్ చొరవ తీసుకొని కార్పోరేషన్ నుండి 10లక్షలు త్రాగునీటి మరమ్మతులకు తీర్మానం చేసించిన జలమండలి అధికారులు మొద్దునిద్రలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో నీళ్లు లేకుండా కనీస జీవనం గడవడం కష్టతరమవుతుందని వాపోతున్నారు. ఎన్నోసార్లు జలమండలి మేనేజర్ ను కలిసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి నివాసులకు వెంటనే మంచినీళ్లు అందించాలని కాలనీ వాసులు కోరతున్నారు.

**డబుల్ బెడ్ ఇండ్లకు మంచినీరు అందించండి**
**డిప్యూటి మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్**

అద్దె చెల్లించలేక అప్పుల పాలై ప్రభుత్వం ఇచ్చిన ఇంటిలోనైనా బ్రతకడానికి వస్తే జలమండలి అధికారులు నిర్లక్ష్యం వల్ల తాగడానికి మంచినీరు లేక అల్లాడుతున్నారు. వారి సమస్యను గుర్తించి కార్పోరేషన్ నుండి 10లక్షలతో తీర్మానం చెయించాను. కానీ పనులు జరుగలేదు. వెంటనే అధికారులు అలసత్వం వీడి టెండర్ పిలిచి నిరుపేదల దాహం తీర్చాలి.

**వెంటనే మంచినీటి సమస్యను తీరుస్తాం**
**బోడుప్పల్ జలమండలి మేనేజర్ మమత**

కార్పోరేషన్ నుండి వచ్చిన 10లక్షలతో త్వరలో టెండర్ల ను పిలిచి మంచి నీరు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. తొందరలోనే ప్రతి కుటుంబానికి మంచినీరు అందిస్తాం.

## పిడిఎస్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** చుట్టుపక్క గ్రామాలలో నుండి తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఆటో ట్రాలీ ద్వారా అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. వివరాల్లోకెలితే నవాబు పేట్ మండలంలో ఎస్ఐ భరత్ భూషణ్ ఆదేశాల మేరకు గ్రామాలలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ యాదగిరి, జమిందార్ నరసింహారెడ్డి, కానిస్టేబుల్ మల్లేశం లతో కలిసి గంగ్యాడ గ్రామం మీదుగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నమ్మదగిన సమాచారంతో వాహనాలు తనిఖీ చేస్తుండగా పిడిఎస్ బియ్యంతో టి ఎస్ 30టి 5711, టిఎస్ 11యుసి 5807 గల వాహనాలకు సంబందించిన, శ్రీకాంత్, గణేష్, వ్యక్తుల నుండి 14.4 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకొని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపారు.

## ఇంటింటా ఇన్నోవేటర్ గోడ పత్రిక ఆవిష్కరణ

### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** స్థానిక సమస్యల పరిష్కారానికి తమ కొత్త ఆలోచనలతో విన్నూత ఆవిష్కరణలను ప్రభుత్వానికి తెలియ చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంటింటా ఇన్నొవేటర్ సెల్‌ను వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కోరారు. గురువారం తమ కార్యాయల ఛాంబర్‌లో డిఆర్‌డిఏపిడి సాంబశివరావు, డిపిఒ వెంకయ్య, వ్యవసాయ అధికారి రేఖ మేరి, ఈ డిస్ట్రిక్ట్ అధికారి భాను ప్రకాష్‌రెడ్డి తదితరులు సమక్షంలో ఇంటింటా ఇన్నొవేటర్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహిణులు, పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, వ్యవసాయదారులు ఆసక్తి ఉన్న వారందరికి ఇంటింటా ఇన్నొవేటర్ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.తమ కొత్త దనాన్ని తెలియ చేసే ఆవిష్కరణకు సంబంధించి 4 ఫొటోలు, రెండు నిమిషాల నిడివి ఉన్న వీడియో, పేరు, వయస్సు, వృత్తి, చిరునామా, పాస్‌పోర్టు ఫొటోలను ఆగస్టు 3వ తేదీలోగా 9100678543కు వాట్సప్ ద్వారా పంపించాలని, ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శనలు ఉంటాయని ఆయన తెలిపారు.

## కార్మికులకు అత్యవసర ప్రథమ చికిత్స అవసరం



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** సిఐఈ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ టిజిఐఐసి ఐలా ఆర్ఎస్ రెడ్డి, రాచమల్లు కంపెనీ తరఫున నిర్వహించిన కార్యక్రమంలో ఎమర్జెన్సీ గ్రీన్ హెల్త్ సర్వీస్ 108 వారి సుమన్, మధుసూదన్, సౌజన్యంతో సిపిఆర్ క్రార్డియో, పల్మారి రిసర్వేషన్ ఎలా చేయాలో రహదారి ప్రమాదంలో మనం ప్రథమ చికిత్స ఎల చే యాలో ఎమర్జెన్సీ గ్రీన్ హెల్త్ సర్వీస్ 108 వారు కార్మికులకు వివరించారు. అనంతరం బుధవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పారిశ్రామికవాడలోని స్మార్ట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యం గౌడ్, గాంధీనగర్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.స్వామి గౌడ్, పాల్గొన్నారు. అనంతరం ఎమర్జెన్సీ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ వారు పారిశ్రామికవాడలో పనిచేసే కార్మికుల ఉద్దేశించి, కార్మికుల ప్రమాదంలో ఉంటే మనకు మనము ఎలా కాపాడుకోవాలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఎలా వాడాలో కార్మికులకు వివరించారు. మనం కంపెనీలో ఉన్నప్పుడు మన గాయం అయినప్పుడు, హాస్పిటల్‌కు పెళ్ళేంత వరకు మనకు మనం ఎలా కాపాదుకోవాలో కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిజిఐఐసి ఐలా మేనేజర్ సుధాకర్ రెడ్డి, బిల్ కలెక్టర్ నరసింహా సాగర్, పలు కంపెనీల చైర్మన్లు. కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో జోరుగా అక్రమ దందా

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలో అక్రమ దందా జోరుగా సాగుతుంది. పోలీసుల కళ్ళు కప్పిన ప్రభుత్వ నిషేధించిన గుట్కా, పిడిఎస్ బియ్యం వంటి వ్యాపారాన్ని అక్రమార్కులు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు గురువారం జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులతో పాటు స్థానిక పోలీసులతో కలిసి తాండూరు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో అక్రమార్కుల గుట్టు రట్టాయింది. అక్రమంగా రవాణ చేస్తున్న 14క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యంతో పాటు రూ.7.5లక్షల విలువైన నిషేదిత గుట్కాలను స్వాదినం చేసుకున్నారు. పలువురు అక్రమార్కులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ క్రమంలో ఓ వ్యక్తి వద్ద నిషేధిత గుట్కా ప్యాకెట్లను గుర్తించారు. దాడులు నిర్వహించి రూ.7.5లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాదినం చేసుకున్నారు. మరో వైపు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నవాబ్ పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో పిడిఎస్ బియ్యం రవాణపై దాడులు నిర్వహించి మరో 144 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని స్వాదినం చేసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎవ్వరైన పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించిన, వ్యాపారం చేసిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మరో వైపు ప్రభుత్వం ప్రకటించిన నిషేధిత గుట్కాను అక్రమ రవాణకు పాల్పడిన, వ్యాపారం చేసిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పిడిన కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మాతా శిశు సంరక్షణ, జనాభా సమస్యలు తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంగా ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ డైరెక్టర్ రవీందర్‌నాయక్ తెలిపారు. ఎస్ఆర్ నగర్‌లోని స్వాగత్ గ్రాండ్‌లో గురువారం జరిగిన పపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ డిఎంహెచ్ఓ డా.రఘునాథస్వామి మాట్లాడుతూ విద్యా మరియు అవగాహన, గర్భ నిరోధక సాధనాల ప్రాధాన్యత, కుటుంబ నియంత్రణ సేవలు, మహిళా సాధికారత ఆరోగ్య సంరక్షణ మెరుగుదల విధానాలతో ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వైద్య ఆరోగ్య శాఖలో ఉత్తమ వైద్యులు, సూపర్‌వైజరీ మినిస్టీరియల్, నర్సింగ్ సిబ్బందికి మెమొంటోలతో సత్కరించారు.

## ఆనంద్‌బాగ్‌లో ఎంఎంటిఎస్ సౌకర్యం : ఎంపి ఈటల

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎప్పకప్పుడు రైల్వే విభాగం నూతన ప్రణాళికలతో కొత్త వాటిని అందుబాటులోకి తీసుకొని రావాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ కోరారు. గురువారం ఆయన హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే అధికారులతో కల్సి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. వినాయకనగర్ డివిజన్‌లోని వాజ్‌పేయి నగర్ రైల్వే క్రాసింగ్ వద్ద ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి రైల్వే విభాగం రైల్ అండర్ బ్రిడ్జి(ఆర్‌యుబి) నిర్మాణం చేపట్టాలన్నారు. రామకృష్ణాపురం బ్రిడ్జి వెడల్పు చిన్నగా ఉన్నందున ఈ మార్గంలో ప్రతి రోజు వేలాది సంఖ్యలో రాకపోకలు చేసే వాహనాలతో తీవ్రమైన రద్దీని నివారించటానికి మరో వంతెన ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆనంద్‌బాగ్ ఆర్‌యుబి వద్ద స్థానిక ప్రజల అవసరాల మేరకు ఎంఎంటిఎస్ రైల్వే స్టేషన్‌నిర్మాణానికి ఏర్పాటు చేయాలని ఎంపి ఈటెల రైల్వే అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వినాయకనగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, బిజెపికి చెందిన సుబ్బారావు, బాలింగం, వికె మహేష్, ఓం ప్రకాష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడ

# పాక్‌కు వెళ్లేది లేదు

**ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల వేదికలను మార్చాలంటున్న బిసిసిఐ!**



**ముంబయి :** ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నిర్వహణ కోసం సిద్ధం అవుతున్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పిసిబి)కి బిగ్ షాక్ తగిలింది. ఈ టోర్నీ కోసం భారత జట్టు.. పా కిస్థాన్‌కు వెళ్లదని భారత క్రికెట్ నియంత్రణ మండ లి (పిసిబిఐ) స్పష్టం చేసింది. ఈ టోర్నీలోని తమ మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. దుబాయ్‌లో లేదా శ్రీలంకలో తమ మ్యాచ్‌లను నిర్వహించాలని ఐసిసికి ప్రతిపా దించినట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ వ్యవహారంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు ఈ టోర్నీకి సంబంధించిన డ్రాఫ్ట్ షెడ్యూల్‌ను పిసిబి ఇప్పటికే ఐసిసికి అందజేసింది. ఫిబ్రవరి 19 నుంచి మార్చి9 వరకు ఈ టోర్నీని నిర్వహిస్తామ ని, మొత్తం 3 వేదికల్లో మ్యాచ్‌లు జరుగుతాయని పిసిబి తమ డ్రాఫ్ట్ షెడ్యూల్‌ను ఐసిసికి అందజేసింది. వన్డే వరల్డ్ కప్ 2023 ప్రద ర్శన ఆధారంగా ఆస్ట్రేలియా, భారత్, న్యూజి లాండ్ దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, ఇంగ్లాండ్ అఫ్గాని స్థాన్, బంగ్లాదేశ్ దేశాలు ఈ టోర్నీకి నేరుగా అర్హత సాధించాయి. టాప్8లో లేనప్పటికీ పాకిస్థాన్ ఆతి థ్య హోదాలో ఈ టోర్నీ ఆడనుంది. మొత్తం ఎని మిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్‌ఏలో భార త్, పాకిస్థాన్, న్యూజిలాండ్ బం గ్లాదేశ్, అలాగే గ్రూప్‌బీలో అఫ్గానిస్థాన్, ఆస్ట్రేలి యా, ఇంగ్లాండ్ దక్షిణాఫ్రికా జట్లు ఉన్నాయి. గ్రూప్ దశలో టాప్‌లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్ కు అర్హత సాధిస్తా యి. మార్చి 5, 6వ తేదీల్లో సెమీ స్ జరగనున్నా యి. అనంతరం సెమీస్ విజేతలు మార్చి 9న జరి గే ఫైనల్‌లో తలపడతాయి. కాగా, గ్రూప్‌ఏలో ఉన్న భారత్.. ఫిబ్రవరి 20న బంగ్లాదే శ్‌తో, ఫిబ్రవ రి 23న న్యూజిలాండ్‌తో, మార్చి 1న పాకిస్థాన్‌తో ఆడనుంది. టీమిండియా తమ మ్యాచ్ లన్నీ లా హోర్ వేదికగా ఆడనుంది. భారత్ నాకౌ ట్స్ దశకు చేరితే సెమీస్, ఫైనల్స్ కూడా లాహోర్‌లోనే ఆడ నుంది. అయితే 2008 తర్వాత టీమిండియా.. పాకిస్థాన్ పర్యటనకు వెళ్లలేదు. ఇ రుదేశాల సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు నేపథ్యం లో సత్సంబంధాలు లేవు. ఈ క్రమంలోనే పాకి స్థాన్‌కు టీమిండియా వెళ్లలేదని, తమ మ్యాచ్ లను తటస్థ వేదికల్లో నిర్వహించాలని బిసిసిఐ.. ఐసిసికి ప్రతిపాదించింది. అయితే హైబ్రిడ్ మోడల్‌కు పిసిబి ఒప్పుకోవడం లేదు.

# సెమీస్‌లో రిబకినా, జొకోవిచ్!



**లండన్ :** రెండో వింబుల్డన్ టైటిల్‌పై గురి పెట్టిన రిబకినా జోరు కొనసాగిస్తోంది. మెరుగైన ఆటతీరుతో ఆమె సెమీస్‌లో అడుగుపెట్టింది. మరోవైపు ఒస్టాపెంకోకు షాకిచ్చి క్రెజికోవా కూడా ముందం జ వేసింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జకోవి చ్‌కు వాకోవర్ లభించింది. వింబుల్డన్‌లో 2022 ఛాంపియన్ ఎలీనా రిబకినా దూసుకెళ్తోంది. కజకిస్థాన్‌కు చెందిన ఈ నాలుగో సీడ్ క్రీడాకారిణి బుధ వారం మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో 6–3, 6–2 తేడాతో స్వితోలినా (ఉక్రెయిన్)పై విజయం సాధించింది. పదునైన సర్వీస్‌లతో చెలరేగే రిబకి నా ఈ పోరులోనూ అదే దూకుడు కొనసాగించిం ది. ఈ మ్యాచ్‌లో ఆమె 7 ఏస్‌లు, 28 విన్నర్లు కొ ట్టింది. తొలి సెట్ మొదటి గేమ్ కోల్పోయిన రిబకి నా వెంటనే పుంజుకుంది. ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి 21తో ఆధిక్యంలోకి వెళ్లింది. స్వితోలినా కూ డా ప్రతిఘటించడంతో స్కోరు 33తో సమమైంది. ఇక అక్కడి నుంచి రిబకినాకు ఎదురులేకుండా పో యింది. రెండో సెట్లో మరింత విజృంభించి మ్యాచ్ గెలుచుకుంది. మరోవైపు 13వ సీడ్ వొస్టాపెంకో (లాత్వియా)ను కంగుతినిపించిన 31వ సీడ్ క్రెజి కోవా (చెక్ రిపబ్లిక్) తొలిసారి వింబుల్డన్ సెమీస్ చేరింది. క్వార్టర్స్‌లో క్రెజికోవా 6–4, 7–6 (7–4)తో గెలిచింది. రెండో సెట్లో ఓ దశలో 14తో వెనుకబడ్డప్పటికీ గొప్ప పోరాట పటిమ ప్రదర్శించిన క్రెజికోవా టైబ్రేకర్‌లో విజయతీరాలకు చేరింది.

**వాకోవర్‌తో:** పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవ రెట్ జకోవిచ్ సెమీస్ చేరాడు. తుంటి గాయంతో మ్యాచ్ ఆరంభానికి ముందే డిమినార్ (ఆస్ట్రే లియా) టోర్నీ నుంచి తప్పుకోవడంతో జకోవిచ్‌కు వాకోవర్ లభించింది. దీంతో ఫెదరర్‌తో సమా నంగా రికార్డు స్థాయిలో 13వసారి వింబుల్డన్ సెమీస్‌లో అడుగు పెట్టాడు.

## వారి కోసం నా ప్రైజ్‌మనీ వదులుకుంటా: రోహిత్ శర్మ

**ముంబయి :**టీ20 ప్రపంచకప్ 2024 విజేతగా నిలిచిన భార త జట్టుకు బిసిసిఐ రూ. 125 కోట్ల భారీ నజరానా ప్రకటించింది. ఈ ప్రైజమనీలో రూ.5 కోట్ల చొప్పున 15 మంది ఆటగాళ్లతో పా టు హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు పంచిన బిసిసి ఐ.. సపోర్ట్ స్టాఫ్‌కు రూ.రెండున్నర కోట్లు, రిజర్వ్ ప్లేయర్లు, సెలెక్షన్ కమిటీలోని సభ్యులకు రూ. కోటి చొప్పున అందజేసింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లకు రూ.2.5 కోట్లు పంచి న బిసి సిఐ.. కండిషనింగ్ కోచ్, ఫిజియోలకు రూ.2 కో ట్ల చొప్పున అందజేసింది. మిగత సపోర్ట్ స్టాఫ్‌కు తక్కువ డబ్బులు దక్కినట్లు తెలుస్తోంది. అయితే ఈ క్యాష్ ప్రైజ్ పంపిణీ సమయంలో కెప్టెన్ రోహి త్ శర్మ.. తక్కువ అమౌంట్ వచ్చిన సపోర్ట్ స్టాఫ్ కోసం తన రూ.5 కోట్ల బోనస్‌ను కూడా వదుల కునేందుకు సిద్ధమయ్యాడని ఓ సపోర్ట్ స్టాఫర్ మీ డియాకు తెలియజేశారు. ప్రైజమనీ సపోర్ట్ స్టాఫ్ కు అంత తక్కువ డబ్బు రాకూడదు. కావాలంటే నా బోనస్ వదులుకుంటాను. వాటిని సమంగా వారికి పంచండి' అని బిసిసిఐ అధికారులతో రోహిత్ వాదించాడని ఓ సపోర్ట్ స్టాఫర్ మీడియా తో అన్నాడు. రోహిత్ శర్మ చేసిన ఈ పనిపై సోష ల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురుస్తోంది.




## 'గేమ్ ఛేంజర్' పక్కా మాస్ చిత్రం

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కియారా అద్వానీ అలాగే అంజలిలు హీరోయిన్స్‌గా మావెరిక్ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న అవైటెడ్ భారీ చిత్రమే గేమ్ ఛేంజర్. మరి ఈ సినిమా శంకర్ నుంచి స్ట్రైట్ సినిమా కావడంతో గట్టి అంచనాలు నెలకొన్నాయి. ఇక అందుకు తగ్గట్టుగానే శంకర్ తన మార్క్ గ్రాండియర్ తో భారీ లెవెల్లో ఈ సినిమాని ప్లాన్ చేస్తుండగా రీసెంట్‌గా అయితే ఈ సినిమా పై కొంచెం క్లారిటీ కూడా అందించారు. ఇక దీనితో పాటుగా ఇప్పుడు ఈ సినిమాపై చేసిన మరిన్ని సాలిడ్ కామెంట్స్ అయితే ఇప్పుడు వైరల్‌గా మారాయి. తాను తెలుగులో స్ట్రైట్ సినిమా ఎప్పుడు నుంచో చెయ్యాలి అనుకుంటున్నాను అని గతంలో రెండు మూడు సార్లు అనుకున్నాను కానీ కుదరలేదు. ఈసారి తెలుగు ఆడియెన్స్ ఎలాంటి మాస్ సినిమా కావాలో అన్ని హంగులతో కలిపి గేమ్ ఛేంజర్ ని సిద్ధం చేస్తున్నానని తెలిపారు. ఇదొక ఒక్కా మాస్ చిత్రం అని కార్తీక్ సుబ్బరాజ్ నుంచి లైన్ తీసుకొని పూర్తిగా తెలుగు ఆడియెన్స్ ని మెప్పించే విధంగా ఒక స్ట్రైట్ సినిమాగా రూపొందించామని తెలిపారు. మరి శంకర్ నుంచే సినిమా కోసం ఇంత కాన్ఫిడెంట్ స్టేట్మెంట్ రావడంతో ఫ్యాన్స్ ఎగ్జైట్ అవుతున్నారు.




లీల

## విజయ్ 'ది గోట్' నుండి విజిల్ ఏస్కో ప్రోమో రిలీజ్!

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ ప్రధాన పాత్రలో, టాలెంటెడ్ డైరెక్టర్ వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). సెప్టెంబర్ 5, 2024న వరల్డ్ వైడ్‌గా థియేటర్లలో రిలీజ్ కానున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం నుండి విజిల్ ఏస్కో సాంగ్‌కు సంబంధించిన ప్రోమోను మేకర్స్ నేడు రిలీజ్ చేయడం జరిగింది. ప్రోమో ఎనర్జిటిక్‌గా ఉంది. అభిమానులని అలరిస్తుంది. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జయరామ్, ప్రశాంత్, స్నేహ, లైలా, యోగిబాబు, వీటీవీ గణేష్, అజ్మల్ అమీర్, మైక్ మోహన్, వైభవ్, ప్రేమి, అజయ్ రాజ్, అరవింద్ ఆకాష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై అర్చన కల్పాతి, కల్పతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్ గణేష్, కల్పాతి ఎస్ సురేష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

## సెన్సార్ పూర్తి చేసుకున్న నభా నటేష్ 'డార్లింగ్'




ప్రస్తుతం మన టాలీవుడ్ నుంచి వస్తున్నా ఇంట్రెస్టింగ్ చిత్రాల్లో ట్రైలర్ తో మంచి ఎంటర్టైన్మెంట్ ని ప్రామిస్ చేసిన లేటెస్ట్ చిత్రం డార్లింగ్ అని చెప్పాలి. యంగ్ నటుడు ప్రియదర్శి అలాగే యంగ్ హీరోయిన్ నభా నటేష్ నటించిన ఈ చిత్రం ఆడియెన్స్‌లో అయితే మంచి బజ్ ని రేకెత్తించింది. ఇక ఈ సినిమా ఇప్పుడు రిలీజ్ కి దగ్గరకి వస్తుండగా మేకర్స్ అన్ని పనులు పూర్తి చేసేస్తున్నారు. మరి అలా సినిమా వారం ముందే సెన్సార్‌ని కూడా ముగించేశారు. మరి దర్శకుడు అశ్విన్ రామ్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సెన్సార్ వారు యూ/ఏ సర్టిఫికెట్ ని అందించారు. దీనితో మేకర్స్ సాలిడ ఎంటర్టైన్మెంట్ ని ఈ మ్యాడ మాక్స్ మ్యారేజ్ డ్రామా అందిస్తుంది అ ని ప్రామిస్ చేస్తున్నారు. మరి ఈ సినిమా ఎలా ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా హను మాన్ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహించారు అలాగే ఈ జూలై 19న సినిమా రిలీజ్ కి రాబోతుంది.

## ప్రైవేటు సంస్థలకు ఏడు ప్రాజెక్టులు అప్పగించిన డిఆర్‌డిఒ

**న్యూఢిల్లీ :** భారతదేశ ప్రధాన రక్షణ పరిశోధన సంస్థ డిఆర్‌డిఒ ఏడు నూతన ప్రాజెక్టులను ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. నీటి అడుగున నుండి ఎగిరే మానవరహిత వాయు వాహనం, సుదూర ప్రాంతం నుండి రిమోట్ ద్వారా నడిపే వ్యవస్థలతో సహా కీలకమైన మిలిటరీ సంపత్తి తయారీ ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులను దేశీయ రక్షణ ఉత్పత్తిలో భాగంగా రక్షణ మంత్రిత్వ శాఖ సాంకేతిక అభివృద్ధి నిధి పథకం ఆ మోదం తెలిపింది. సముద్ర యుద్ధ రంగంలో వైవిధ్యమైన పరికరాల అభివృద్ధిలో భాగంగా నీటి అడుగున నుండి ఎగిరే మానవరహిత వాయు వా హనాన్ని తయారు చేసే లక్ష్యంతో ప్రాజెక్టు ఉంటుందని 'పిటిఐ'కి అధికారులు తెలిపారు. నిఘా, కాపలా, విచారణ(ఐఎస్ఆర్), తీర ప్రాంత అవగాహన (ఎండిఎ)లకు ఉద్దేశించినవి. ఈ ప్రాజెక్టు పుణెకు చెందిన సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపినట్లు 'పిటిఐ' వార్తా సంస్థ వెల్లడించింది. ఎయిర్‌క్రాఫ్ట్‌కు మంచును గుర్తించే సెన్సార్ అభివృద్ధి చేయడం, రాడార్ సిగ్నల్ ప్రాసెసర్ ఉత్పత్తి, సుదూర ప్రాంత నుండి రిమోట్ ద్వారా నడిపే వాహనా తదితర పనులను కొచ్చికి చెందిన ఐఆర్ఒవి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్‌కు అప్పగించారు. ఇంకా నొయిడాకు చెందిన ఆక్సిజన్ 2 ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ స్టార్టప్ కంపెనీకి, ఇచ్చారు.

## 'బెంగాల్' ఘటనలపై సిఇఒ నివేదిక కోరిన ఇసి

**కోల్‌కత్తా :** పశ్చిమ బెంగాల్‌లో బుధవారం జరిగిన నాలుగు ఉప ఎన్నికల్లో బోగస్ ఓట్లు, హింస, బెదిరింపులకు సంబంధించి బిజెపి ఇచ్చిన సుమారు వంద ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కేంద్ర ఎన్నికల సంఘం నివేదిక కోరింది. ఈ ఆరోపణలన్నీ నిరాధారమైనవని టిఎంసి కొట్టిపారేసింది. అయితే హింసకు సంబంధించి కొన్ని వార్తలు వచ్చాయని, కానీ మొత్తమ్మీద ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సిఇఒ ఆరిజ్ అఫ్తాబ్ తెలిపారు. ఎన్నికల్లో హింస, తప్పుడు పద్ధతులకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే తమ అధికారుల చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. అయితే కేంద్ర ఎన్నికల కమిషన్ నివేదిక కోరడంపై సిఇఒ స్పందిస్తారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## మనీష్ సిసోసిడియా వాదన వినేందుకు జడ్జి తిరస్కరణ

వేరే బెంచ్‌కు కేసు బదిలీ

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ నేత మనీష్ సిసోడియా రెండు బెయిల్ పిటిషన్‌లను పునరుద్ధరణపై వాదనలు వినేందుకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ తిరస్కరించారు. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కరోల్, సంజయ్ కుమార్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఎదుట ఈ పిటిషన్‌లు రాగా, తమ సహచరుడు సంజయ్‌కుమార్‌కు ఈ పిటిషన్‌లపై వాదనలు వినేందుకు వ్యక్తిగత కారణాల రీత్యా ఇబ్బందులు ఉన్నాయని జస్టిస్ ఖన్నా తెలిపారు. అయితే, ఈ కేసును అత్యవసర అంశంగా బెంచ్ లిస్ట్ చేయాలని, సమయం అత్యంత కీలకమైనదని సిసోడియా తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. రెండు కేసులలో కూడా ట్రయల్స్ మొదలు కాలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో మరో ధర్మాసనం జూలై 15న ఈ కేసులను విచారిస్తుందని న్యాయమూర్తులు తెలిపారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో సిబిఐ, ఇడి కేసులకు సంబంధించి జూన్ 4న సిసోడియా బెయిల్ పిటిషన్‌లను సుప్రీం కోర్టు తిరస్కరించింది. వాటిని పునరుద్ధరించాలని కోరుతూ వేసిన అభ్యర్థన గురువారం సుప్రీం కోర్టు బెంచ్ మీదకు రాగా, జూలై 15న మరో బెంచ్‌కు బదిలీ చేశారు.

# ప్రశ్నపత్రం స్క్రీన్‌షాట్ వైరల్

### యుజిసి నెట్ పేపర్ లీక్ ఆరోపణలపై సిబిఐ




**న్యూఢిల్లీ:** యుజిసి నెట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఆ ప్రశ్నపత్రం వక్రీకరించిన స్క్రీన్‌షాట్‌ను షేర్ చేసిన ఓ విద్యార్థిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ స్క్రీన్‌షాట్ ఆన్‌లైన్‌లో వైరల్ కావడంతో కేంద్ర విద్యాశాఖ పరీక్షను రద్దు చేసిన సంగ తి తెలిసిందే. ఈ వ్యవహారంలో విస్తతస్థాయి కుట్ర ఏమీ జరగలేదని సిబిఐ గుర్తించింది. లీకైన ఆ ప్రశ్నపత్రం వక్రీకరించినదని, ఆ స్క్రీన్‌షాట్ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టడం వెనక ఒక పాఠశాల విద్యార్థి ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఒక యాప్ ద్వారా ఈ చర్యకు ఒడిగట్టారని చెప్పారు. దానిపై డేట్‌ను జూన్ 17గా మార్పు చేశారని తెలిపారు. తనవద్ద పరీక్ష ప్రశ్నపత్రం కూడా ఉందని నమ్మించి, కొంత డబ్బు సంపాదించేందుకే దానిని వైరల్ చేసినట్లు వెల్లడించారు. అది మార్పులు చేసిన పేపర్ అని ఫోరెన్సిక్ నిపుణులు గుర్తించినట్లు చెప్పారు. ఈ వివరాలను సిబిఐ అనధికారికంగా ప్రభుత్వానికి వెల్లడించిందని, ఆ విద్యార్థిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు అర్హత సాధించడానికి, పిహెచ్‌డిల్లో ప్రవేశాలకు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత కోసం జూన్ 18న దేశవ్యాప్తంగా యుజిసి నెట్ పరీక్ష రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ కేంద్ర హోంశాఖ అధ్వర్యంలో పని చేసే భారతీయ సైబర్ నేర విచారణ సమన్వయ కేంద్రానికి (ఐసిసిసిసి) చెందిన జాతీయ సైబర్ నేర హెచ్చరికల విశ్లేషణ విభాగం యుజిసికి ఓ నివేదిక ఇచ్చింది. దీంతో పరీక్షల్లో అవకతవకలు జరిగాయనడానికి ప్రాథమిక ఆధారాలున్నాయని యుజిసి నిర్ధారించింది. పారదర్శకత, విశ్వసనీయత కోసం ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ సంచలన ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా అనేక కేంద్రాల్లో పెన్ను, పేపర్ విధానంలో నిర్వహించిన ఈ పరీక్షను 9 లక్షల మందికి పైగా విద్యార్థులు రాశారు.

**నీట్ ప్రశ్నపత్రం వైరల్ కాలేదు: సిబిఐ**

దేశవ్యాప్తంగా సంచలనం సష్టించిన నీట్ యూజీ పేపర్ లీకేజీ వ్యవహారంపై గురువారం సుప్రీంకోర్టులో సిబిఐ అఫిడవిట్ దాఖలు చేసింది. సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ దీనిలోని వివరాలను కొన్ని జాతీయ మీడియా కథనాలు ప్రచురించాయి. నీట్ పేపర్ లీక్ విస్తతస్థాయిలో జరగలేదని, ఒక ప్రాంతానికే పరిమితమని దర్యాప్తు సంస్థ తన అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు వెల్లడించాయి. బీహార్‌లో ఒక పరీక్ష కేంద్రంలో మాత్రమే పేపర్ లీక్ జరిగిందని, అది కొద్దిమంది విద్యార్థులపై మాత్రమే ప్రభావం చూపిందని సిబిఐ పేర్కొన్నట్లు సమాచారం. అలాగే లీకైన పేపర్ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టలేదని తన నివేదికలో ప్రస్తావించింది. ఇదిలాఉంటే... కేంద్రం వాదన కూడా ఇదేతరహాలో ఉంది. నీట్ (యూజీ)లో మాల్ ప్రాక్టీస్ జరిగిందనడానికి గానీ, కొన్ని కేంద్రాల్లో విద్యార్థులు లబ్ధి పొందేలా అక్రమాలు జరిగాయనడానికి గానీ ఎలాంటి ఆధారాల్లేవని కోర్టుకు సమర్పించిన పత్రాల్లో స్పష్టం చేసింది.

## యుపిలో పిడుగులు పడి 38 మంది మృతి



**లక్నో:** కొన్నిరోజులుగా భారీ వర్షాలు ఉత్తరాది రాష్ట్రాలను వణికిస్తున్నా యి. అదేసమయంలో పిడుగులు పడి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో బుధవారం ఒక్కరోజే కొన్ని జిల్లాల్లో పిడుగుపాటుకు గురై 38 మంది మత్యువాతపడ్డారు. అత్యధికంగా ప్రతాప్‌గఢ్ జిల్లాలోనే 11 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపా రు. సుల్తాన్‌పూర్‌లో ఏడుగురు, చందౌలీలో ఆరుగురు, మెయిన్‌పురిలో ఐదుగురు, ప్రయాగరాజ్‌లో నలుగురు మరణించారు. పిడుగుపాటుకు అనేకమంది గాయాలపాలయ్యారని అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్య ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. పిడుగుపాటు వల్ల ఎక్కువమంది ప్రతాప్‌గఢ్ జిల్లాలోనే మతి చెందారు. బాధితుల్లో ఎక్కువమంది 13 నుండి 15 సంవత్సరాల మధ్య వయసుగల వారేనని అధికారులు వెల్లడించారు. ఇదే జిల్లాలో పొలంలో పని చేస్తున్న సమయంలో పిడుగు పడడం వల్ల ఇద్దరు అన్నదమ్ములు చనిపోయారు. వర్షం కురుస్తున్న సమయంలో ఓ చెట్టు కింద తలదాచుకున్న మహిళ పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మతి చెందింది. ఔరయ్యా జిల్లాలో వర్షం కురుస్తున్న సమయంలో మామిడిచెట్టు కింద తలదాచుకున్న 14 ఏళ్ల బాలుడు పిడుగుపాటుకు గురై మతి చెందాడు. డియోరియో జిల్లాలో హదయవిదారక ఘటన చోటుచేసుకుంది. పొలానికి వెళ్తున్న ఓ ఐదేళ్ల చిన్నారిపై పిడుగుపడడంతో ఆ చిన్నారి మతి చెందాడు. రాష్ట్రంలో ప్రధాన నగరమైన వారణాసిలో పిడుగుపాటుకు ఇద్దరు అన్నదమ్ములు గాయపడ్డారు. ఇందులో ఒక సోదరుడు మతి చెందగా... మరొక సోదరుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రతాప్‌గఢ్ జిల్లా అధికారులు ఆసుపత్రికి తరలించారు.

## స్వదేశానికి ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ముగిసింది. ఈ నెల 8, 9 తేదీల్లో రష్యాలో పర్యటించిన మోదీ... తర్వాత ఆస్ట్రియా పర్యటనకు వెళ్లారు. తాజా గా రెండు దేశాల పర్యటనలు ముగించుకొని ప్రధాని భారత్ చేరుకున్నారు. గురువారం ఉదయం ఢిల్లీలోని పాలెం విమానాశ్రయంలో ఆయన దిగారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు మాస్కోలో మోదీ రెండు రోజులు పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా సోమవారం రాత్రి మోదీకి పుతిన్ తన అధికారిక నివాసంలో విం దు ఇచ్చారు. రెండో రోజు ఇద్దరు నేతలు విస్తృత చర్చలు జరిపారు. రష్యా అధ్యక్షుడి ముందు ఉక్రెయిన్ యుద్ధంపై మోదీ తన అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచా రం. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా తన సైన్యంలో నియమించుకొన్న భారతీయులకు విముక్తి కల్పించేందుకు, వారిని వీలైనంత త్వరగా భారత్ పంపేందుకు రష్యా అంగీకారం తెలిపింది. పుతిన్‌తో జరిగిన భేటీలో ఈ అంశాన్ని మోదీ లేవనెత్తడంతో ఈ పరిణామం చోటుచేసుకొన్నదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. రష్యా సైన్యంలో 3550 మంది భారతీయలు పని చేస్తుండొచ్చని విదేశాంగ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే 10 మంది తిరిగి భారత్‌కు వచ్చేశారని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ తెలిపారు. మాస్కో పర్యటన అనంతరం మోదీ మంగళవారం సాయంత్రం ఆస్ట్రియా వెళ్లారు. ఆ దేశ చాన్సలర్ కర్ల్ నెహామ్మర్‌తో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సం బంధాలను బలోపేతం చేసుకోవడంపై ఇద్దరు నేతలు చర్చలు జరిపారు. పశ్చిమాసి యా, ఉక్రెయిన్ సంక్షోభాలు చర్చకు రాగా, ఇది యుద్ధానికి సమయం కాదని మోదీ పేర్కొన్నారు. ఉక్రెయిన్, రష్యా శాంతి ప్రక్రియలో భారత్ ఎంతో ప్రధానమైనదని, అది శక్తివంతమైన, ప్రభావవంతమైన పాత్ర పోషించగలదని నెహామ్మార్ అన్నారు. అదే సమయంలో తమ దేశం తటస్థ విధానాన్ని అవలంబిస్తుందని అన్నారు.

## న్యాయవాదిపై దాడికి ఐఎఎల్ ఖండన

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** సిద్ధిపేటలో న్యాయవాదిపై పోలీసుల దురుసు ప్రవర్తనను ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. బెయిల్ జమానత్ పత్రాలను సమర్పించేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళిన న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడం ఆక్షేపణీయమన్నారు. ఈ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిద్ధిపేట న్యాయవాది పై దాడి ఘటన మీద హైకోర్టులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

## లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాలేదు

డికె శివకుమార్

**బెంగళూరు:** రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో తాము 14 నుంచి 15 స్థానాల్లో విజయం సాధిస్తామని ఆశించామని, కానీ ఆశించిన ఫలితాలు రాలేదని డిప్యూటీ సిఎం డికె శివకుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో కాంగ్రెస్ సాధించిన ఫలితాలపై ఆ పార్టీ నేతలు సమాలోచనలు జరుపుతున్నారు. మీడియాతో గురువారం మాట్లాడుతూ... తాము ఎక్కడ తప్పు చేశామో విశ్లేషించేందుకే సమావేశం నిర్వహించామని తెలిపారు. ఎక్కడెక్కడ పొరపాట్లు జరిగాయో విశ్లేషించుకుని, వాటిని సరిదిద్దుకుని భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ముందుకెళతామని చెప్పారు. బిజెపి, జెడిఎస్ రాబోయే రోజుల్లో కలిసి పోరాడతాయని తనకు తెలుసునని, భవిష్యత్‌లో ఈ రెండు పార్టీలను నిలువరించేందుకు ఏం చేయాలనే దానిపై కసరత్తు సాగిస్తున్నామని అన్నారు. కాగా, ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో విపక్ష ఇండియా కూటమిపై బిజెపి జెడియుతో కూడిన ఎన్డీయే పైచేయి సాధించింది. రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాలకు గాను కూటమి 19 స్థానాల్లో విజయం సాధించగా కాంగ్రెస్ కేవలం తొమ్మిది స్థానాలకు పరిమితమైంది. మాజీ సిఎం బసవరాజ్ బొమ్మై, హెచ్‌డి కుమారస్వామి, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ, బిజెపి యువమోర్చా అధినేత తేజస్వి సూర్య, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అల్లుడు రాధాకష్ణ దొడ్డమణి వంటి ప్రముఖులు విజేతల్లో ఉన్నారు.

## 'పెద్ద తప్పు చేశా.. నా కెరీర్ ముగిసింది'

ముంబయి కారు ప్రమాద నిందితుడు

**ముంబై:** కారుతో ఢీకొట్టి ఓ మహిళ మతికి కారణమైన ప్రధాన నిందితుడు తన తప్పు ఒప్పుకున్నాడు. తాను చేసిన తప్పును అంగీకరిస్తున్నానని, ఇక తన కెరీర్ ఇంతటితో ముగిసిపోయిందని మిహిర్ షా సిట్ విచారణలో అంగీకరించాడు. శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా ఇటీవల ముంబైలోని వర్లీ ప్రాంతంలో తెల్లవారుజామున మద్యం మత్తులో కారు నడిపి ఓ వివాహిత మరణానికి కారణమైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులైన మిహిర్, అతడి డ్రైవర్ రాజశ్రీ బిదావత్‌ను సిట్ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా నిందితుడు మిహిర్ తాను చేసిన తప్పునకు చింతిస్తున్నట్లు పోలీసుల ముందు వాపోయాడు. ప్రమాద సమయంలో కారు కింద మహిళ ఇరుక్కున్న విషయం తెలియదని నిందితులు వెల్లడించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ప్రమాదం జరిగిన తర్వాత కారు చక్రాల కింద మహిళ ఇరుక్కుపోయిన దశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. నిందితుడు మహిళను కారుతో లాక్కెళ్తున్న సమయంలో కొందరు వాహనదారులు కారు ఆపమని వారించినా వినిపించుకోలేదని పోలీసులు తెలిపారు. వారు ఇచ్చిన వాంగ్మూలాలను ధ్రువీకరించాల్సి ఉందని వెల్లడించారు. అలా 1.5 కిలోమీటర్లు ఈడ్చుకెళ్లిన తర్వాత మిహిర్, అతడి డ్రైవర్ సీట్లు మార్చుకున్నారు. ఇంజన్ బే వద్ద ఉన్న మహిళ మతదేహాన్ని తొలగించి రోడ్డుపై పడేశారు. అలాగే పోలీసుల్ని తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో అతడు జుట్టు ట్రిమ్‌చేసి, గడ్డం గీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ ఘటన తర్వాత అతడు ఆటోలో గర్ల్‌ఫ్రెండ్ ఇంటికి వెళ్లినట్లు గుర్తించారు.